



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

బిహార్‌లో ఓటర్లను ఏరివేసే ప్రమాదం
జిఎస్‌టిని సంస్కరించాలి
డిజిటల్ ఇండియా పదేళ్ళైనా..
గ్రామాలకు బ్రాడ్ బ్యాండ్ ఏదీ? : ఖర్గే
ప్రభుత్వంలో నాయకత్వ మార్పు ఉండదు...
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 212 | బుధవారం | 02-07-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## పాశ మైలారం బాధితులకు
# రూ.కోటి పరిహారం

- కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి ఇప్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ
- తక్షణ సాయంకింద మృతుల కుటుంబాలకు రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50వేలు ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం
- ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని సూచన
- ఇప్పటివరకు 36 మంది మృతిచెందినట్లు వెల్లడి
- కంపెనీ యాజమాన్యంపై సీరియస్
- ఆసుపత్రుల్లో క్షతగాత్రులకు పరామర్శ



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి

పాశ మైలారం మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం ఇప్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ నిచ్చారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి పరిహారం ఇప్పించాలని అధికారులతో చెప్పారు. ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో 143 మంది కార్మికులు ఉన్నారని, ఇప్పటివరకు 36 మంది మృతిచెందారన్నారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నట్లు భావిస్తున్నామన్నారు. ప్రమాద ఘటనపై నిపుణుల కమిటీతో దర్యాప్తు చేయిస్తున్నామన్నారు. తక్షణ సాయంగా మృతుల కుటుంబాలకు రూ. లక్ష, క్షతగాత్రులకు రూ.50వేలు అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. భారీ అగ్ని ప్రమాదం జరిగిన సిగాచి ఫార్మా పరిశ్రమను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఆవరణలో రాష్ట్ర స్థాయి ఉన్నత అదికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను వెలికి తీయడం కోసం ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నేతృత్వంలో



తరువాయి 2లో

## అత్యంత విషాదకర దుర్ఘటన : సిపిఐ

### నిరంతర నిర్లక్ష్యం, ప్రోటోకాల్స్ పాటించకపోవడమే కారణమని విమర్శ

**న్యూఢిల్లీ :** తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర దుర్ఘటనలో అనేక మంది మరణించడం, పలువురు గాయపడడం పట్ల సిపిఐ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. రాష్ట్ర పారిశ్రామిక దుర్ఘటనలలో ఇది అత్యంత విషాదకరమైనదని పేర్కొంది. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, క్షతగాత్రులకు, ఆచూకీ తెలియని వారి బంధువులకు సంఘీభావాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు సిపిఐ కార్యదర్శివర్గం మంగళవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేసింది. ఈ ఘోర ప్రమాదం కేవలం ఒక సంఘటన మాత్రమే కాదని, నిరంతర నిర్లక్ష్యం, రక్షణ విధానాల పట్ల విముఖత, నిరంతర నిర్వహణ ప్రోటోకాల్స్ రహిత చర్యల ఫలితమేనని సిపిఐ పేర్కొంది. పారిశ్రామిక

తరువాయి 2లో



న్యూఢిల్లీలోని అజయ్‌భవన్‌లో మంగళవారం నాడు సిపిఐ కార్యదర్శివర్గ సభ్యుడు రామకృష్ణ పాండ అధ్యక్షతన జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా తాజా రాజకీయ పరిణామాలను వివరించారు. బుధ,గురువారాలలో సిపిఐ జాతీయ సమితి సమావేశాలు ఢిల్లీలో జరగనున్నాయి.

## నదీజలాలపై కిషన్‌రెడ్డికి
# బాధ్యత లేదా?

### కెసిఆర్‌ను బతికించేందుకు బిజెపి పరోక్షంగా యత్నం




- బిఆర్‌ఎస్ చచ్చిన పాము
- రాష్ట్ర వ్యవహారాలపై కిషన్‌రెడ్డి తీరు అనుమానాస్పదం
- రాజకీయ మనుగడకోసమే బిఆర్‌ఎస్ బిజెపిల తాపత్రయం
- తెలంగాణ హక్కులు సాధించేందుకు ప్రయత్నించాలి
- రాష్ట్ర జలాలను తాకట్టుపెట్టిన బిఆర్‌ఎస్ పాలకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి బురద అంటించాలని చూస్తున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం
- పోలవరం – బనకచర్ల ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాపక్షం/ హైదరాబాద్

నీటి కేటాయింపులపై హక్కులను సాధించుకోవాలంటే కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి చేయాలని, నిలదీయాలని, ఇదే మన ఎజెండా అని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. బిఆర్‌ఎస్ సచ్చిన పాము అని, దాని గురించి సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. బిజెపి తెలంగాణకు నీటి కేటాయింపుల మీద పదకొండు సంవత్సరాల నుంచి ఏ విధమైన నిర్లక్ష్యం, సహాయ నిరాకరణ చేస్తుందో, ఈ రోజు కూడా అదే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కెసిఆర్‌ను బతికించేందుకు బిజెపి పరోక్షంగా ప్రయత్నిస్తున్నదని, దానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అని ఆరోపించారు. ఆయన మాట్లాడే ప్రతీ మాట కెటిఆర్ కార్యాలయం నుంచి వచ్చే ప్రెస్ నోట్‌లోనిదేనని, ఇది అధికారికంగా కిషన్ రెడ్డిపై తాను చేస్తున్న ఆరోపణ అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తాము కేంద్ర జలశక్తి మంత్రి, మెట్రో కోసం కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి కోసం వెళ్ళేందుకు అపాయింట్‌మెంట్ తీసుకున్న ముందు రోజే కిషన్‌రెడ్డి వాళ్ళను కలుస్తున్నారని, ఆయన వ్యవహరిస్తున్న తీరు అనుమానాలు కలిగిస్తున్నదని అన్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేయడమే కాకుండా, తెలంగాణ ప్రజల అవసరమైన హక్కుల సాధించడానికి మీరు ప్రయత్నం చేయాలని, మీరు మీ బాధ్యత నుంచి తప్పించుకోలేరని కిషన్‌రెడ్డిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాగే కొత్తగా ఎన్నికైన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మొదటి కార్యాచరణగా రాష్ట్రానికి గోదావరి జలాల అంశాన్ని తీసుకోవాలని, అందుకు అవసరమైన సమాచారాన్ని, మంత్రులు, అధికారులు అందిస్తారని తెలిపారు. హైదరాబాద్‌లోని డాక్టర్ .జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సోమవారం గోదావరినదిపై ఎపి ప్రభుత్వంతలపెట్టిన పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, కార్పొరేషన్ చైర్మన్‌లకు నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

తరువాయి 2లో

## ‘బనకచర్ల’ తిరస్కరణ
# తాత్కాలికమే

గోదావరి –బనక చర్ల ప్రాజెక్టు కేంద్ర పర్యావరణ శాఖ కేంద్రం తిరస్కరించడం కేవలం తాత్కాలికమేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇది. కేవలం కామా మాత్రమేనని, ఫుల్‌స్టాప్ కాదని పేర్కొన్నారు.. ఎందుకంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మనుగడ చంద్రబాబు మీద, చంద్రబాబు మనుగడ గోదావరి బనకచర్ల మీద ఉందన్నారు. నదుల ఇంటర్ లింకేజీ లాగే రాజకీయ ఇంటర్ లింకేజీ ఉందన్నారు. అందుకే మన తెలంగాణలో కడుతున్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పక్కగా లెక్కలు రాసి కేటాయింపుల ద్వారా పరిష్కారించుకోవాల్సిందేనన్నారు. ఇది నెలలో, ఏడాదికి తేలే అంశం కాదని సిఎం పేర్కొన్నారు. చంద్రశేఖర్‌రావు సృష్టించిన సమస్య శాశ్వతం కాదని, నీటి కేటాయింపులు శాశ్వతమన్నారు. దీనిని సాధించుకునేందుకు మనమందరం బాధ్యతగా గుర్తించి అందరం ఒక్కటే మాట ముందుకు సాగాలని సూచించారు.

## వసతిగృహాల్లో వసతులపై
# నివేదిక ఇవ్వండి

- హాస్టల్స్‌లో అధికారుల పర్యటన సమీక్షపై పకడ్బందీగా క్యాలెండర్ రూపొందించాలి
- విద్యార్థులందరికీ ఆరోగ్యపరీక్షలు నిర్వహించి హెల్త్‌కార్డులు తయారు చేయాలి
- సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్

సంక్షేమ హాస్టల్స్‌లో అధికారుల పర్యటన, సమీక్షపై పకడ్బందీ క్యాలెండర్ రూపొందించాలని రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో మంగళవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ అధికారి, ఏ రోజు పర్యటించారు, వారు పరిశీలించిన అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించాలని డిప్యూటీ సిఎం సూచించారు. ఈ పర్యటన కార్యక్రమం నిరంతరం సాగాలని, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలను సైతం పర్యటనకు ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థుల సంక్షేమాన్ని

తరువాయి 12లో



## నాలుగు రోజులు
# వర్షాలు

### వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మంగళ, బుధ వారాల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో వర్ష తీవ్రత మరింత పెరిగే అవకాశముందన్నారు. కాగా హైదరాబాద్ నగరంలో గత రాత్రి భారీ వర్షం కురిసింది. పంజాగుట్ట, లక్డీకాపూల్, మలక్‌పేట, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్, షేక్‌పేట, ఖాజాగూడ, మణికొండ, మేడ్చల్, సికింద్రాబాద్, హిమాయత్‌నగర్, నారాయణగూడ, రాంనగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో రహదారులపై భారీగా వరదనీరు నిలిచింది. బలమైన ఈదురుగాలులతో మణికొండ, అత్తాపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.




## కొత్త పాత
# పంచాయితీ లేదు

- బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు
- పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా.. గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దాం

ప్రజాపక్షం/హైదరాబాద్

బిజెపిలో కొత్త, పాత అనే పంచాయితీ లేదని బిజెపి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్.రాంచందర్ రావు అన్నారు. నది ప్రవహించాలంటే కొత్త నీరు రావాల్సిందేనని అన్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాంచందర్ రావు మంగళవారం హైదరాబాద్ శివారులోని మన్నెగూడలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను సౌమ్యుడినే, యుద్ధంలోకి దిగితే యోధుడినే, కత్తి దూయడంలో ముందుంటా అన్నారు. కలిసికట్టుగా అందరితో కలిసి పనిచేస్తానని, బిజెపిని అధికారంలోకి తీసుకొస్తా అని ధీమా వ్యక్తం చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకూ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ వాట్సాప్ యూనివర్శిటీలను పెట్టుకుని ఫేక్ న్యూస్‌ను ట్రోలింగ్ చేస్తున్నారని, తప్పుడు ప్రచారం చేసే సూత్రధారులను బోనులో నిలబెట్టేందుకూ వెనుకాడనని అన్నారు. దమ్ములేని పిరికి పందలు కాబట్టే వెనకనుండి ఫేక్ న్యూస్ ట్రోల్

తరువాయి 12లో

# నూతన క్రీడా విధానం


- కేంద్ర కేబినేట్ ఆమోదం
- ‘ఖేలో భారత్ నీతి’ పేరిట అమలు
- 2036 ఒలింపిక్స్‌లో బలీయమైన భారతదేశమే లక్ష్యం



**న్యూఢిల్లీ:** ఇప్పటివరకూ అమలులో ఉన్న జాతీయ క్రీడా విధానం స్థానంలో ఇకమీదట ‘ఖేలో భారత్ నీతి’ అమలులోకి వస్తుంది. న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారంనాడు జరిగిన కేంద్రమంత్రివర్గం దీనికి ఆమోదం తెలియజేసింది. ఈ వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ప్రపంచ క్రీడలలో భారతదేశాన్ని టాప్–5 స్థానంలో నిలబెట్టేందుకు, క్రీడారంగానికి సరికొత్త సొబగులు దిద్ది ఉన్నత ప్రమాణాలతో ముందుకు తీసుకువెళ్ళేందుకు ఈ ‘ఖేలో భారత్ నీతి’కి ఆమోదం తెలియజేశారు. భారతదేశ క్రీడల వ్యవస్థను మరింత ఉత్తమంగా తీర్చిదిద్దడానికి తగిన ప్రణాళికను, పథకాలను తయారు చేయడానికి దీనిని అమలు చేస్తారు. సంబంధిత ప్రణాళికను, పథకాలను


తరువాయి 2లో

## ట్రంప్ మెగా బిల్లుకు
# సెనేట్ ఆమోదం



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిష్ఠాత్మకంగా భావించిన మెగా బిల్లు (బిగ్ బ్యూటిఫుల్ బిల్)కు సెనేట్‌లో ఆమోదం లభించింది. గంటలతరబడి చర్చలు, ప్రతిష్టంభన తర్వాత అధికార రిపబ్లికన్లు చాలా స్వల్ప తేడాతో అంటే ఒకే ఒక్క ఓటుతో చావు తప్పి కన్నులొట్టపోయిందన్న సామెత చందంగా బిల్లుకు ఆమోదం లభించింది. సామాజిక సంక్షేమ కార్యక్రమాలలో కోతలు విధించి యుద్ధ పరికరాలకు, సరిహద్దు రక్షణ చర్యలకు ఆ ధనాన్ని ట్రంప్ ఉపయోగిస్తారన్నది ఈ బిల్లుపై ప్రధాన అభియోగం. నిర్ణీత ప్రకారం ఈ బిల్లును జులై నాలుగో తేదీనాటికి ఆమోదం పొంది చట్టరూపం తీసుకోవడానికి సంతకం చేసేవిధంగా తిరిగి తనవద్దకు వచ్చేలా చూడాలని అధికారపార్టీ రిపబ్లికన్లు అత్యధికంగా ఉండే ప్రజా ప్రతినిధుల సభకు ట్రంప్ ఆదేశించారు. సెనేట్‌లో దాదాపు ఇరవైనాలుగు గంటల చర్చ, ప్రతిష్టంభన తర్వాత అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ విజేత ఎవరో తేల్చడానికి టై–బ్రేకింగ్ ఓటు వేయడంతో బిల్లు ఆమోదం పొందింది.

## మినీ స్టేడియం
# కల.. కలేనా?



- అనువైన స్థలం ఉన్నప్పటికీ నోచుకోని వైనం
- ఇబ్బందుల్లో క్రీడాకారులు

ప్రజాపక్షం/ముధోల్

నియోజకవర్గ కేంద్రమైన ముధోల్‌లో మినీ స్టేడియానికి మోక్షం ఎప్పుడు అవుతుందని పలువురు క్రీడాకారులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఏండ్లు గడుస్తున్నా అడుగు ముందుకు పడడం లేదు. క్రీడాకారులు క్రీడారంగంలో రాణించడానికి ఆసక్తి చూపుతున్నప్పటికీ అనువైన ఆటస్థలం లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. మినీ స్టేడియం నిర్మిస్తామని దశాబ్ద కాలంగా పాలకులు హామీలు ఇస్తున్నా, నేటికీ నెరవేరడం లేదు. ఆటస్థలం లేకపోవడం గత్యంతరం లేక పాఠశాల మైదానాలే దిక్కయ్యాయని క్రీడాకారులు వాపోతున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పలువురు మండల,తాలూకా స్థాయిలో క్రికెట్ పోటీలను ఎంతో కష్టం మీద పాఠశాల మైదానంలోనే నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉద్దేశంతో పలుమార్లు పాఠశాల సెలవు దినాల్లో క్రీడలను నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**నేటికీ నెరవేరని పాలకుల హామీ**

ముధోల్‌లో మినీ స్టేడియం నిర్మిస్తామని ప్రతి ఎన్నికల్లో హామీ ఇచ్చి

తరువాయి 12లో



## పాక్ చెరలో 246 మంది భారతీయులు

**న్యూఢిల్లీ :** భారత్, పాకిస్థాన్‌లు తమ కస్టడీలో ఉన్న పౌర ఖైదీలు, మత్సకారుల వివరాల జాబితాలను మంగళవారం పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. వీటి ప్రకారం ప్రస్తుతం పాక్ చెరలో భారతీయులు, భారతీయులుగా పరిగణిస్తున్న 246 మంది పేర్లను వెల్లడించింది. వారిలో 53 మంది పౌర ఖైదీలు, 193 మంది మత్సకారులు ఉన్నారు. ఇస్లామాబాద్‌లోని

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## వడగాలులు,దావానలం గుప్పెట్లో యూరప్
### టర్కీలో వేలాది ఇళ్ళు ఖాళీచేసిన ప్రజలు

**ఏథెన్స్ :** గ్రీస్, టర్కీ దేశాలు తీవ్రమైన వడగాలులు, దావానల బీభత్సంతో పోరాడుతున్నాయి. ఈ ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెంటీగ్రేడ్స్‌ను దాటింది. వడగాలులవల్ల ఇటలీలో ఇద్దరు మరణించారు. తీవ్రమైన వడగాలుల కారణంగా దావానలం చెలరేగిపోతోంది. ముఖ్యంగా యూరప్ దేశాలను వడగాలులు వణికిస్తున్నాయి. తూర్పు ఇంగ్లాండ్‌లో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెంటీగ్రేడ్స్. నెదర్లాండ్స్‌లో ఉష్ణోగ్రత ఇటీవలి సంవత్సరాలలో ఎన్న డూలేనిరీతిలో 30 డిగ్రీల సెంటీగ్రేడ్స్ దాటింది. ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్ దేశాలలో 46 డిగ్రీలకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దావానలం ఉద్ధృతి వడగాలులవల్ల టర్కీ, గ్రీస్‌లలో మరింత వేగంగా విస్తరిస్తోంది. ఫ్రాన్స్ దేశం కూడా 16 కీలకశాఖలను అప్రమత్తం చేసి రెడ్ ఎలర్ట్ ప్రకటించింది. ఈఫిల్ టవర్‌ను ప్రభుత్వం మూసివేసింది. పశ్చిమ టర్కీలో దావానల జ్వాలలను భరించలేక 14 వేల గ్రామాలలో 56000 మంది ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోయారని టర్కీ అధికారులు చెప్పారు. పెనుగాలులవల్ల అగ్ని కీలలు వేగంగా విస్తరిస్తున్నాయి. భారీసంఖ్యలో సహాయబృందాలు రంగంలోకి దిగాయి. టర్కీలో 1350 పాఠశాలలను తాత్కాలికంగా మూసివేశారు.


## థాయ్ ప్రధాని షినవత్రపై కోర్ట్ సస్పెన్షన్ వేటు



**బ్యాంకాక్ :** టెలిఫోన్ సంభాషణ వివాదంలో చిక్కుకున్న థాయ్‌లాండ్ ప్రధానమంత్రి పేటోంగ్టార్న్ షినవత్రపై న్యాయస్థానం సస్పెన్షన్ వేటు వేసింది. ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు నిర్వహించడంపై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులు ఈ కేసు విచారణ పూర్తయ్యే వరకూ అమలులో ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిపై పేటోంగ్టార్న్ స్పందిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులను శిరసావహిస్తానని విధేయత ప్రకటించారు. తనకు మద్దతు ఇచ్చినవారందరికీ కృతజ్ఞతలు, దేశ ప్రజలకు క్షమాపణలు తెలియజేశారు. రాజ్యాంగ న్యాయస్థాన ధర్మాసనం 7–1 ఓటింగ్ మెజారిటీ తీర్పు ద్వారా జులై ఒకటో తేదీ నుండి పేటోంగ్టార్న్‌ను ప్రధానమంత్రి విధులనుండి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వు జారీ చేసింది. పేటోంగ్టార్న్ తన వాదనలను సమర్థించుకోవడానికి, సాక్ష్యాలు సమర్పించడానికి న్యాయస్థానం 15 రోజులు గడువు ఇచ్చింది. 39 ఏళ్ళ అతిచిన్న వయసులో ఆమె ప్రధానమంత్రి పదవి చేపట్టారు. ఆమె తండ్రి తక్షిన్ షినవత్ర కూడా ప్రధానమంత్రిగా పనిచేశారు. సరిహద్దుల్లో కంబోడియా దేశంతో సంబంధాలు అంతంతమాత్రంగా ఉన్న తరుణంలో పేటోంగ్టార్న్ మంత్రివర్గ విలువలను, రాజ్యాంగ విలువలను మంటగలిపి టెలిఫోన్ సంభాషణలో జాతి విరుద్ధంగా మాట్లాడారని ఆరోపిస్తూ ప్రతిపక్ష కన్జర్వేటివ్ ప్రతినిధుల బృందం దేశ ఉన్నత న్యాయస్థానంలో కేసు దాఖలు చేసింది. దీనికి అనుగుణంగా పై విధంగా తీర్పు వెలువడింది. థాయ్‌లాండ్–కంబోడియా దేశాలమధ్య దీర్ఘకాలంగా సరిహద్దు వివాదాలున్నాయి. ఇటీవల మే నెల 28న జరిగిన ఘర్షణలో ఒక కంబోడియా సైనికుడు మరణించాడు. ప్రధానమంత్రి హోదాలో పేటోంగ్టార్న్ ఆ దేశ మాజీ ప్రధానమంత్రి, ప్రస్తుతం సెనేట్ అధ్యక్షుడు హున్‌సెన్‌తో ఫోన్‌లో సంభాషించారు. ఆయన కుమారుడు హున్ మానెట్ ప్రస్తుతం కంబోడియా ప్రధానమంత్రిగా ఉన్నారు. కుమారుడు ప్రధానమంత్రిగా ఉన్నాగానీ, దేశ రాజకీయాలను హున్‌సెన్ ప్రభావితం చేస్తూ ఉండటంతో పేటోంగ్టార్న్ షినవత్ర ఆయనతోనే ఫోన్ సంభాషణ చేశారు. ఈ ఫోన్ సంభాషణ బయటకు పొక్కడంతో ఆమె రాజకీయ జీవితానికే ఇప్పుడు ఎసరు వచ్చింది.

# రష్యా సైనిక కర్మాగారంపై ఉక్రేన్ దాడి

## ముగ్గురు మృతి
### డ్రోన్ వార్‌ఫేర్ ప్రయోగశాలగా మారిన యుద్ధం



**కీవ్ :** జూన్‌నెలలో రష్యా రికార్డుస్థాయిలో భీకరదాడులు చేసిన తర్వాత ఉక్రేన్ సైన్యం మంగళవారంనాడు ప్రతీకారదాడులకు దిగింది. ఉక్రేన్‌కు 1300కి.మీ దూరంలో ఉన్న రష్యా సైనిక కర్మాగారంపై చేసిన దాడిలో ముగ్గురు మరణించారు. మరో 35 మంది తీవ్రంగా గాయపడ్డారు. రష్యా ఉడ్ముర్టియా గవర్నర్ అలెగ్జాండర్ బ్రెచలోవ్ ఈ విషయం చెప్పారు. కుపోల్ ఎలక్ట్రో మెకానికల్ ప్లాంట్ లక్ష్యంగా ఈ దాడి జరిగింది. ఈ సైనిక కర్మాగారంలో గగనతలానికి సంబంధించిన క్షిపణి వ్యవస్థలను, రాడార్ వ్యవస్థలను ఉత్పత్తి చేస్తారు. ఈ విషయం వెంటనే దేశాధ్యక్షుడు పుతిన్‌కు తెలియజేసినట్లు బ్రెచలోవ్ చెప్పారు.

ఆయుధాల తయారీకి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ నిర్ణయించుకున్న తర్వాత జూన్ నెలలో రష్యా రికార్డు స్థాయిలో అనేకసార్లు భారీ దాడులు చేసింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైన తర్వాత రెండు దేశాలు పట్టువదలకుండా పరస్పరం విడతలవారీగా దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. జూన్ నెలలో రష్యా దాదాపు 1000కి.మీ సరిహద్దు ప్రాంతాల నుండి ఉక్రేన్‌పై తీవ్ర యుద్ధంతో ఒత్తిడి తీసుకువచ్చింది. గడచిన 30 రోజుల్లో ఉక్రేన్‌పై 5,438 డ్రోన్లను ప్రయోగించింది. ఈ విధంగా డ్రోన్ల యుద్ధంలో సరికొత్త నెలవారీ రికార్డు సాధించిందని అసోసియేటెడ్ ప్రెస్ నివేదిక తెలియజేసింది. ఈ దాడులతో అత్యాధునిక డ్రోన్ టెక్నాలజీని రెండు దేశాలూ బాగా ఉపయోగించుకుంటున్నాయి. సరికొత్త యుద్ధతంత్రాన్ని అమలు చేసేందుకు ఆయుధాలు ఎలా పనిచేస్తున్నాయో, ఫలితాలను అందరూ తెలుసుకుని అర్థం చేసుకోవడానికి గడచిన మూడు సంవత్సరాలుగా రెండు దేశాలమధ్య యుద్ధం ఒక ప్రయోగశాలగా మారింది. మరోవైపు ఉక్రేన్ కూడా పట్టువదలకుండా డ్రోన్ల ఉత్పత్తిని గణనీయంగా పెంచింది. డ్రోన్లను భద్రపరచే కేంద్రాలను విస్తరించింది. రష్యాకు దగ్గరగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేసుకుంది. దాడులలో వేలాదిమంది ఉక్రేన్ సైనికులు ఇప్పటివరకూ మరణించారని రష్యా వార్తా సంస్థ 'టాస్' దాదాపు ప్రతిరోజూ వార్తలు ప్రకటిస్తోంది. ఇస్తాంబుల్ వేదికగా రెండు విడతలుగా రెండు దేశాలమధ్యా చర్చలు జరిగినప్పటికీ సైనికులను, వారి మృతదేహాలను ఇచ్చిపుచ్చుకోవడం తప్ప కాల్పుల విరమణకు, శాంతి సాధనకు సంబంధించిన పురోగతి రాలేదు. ఇప్పుడు అమెరికా కంటే యూరప్ ఎక్కువగా ఉక్రేన్‌కు ఆయుధ సహాయం చేస్తోంది. 202 జూన్ నుండి చూస్తే ఇప్పుడు యూరప్ సహాయం మొత్తం 72 బిలియన్ యూరోలు దాటపోయింది. అమెరికా నుండి ఉక్రేన్‌కు 65 బిలియన్ యూరోల సాయం మాత్రమే లభించింది.


## మహ్మద్ ప్రవక్తపై కార్టూన్లు
# టర్కీలో అల్లర్లు

**ఇస్తాంబుల్ :** మహ్మద్ ప్రవక్తను వ్యంగ్యంగా చిత్రీకరిస్తూ కార్టూన్లు గీశారన్న ఆరోపణపై ఒక పత్రికను వ్యతిరేకిస్తూ టర్కీలో ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు, అల్లర్లకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు వారిపై రబ్బరు బుల్లెట్లు, భాష్పవాయువు ప్రయోగించారు. ఈ కేసులో నలుగురు జర్నలిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. సెటైరికల్ ''లెమాన్' మ్యాగజైన్ పత్రికలో ప్రవక్తకు వ్యతిరేకంగా కార్టూన్లు గీసిన కార్టూనిస్టు, పత్రిక ఎడిటర్–ఇన్–చీఫ్, గ్రాఫిక్ డిజైనర్లను అరెస్టు చేసినట్లు టర్కీ హోంమంత్రి అలీ ఎర్లికయా ఎక్స్ వేదికగా అనేకసార్లు పోస్టింగులు పెట్టారు. ఇస్తిక్లాన్ ఎవెన్యూలోని పత్రిక కార్యాలయాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని, పత్రికలో పనిచేసే ఇతర అనేకమంది ఎగ్జిక్యూటివ్‌లను కూడా అరెస్టు చేశామని దేశాధ్యక్షుడి ప్రెస్ సహాయకుడు ఫహ్రెట్టిన్ అల్టిన్ కూడా ఎక్స్ వేదికగా ప్రకటించారు. మత విలువలను బహిరంగంగా అవమానించిన పత్రిక ఎడిటర్లను అరెస్టు చేయాలని చీఫ్ ప్రాసిక్యూటర్ ఆదేశాలు జారీ చేసిన వెంటనే అల్లర్లు మొదలయ్యాయి. లెమాన్ సిబ్బంది తరచుగా వెళ్ళే బార్‌ను అల్లరిమూకలు ధ్వంసం చేశాయి. ఐతే ''లెమన్ మ్యాగజైన్'' ఒక వివరణ ఇస్తూ కార్టూను ద్వారా వ్యక్తం చేయాలనుకున్న తమ ఉద్దేశాలను తప్పుగా అర్థం చేసుకున్నారని పేర్కొంది. గతనెల 26వ తేదీ నుండి ప్రభుత్వం ఈ కార్టూన్లపై దర్యాప్తు ప్రారంభించింది. ''బాంబులతో దద్దరిల్లుతున్న ఒక నగరంపైన ఆకాశంలో రెండు పాత్రలు విహరిస్తున్న దృశ్యాలను కార్టూనులో చిత్రీకరించారు. ఈఇద్దరిలో ఒకవ్యక్తి ''సలామ్ అలేకుం, ఐయామ్ మహ్మద్'' అని పరచయం చేసుకుంటే, రెండోవ్యక్తి ఆలేకుం సలాం, ఐ యామ్ మూసా'' అని బదులిస్తున్న కార్టూను ప్రచురితమైంది. ఐతే పత్రిక ప్రధాన బాధ్యుడు టుంకే అక్గున్ పారిస్ నుండి ఫోన్ ద్వారా వివరణ ఇస్తూ, ఈ వ్యంగ్య చిత్రాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారనీ, అది ప్రవక్త వ్యంగ్య చిత్రంకాదనీ, ఇజ్రాయెల్‌లో మరణించిన ఎంతో మందికి చిహ్నంగా ఒకవ్యక్తిని సింబాలిక్‌గా గీశామని, ముస్లిం ప్రపంచంలో ఎంతోమంది పేర్లు మహ్మద్‌గానే ఉంటాయని, అవమానకరమైన చిత్రాలుగీసి అలాంటి రిస్కులు కొనితెచ్చుకోమని వివరణ ఇచ్చారు.

## గాజాలో అల్ బక్వా కేఫ్ ధ్వంసం
### 74 మంది పాలస్తినా పౌరులు మృతి

**కైరో :** గాజాలో గడచిన 24 గంటల్లో ఇజ్రాయెల్ చేసిన గగనతల దాడుల్లో 74 మంది మరణించారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక ఉత్తర గాజాలోని సముద్రం ఒడ్డున ఉన్న 'అల్ బక్వా కేఫ్'పై ఇజ్రాయెల్ యుద్ధ విమానదాడిలో 25 మంది మరణించారు. ఈ కేఫ్ ఎంతో సురక్షితమైనదిగా ఇప్పటివరకూ అందరూ భావించారు. జర్నలిస్టులతోపాటు ఎంతోమంది ప్రముఖులు, సహాయ బృందాలు, సామాన్య పౌరులు తరచు ఈ కేఫ్‌ను విజిట్ చేస్తూ ఉంటారు. గడచిన 21 నెలలుగా గాజాలో యుద్ధం కొనసాగుతున్నప్పటికీ దాడులకు దూరంగా ఎలాంటి విరామం లేకుండా ఆ కేఫ్ ఒక్కటే ప్రజల ఆహార అవసరాలను తీరుస్తోంది. ఈ కేఫ్ ధ్వంసమైన దృశ్యాల వీడియోలు సోషల్ మీడియా ద్వారా అందరూ వీక్షిస్తున్నారు. ఆహారంకోసం అలమటించిపోయే పాలస్తినా ప్రజలు ఈ కేఫ్‌కు వస్తారు. ఈ గగనతల దాడుల్లో పిల్లలు, మహిళలు, వృద్ధులు మరణించారని దాడుల్లోంచి బయటపడిన అలీ అబు ఆటైలా చెప్పారు. ''ఎలాంటి హెచ్చరికలూ లేకుండా ఆకస్మికంగా ఒక యుద్ధ విమానం ఈ కేఫ్‌ను ధ్వంసం చేసింది, ఒక భూకంపం వచ్చినవిధంగా కేఫ్ ధ్వంసమైపోయింది'' అని ప్రత్యక్ష సాక్షి చెప్పారు. ఈ ఘటనలో డజన్ల సంఖ్యలో ప్రజలు తీవ్రంగా గాయపడ్డారని ఆరోగ్యశాఖ ఎమర్జెన్సీ విభాగం అధిపతి ఫారెస్ అవాద్ చెప్పారు. అదే విధంగా గాజా నగరంలో మరో రెండు చోట్ల కూడా గగనతల దాడులు జరిగాయి. ఈ దాడుల్లో మరో 15 మంది మరణించారు. షిఫా ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం ప్రకారం, అనేకమంది గాయపడినవారు చికిత్సకోసం వచ్చారు. అదేవిధంగా దాడుల్లో జవైదా పట్టణంలోని ఒక భవంతిని ధ్వంసం చేయడంతో ఆరుగురు ప్రజలు మరణించారు. మరోవైపు ఆహారంకోసం సహాయ కేంద్రాలవల్ల వేచి ఉంటున్న పాలస్తినా ప్రజలపై కాల్పులు జరిపి చంపడం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఐడిఎఫ్ కాల్పుల్లో 11 మంది మరణించారు.

## టర్కీ సీనియర్ జర్నలిస్టు అరెస్ట్
### సర్వత్రా నిరసన వెల్లువ



**అంకారా :** టర్కీ సీనియర్ జర్నలిస్టు, ప్రముఖ వ్యాఖ్యాత ఫాతిహ్ అల్తాయ్లిని అరెస్టు చేయడంతో దేశంలో సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన అరెస్టుతో దేశాధ్యక్షుడు రెసెప్ తయ్యప్ ఎర్డొగాన్ ప్రభుత్వం చాలా నిస్సిగ్గుగా పత్రికాస్వేచ్ఛను ఉల్లంఘించి మీడియాపై దాడి చేసిందని పౌరసంఘాలు, జర్నలిస్టు సంఘాలు, రాజకీయ నాయకులు విమర్శించారు. ప్రముఖ జర్నలిస్టు అల్తాయ్లి తన యూట్యూబ్ ఛానల్‌లో ఒట్టొమన్ సామ్రాజ్య సుల్తానులను ఉటంకిస్తూ, గడచిన శుక్రవారంనాడు చేసిన విమర్శలు టర్కీ అధ్యక్షుడు ఎర్డొగాన్‌కు పెద్ద బెదిరింపుగా మారాయని, సదరు జర్నలిస్టు దేశాధ్యక్షుణ్ణి బెదిరిస్తున్నాడనీ ప్రాసిక్యూటర్ కార్యాలయం చేసిన ఆరోపణలను జర్నలిస్టు సంఘాలు, పౌర సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

టర్కీలో ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు తనను ఆశ్చర్యపరచలేదని, దేశ ప్రజలు పాలకుల పనితీరును తనిఖీ చేయడానికి ఇష్టపడతారని రుజువైందని జర్నలిస్టు అల్తాయ్లి వ్యాఖ్యానించారు. టర్కీ చరిత్రను ప్రస్తావించారు. సుల్తానును ఇష్టపడనప్పుడు ప్రజలు ఆయనను గొంతుకోసి చంపిన చరిత్రగల దేశమనీ, ఆ హత్యలను ఆత్మహత్యలుగా చిత్రీకరించిన ఘటనలు ఉన్నాయని చేసిన వ్యాఖ్యానాన్ని ఎర్డొగాన్ తీవ్రంగా పరిగణించారు. ఐతే జర్నలిస్టు అల్తాయ్లి రోజుకో వ్యాఖ్య చేస్తూ దేశంలో లక్షలాదిమంది ప్రజలను ఆలోచింపజేస్తారు. ఆయన అరెస్టును పౌరసంఘాలు వ్యతిరేకిస్తూ, ఇది పూర్తిగా మీడియా స్వేచ్ఛను హరించడమేనని, న్యాయవ్యవస్థను అడ్డంపెట్టుకుని అరెస్టులు చేయకూడదని విమర్శించాయి.

## రూ.కోటి పరిహారం
(మొదటి పేజీ తరువాయి)

ఉన్నత స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు ముఖ్య మంత్రి తెలిపారు. కమిటీ నివేదిక ఆదారంగా ప్రమాదానికి గల కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంఘటనలు ఇతర పరిశ్రమలలో జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం కోసం కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. నిరంతరం అధికారుల బృందం పరిశ్రమలను తనిఖీ చేయాలని ప్రమాదం జరిగే అవకాశం ఉన్న చోట జాగ్రత్త చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పరిశ్రమలు ఫైర్ సెఫ్టీ శాఖల అధికారులను ఆదేశించారు. పరిశ్రమల్లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యంతో కలిసి రూ కోటీ రూపాయల ఆర్థిక సహాయం అందజేసేలా చూస్తామని హామిచ్చారు. ప్రమాదంలో మృతి కుటుంబీలకు ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యం కలిసి రూ. కోటి రూపాయలు తీవ్రంగా గాయపడిన కార్మికులకు రూ. 10 లక్షల రూపాయలు స్వల్పంగా గాయపడిన కార్మికులకు రూ. 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. తక్షణ సహాయంగా మృతుల కుటుంబ సభ్యులకు రూ. లక్ష రూపాయలు క్షతగాత్రులకు రూ. 50 వేల రూపాయలు అందజేయాలని స్థానిక కలెక్టర్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైతే క్షతగాత్రులకు మెరుగైన చికిత్స కోసం ఇతర పెద్ద ఆసుపత్రులకు తరలించాలని వైద్య ఆరోగ్య శాఖ ,రెవెన్యూ పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రమాదంల మృతి చెందిన వ్యక్తుల మృత దేహాలను వారి వారి స్వస్థలాకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా చేర్చేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన గాయపడిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రమాదంలో గాయపడిన మృతి చెందిన కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రభుత్వ రెసిడెన్షియల పాఠశాలలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలక్టరును ఆదేశించారు.



**యాజమాన్యంపై సిఎం సీరియస్ :** ఈ నేపథ్యంలో సిగాచి పరిశ్రమ యాజమాన్యంపై సి.ఎం సీరియస్ అయ్యారు. ప్రమాదం జరిగి 24 గంటలు గడుస్తున్నా సిగాచి ఫార్మా కంపెనీ యాజమాన్యం ఘటనా స్థలానికి ఎందుకు రాలేదని ముఖ్య మంత్రి ప్రశ్నించారు. ఇప్పటి వరకు బాదితులకు ఏమి భరోసా ఇచ్చారని అగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యంపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఎక్స్ గ్రేషియా విషయంలో మానవత్వ దృక్పథంతో చూడాలని యాజమాన్యానికి సూచించారు. పలు శాఖల అధికారులతో మాట్లాడుతూ ఇంతకు ముందెప్పుడైనా ఇలా జరిగిందా , ఇండస్ట్రీయస్ బాయిలర్ డైరెక్టర్స్ తనిఖీలు చేసారా? ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా రసాయన కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి లోపాలు గుర్తించాలని సూచించారు. సహయక చర్యలకు సంబంధించి ప్రభుత్వ విభాగాల మద్య సమన్వయం చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం. ఆదేశించారు. అనంతరం ప్రమాదంలో గాయపడి పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. బాదితులు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆధైర్య పడద్దని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పరిశ్రమలు ఐటి శాఖ మంత్రి దుద్దిర్ల శ్రీదర్ బాబు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివస్ రెడ్డి టీఎస్ ఐడి సి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి,టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి, పటాన్చెరు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ,హైడ్రా కమీషనర్ రంగనాథ్, కలెక్టర్ పి ప్రావీణ్య ఎస్పీ పరితోష్ ఫంకజ్ రాష్ట్ర స్థాయి అదికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన క్రీడా విధానం
(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయడానికి ఒక మార్గదర్శక పత్రంగా 'ఖేలో భారత్ నీతి' ఉపయోగిస్తుందని మంత్రివర్గం పేర్కొం ది. 2036వ సంవత్సరం నాటికి ఒలింపిక్స్‌లో భారతదేశాన్ని బలమైన క్రీడాపోటీశక్తి గా తీర్చిదిద్దడానికి, అత్యంత కట్టుదిట్టమైన పాలనా నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి క్రీడాకారులకు ఉన్నత ప్రమాణాలతో శిక్షణ ఇచ్చి అథ్లెట్స్‌కు గట్టి మద్దతు ఇచ్చేందుకు ఉద్దేశించిన ఒక వ్యూహాత్మక బృహత్తర ప్రణాళికగా దీనిని మంత్రివర్గం పేర్కొంది. గతంలో దీనిని జాతీయ క్రీడా విధానంగా పిలిచారు. 1984లో ఈ క్రీడా విధానాన్ని మొదటిసారి ప్రవేశపెట్టారు. 2001 నాటి ప్రస్తుత విధానం రద్దు అవుతుంది. ఆ స్థానంలో ఈ 'ఖేలో భారత్ నీతి' అమలులోకి వస్తుంది.

''గడచిన పది సంవత్సరాలలో మనకున్న క్రీడానుభవాన్ని రంగరించి, క్రీడలను మెరుగు పరచేందుకు కొత్త విధానం తీసుకువచ్చాం, 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే ఐదవ అగ్రశ్రేణి క్రీడాశక్తిగా తయారుచేయడమే ఈ కొత్త విధానం లక్ష్యం'' అని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు.

2036లో జరిగే ఒలింపిక్స్‌లో గట్టి పోటీ ఇచ్చేందుకు తగిన మౌలిక సదుపాయాలు సమకూర్చుకోవడానికి, శిక్షణలు ఇవ్వడానికి, సామూహిక ప్రోత్సాహం అందించడానికి, ఈవెంట్స్‌కు అంతర్జాతీయస్థాయిని తీసుకువచ్చేందుకు పథకాలు రూపొందిస్తామన్నారు.

**పరిశోధనలకు మూలనిధి :**
ఒక లక్ష కోట్ల రూపాయల మూలనిధితో కూడిన పరిశోధనా అభివృద్ధి, నవీన ఆవిష్కరణల పథకానికి కేంద్రమంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఈ పథకంవల్ల పరిశోధనలలో ప్రైవేటురంగ పెట్టుబడులు గణనీయంగా పెరుగుతాయని మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. నిర్ణీత గడువుకాలానికి ట్రేడ్‌మార్కులను రిజర్వు చేసుకున్న కంపెనీలు, ఆర్థికభద్రత, వ్యూహాత్మక ప్రయోజనాలు, స్వయంసమృద్ధికి సంబంధించిన ఇతరరంగాలలో నవీన ఆవిష్కరణలు,పరిశోధనలు, అభివృద్ధి పెరుగుతున్న తరుణంలో ప్రైవేటురంగ పెట్టుబడుల భాగస్వామ్యాన్ని గణనీయంగా పెంచే ఉద్దేశంతో ఈ పథకాన్ని ముందుకు తెచ్చినట్లు చెప్పారు. ప్రధానమంత్రి అధ్యక్షతనగల ఎఎన్ ఆర్ ఎఫ్ (అనుసంధాన్ జాతీయ పరిశోధనా మూల సంస్థ) పరిశోధనా, అభివృద్ధి, నవీన ఆవిష్కరణలు (ఆర్ డి ఐ) పథకానికి వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్ని సమకూర్చగలదన్నారు.
మంత్రివర్గ సచివాలయం నాయకత్వాన కార్యదర్శులస్థాయిలో ఒక సాధికార బృందం కూడా ఈ పథకంలో మార్పులకు, రంగాల కేటాయింపులకు, ఏ రకమైన ప్రాజెక్టులకు అనుమతులివ్వాలనే విషయాలకు ఆమోదాలు తెలియజేస్తుందని మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలియజేశారు. శాస్త్ర,సాంకేతిక విభాగం (డిఎస్‌టి) ఆర్‌డిఐ పథకం అమలు చేయడానికి ప్రాజెక్టుల నిర్వహణలో ఒక సమన్వకర్తపాత్ర పోషిస్తుందని చెప్పారు.




## 'సిగాచి' యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి : ఎఐటియుసి
### గాయపడినవారిని పరామర్శించిన నాయకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పటాన్‌చెరు పాశమైలారం సిగాచి పరిశ్రమలో జరిగిన ఘటనలో గాయపడిన వారిని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, జిల్లా అధ్యక్షులు నీరుడు సాయిలు, ప్రధాన కార్యదర్శి బోయినిప్రసాద్ భవన్ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పిల్లి శ్రీకాంత్ మంగళవారం పరామర్శించారు. బ్లాస్టింగ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరి కోటి రూపాయాల పరిహారాన్ని, తీవ్ర గాయాలతో బాధపడుతున్న వారికి రూ. 50 లక్షలు, కాలు, చేయి విరిగిన వారికి రూ. 25 లక్షల చొప్పున చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేయాలని, లేదంటే దేశ వ్యాప్తంగా తీవ్రమైన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

## విషాదకర దుర్ఘటన
(మొదటి పేజీ తరువాయి)

యూనిట్‌లు ప్రత్యేకించి ప్రమాదకరమైన పదార్థాలకు సంబంధించినవి కఠినమైన భద్రతా నిబంధనలు లేకుండా, పట్టించుకోకుండా నిర్వహించడంతో సంభవించే ప్రమాదాలను ఈ ఘటన గుర్తు చేస్తుందని తెలిపింది. అంతే కాకుండా విధానపరమైన మార్పుల ఫలితంగా నియంత్రణా యంత్రాంగాన్ని బలహీనపరచిన పరిణామాలను ఈ ఘటన ఎత్తి చూపుతోందని విమర్శించింది. ఇన్‌స్పెక్షన్‌లు లేకపోవడం, కార్మికుల భద్రతా హక్కులు, బాగుకు సంబంధించిన సంస్థాగత యంత్రాంగం ప్రాధాన్యతను తగ్గించడాన్ని కూడా తెలియజేస్తుందని పేర్కొంది. కార్మిక చట్టాలు బలహీనపడడం, పని ప్రదేశంలో భద్రత పరిరక్షణలో ముందుండే పరిరక్షకులైన కార్మిక సంఘాలను అణిచివేయం ద్వారా భద్రతా ఆందోళనలను, ముందుజాగ్రత్త చర్యలను విస్మరించిన, కార్మికులను రక్షణ లేని పని చేసే వాతావరణానికి దారి తీసిందని, లాభాలే ప్రాధాన్యతలను అధిగమించినప్పుడు మానవ జీవితాలను ఇతర అంశాలుగా పరిగణిస్తారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం తక్షణమే అత్యవసర, సమగ్ర చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది. ప్రమాదకర రసాయనాల తయారీ, ప్రాసెసింగ్‌ను అత్యున్నత భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలని , కేవలం కార్మికుల రక్షణే కాకుండా పరిసర సమూహాల భద్రతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. ఈ ఘటన మేలుకొలుపుగా భావించాలని సూచించింది.

**రూ.50 లక్షల తక్షణ పరిహారానికి డిమాండ్**
ప్రాణాలు కోల్పోయిన వ్యక్తుల కుటుంబాలకు తక్షణ పరిహారంగా రూ.50 లక్షలు, గాయపడిన వారికి సరైన పరిహారంతో పాటు తగు వైద్య సేవలను అందించడం, దీర్ఘకాలిక సహాయం అందించాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ దుర్ఘటనపై పారదర్శకంగా, సమగ్ర విచారణ చేసి తప్పులకు, భద్రతా లొసుగులకు బాధ్యులను జావాబుదారీ చేయాలని కోరింది. అనేక మంది కుటుంబాలను నడిపే వ్యక్తిని కోల్పోయారని, అన్యాయం లేదా నిర్లక్ష్యం ద్వారా వారి బాధను మరింత పెంచొద్దని, కార్మికుల భద్రత, గౌరవం కేంద్రంగా పారిశ్రామిక విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది.

## కిషన్‌రెడ్డికి బాధ్యత లేదా?
(మొదటి పేజీ తరువాయి)




కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై మట్లాడారు.

**కిషన్‌రెడ్డి చెబితే ప్రధాని వినరా ? :** తెలంగాణ నీటి కేటాయింపుల పరిష్కరించడానికి పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రులు ప్రాజెక్టుల అనుమతుల సాధించుకునేందుకు ప్రతి ఆఫీసు చుట్టూ తిరుగుతున్నామని, మరి మన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాత్రం నీటి కేటాయింపులకు బాధ్యతను ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు ఎంత హోదా ఉందో కిషన్‌రెడ్డికి అంతే హోదా ఉంది కదా అన్నారు. మరి కిషన్‌రెడ్డి చెబితే ప్రధాని నరేంద్ర మోదీ వినరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి గా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇ ంటికి వెళ్లి కలిశామన్నారు. తాము ఇచ్చే కాగితం తీసుకుంటారే తప్ప సమస్య పరిష్కారానికి ఇప్పటీ వరకు ఆయన తమతో కలిసి రాలేదన్నారు.
..

**రాజకీయ మనుగడకే బిఆర్‌ఎస్, బిజెపి తాపత్రయం :** రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షాలైన బిఆర్‌ఎస్. బిజెపిల తాపత్రాయమంతా తెలంగాణ నీటి కేటాయింపుల కోసం కాదని వారి రాజకీయ మనుగడ కోసమేనని సిఎం అన్నారు. కృష్ణా నది జలాలే కాదు గోదావరి జలాలను తాకట్టు పెట్టిన బిఆర్‌ఎస్ పాలకులు తమ అబద్దాలతో ఆ బురదను కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తద్వారా నిర్జీవమైన బిఆర్‌ఎస్‌కు ఊపిరి పోసేందుకు దింపుడుగళ్లం ఆశతోనే నదీ జలాలను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్‌ను దోషికి నిలబెట్టి రాజకీయ లబ్ది పొందాలనుకుంటున్నారని విమర్శించారు.

**కెసిఆర్ తన ఆహంకారంతో రాష్ట్ర ప్రజలకు మరణ శాసనం రాశారు**
నీళ్లకు నాగరికతకు ఎంత దగ్గరి సంబంధం ఉందో.. నీళ్లతో తెలంగాణ ప్రజలకు అంతకంటే అనుబంధం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు పునాది ఈనీళ్లు అని తెలిపారు.తెలంగాణ ప్రజలను ఆకాంక్షల కాపాడుతారని నమ్మకంతో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావుకు అధికారం కట్టబెడితే ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేస్తూ ఆయన తన ఆహంకారం, నిర్లక్ష్యంతో తీసుకున్న నిర్ణయాలతో తెలంగాణ ప్రజలకు మరణశాసనాన్ని రాశారన్నారు.కృష్ణానదిపై గాని, గోదావరి నదిపైన గాని ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రతిపాదించిన ఓ ఒక్క ప్రాజెక్టును కూడ పూర్తి చేయలేదని తెలిపారు. అంతేకాకుండా గోదావరిలో ప్రతి ఏటా 3వేల టిఎంసిలు వరద నీరు సముద్రంలో కలుస్తుందని వీటని రెండు రాష్ట్రాలు కలిసి సద్వినియోగం చేసుకోవాలంటూ ఆపెక్స్ కౌన్సిల్‌లో ప్రతిపాదించడం ద్వారా లేని ఏకు పెట్టి రాచపుండును సృష్టించి దానిని తెలంగాణకు అంటించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సిఎం చంద్రశేఖర్‌రావు చెప్పిన వెంటనే 2016లోఎపి సిఎం చంద్రబాబు పనులు పెట్టగా 2019వరకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎప్పుడు వ్యతిరేకించలేదు..జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే భవన్ నుంచి తెలంగాణ ప్రజల పట్ల చూపాల్సిన విశ్వాసాన్ని చూపాల్సిన80వేల పుస్తకాలు చదివిన అపర మేధావి కెసిఆర్ తన తెలివిని ఆంధ్రప్రదేశ్‌కు వినియోగించారు. ఇదేక్రమంలో కేవలం రాగ సంకటి, రొయ్యల పులుసు కోసం నదుల అనుసంధానం ద్వారా రాయల సీమను రత్నాల సీమాగా మార్చుతామంటూ ప్రకటించి మరీ వచ్చారన్నారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డికి రాగి సంకటి , రొయ్యల పులుసు అవసరం లేదన్నారు.ఇప్పుడు కెసిఆర్ అధికారం కొల్పోవడం, అక్కడి తిరిగి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడంతో దానిని భూతంగా చూపుతూ దానిని కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటించి నీటి సెంట్‌మెంట్ అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వ్యక్తిగతంగా ఎవరితో ఎవరికైనా పరిచాయాలు ఉండవచ్చా ని, అంతమాత్రన ప్రజల ప్రయోజనాలను తకాట్టు పెట్టాలేమని సిఎం స్పష్టం చేశారు.

**రాష్ట్ర హక్కులను కాలరాచేందుకు 8 మంది ఎంపిలను ఇవ్వలేదు**
బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులుగా నియమితులైన రామచంద్రరావుకు సిఎం రేవంత్‌రెడ్డి శుభకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున బిజెపి రాష్ట్ర అధ్యక్షులైన మీరు గోదావరి నది జలాల సమస్యలను పరిష్కారించాలని కోరుతున్నామన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారం ప్రభుత్వం అందిస్తుందని, ప్రధాన మంత్రితో చర్చించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిఎం కోరారు. మన హక్కులు కాపాడే శక్తి నరేంద్రమోదీ, బిజెపికి ఉందని, రాష్ట్రాల హక్కులను కాలరాయడం కోసం వారికి 8 మంది ఎంపిలు ఇవ్వలేదని స్పష్టం చేశారు.మోదీ ప్రభుత్వం, కిషన్‌రెడ్డి వ్యవహార శైలి గురించి గ్రామగ్రామన మాట్లాడాలని ప్రజాప్రతినిధులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వర రావు,పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, గడ్డం వివేక్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు ఆర్కా వేణుగోపాల్ రావు,వెంనరేందర్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,అధికార ప్రతినిధులు, నీటి పారుదల శాఖ సలహాదారు అదిత్యా దాస్ నాద్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు,నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేస్తా : టిజిటిడిసి ఎండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)లో దశాబ్దాల నుంచి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సముచిత న్యాయం కల్పిస్తామని సంస్థ ఎండి వల్లూరి క్రాంతి హామీ ఇచ్చారు. తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై కొత్తగా మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న వల్లూరి క్రాంతిని ఎఐటియుసి టూరిజం కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వియస్.బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళిలు కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై క్రాంతికి వివరించారు. వాటిలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, వయోపరిమితిని 61సం.గా నియమించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై క్రాంతి సానుకూలంగా స్పందించి త్వరలో సముచిత న్యాయం కార్మికులకు అందిస్తానని తెలియజేశారు.ఎండి క్రాంతి సానుకూల స్పందనకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధన్యవాదాలు తెలియజేశారు.



న్యూఢిల్లీలోని సూచన భవన్‌లో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ రంజనా దేశాయిని మంగళవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

## ‘సిగాచి’ అనుమతులు రద్దుకు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సంగారెడ్డి జిల్లా పాశ మైలారం సిగాచి కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదానికి, కార్మికుల మరణానికి కారణమైన సిగాచి కెమికల్ ఫ్యాక్టరీ అనుమతులను వెంటనే రద్దు చేయాలని సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు ఒక్కొక్క కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియాను అందించాలని, తీవ్రంగా గాయపడిన కార్మికులకు రూ.50లక్షల చొప్పున చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అనేక ఫ్యాక్టరీలలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, తనిఖీలు నిర్వహించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### ప్రతి దరఖాస్తునూ
# పరిశీలించి పరిష్కరించాలి

పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తునూ సమగ్రంగా పరిశీలించి, అర్హమైన అన్నింటినీ సానుకూలంగా పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ చేపట్టాలని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని, అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ఆధారాలన్నింటినీ ఒకే డాక్యుమెంట్ గా భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన స్వార్ధ పూరితమైన ‘ఆర్ఓఆర్ చట్టం 2020’ వల్ల ఇబ్బందులు పడిన తెలంగాణ ప్రజానీకానికి భూభారతి చట్టం ద్వారా విముక్తి కల్పిస్తామని ప్రకటించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించాల్సి వచ్చిందో అనే వివరాలను లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారులకు అందించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం మాట్లాడుతూ 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ఇందులో 8,27,230 దరఖాస్తులు వచ్చాయని ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తులను డేటా ఫార్మేట్ లో భూభారతి పోర్టల్ లో నమోదు చేశారన్నారు. మిగిలిన వాటిని కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. భూ భారతి చట్టం ద్వారా దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఏప్రిల్ 17వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు దశల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించామని వివరించారు. సర్వే నెంబర్లలో లోపాలు పిపిబి, ఆర్ఓఆర్, నాలా, ఆర్.ఎస్ .ఆర్ సవరణ, అప్పీల్స్, కోర్టుకేసులు, పోడుభూములు తదితర 30 రకాల భూ సమస్యలపై 8.27 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే, ధరణి పోర్టల్ మూలంగా తెలంగాణ ప్రజానీకం ముఖ్యంగా రైతాంగం ఎదుర్కొన్న సమస్యలు కళ్లకుకట్టినట్టుగా కనబడుతున్నాయన్నారు. కింది నుంచి పై స్థాయి వరకు మొత్తం రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక ఎజెండాగా తీసుకుని సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతుల సంతోషమే ధ్యేయంగా పని చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వంలో వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని, అంకితభావంతో సానుకూల దృక్పథంతో ఈ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు.



## తెరుచుకున్న ‘బాబ్లీ’ ప్రాజెక్టు గేట్లు
### రైతులకు, మత్స్యకారులకు ఊరట

**ప్రజాపక్షం/బైంసా:** మహారాష్ట్రలోని ధర్మాబాద్ సమీపంలో గోదావరి నదిపై ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మంగళవారం రోజు భారత సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తెరిచారు. తెలంగాణ, మహారాష్ట్ర ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులు,సెంట్రల్ వాటర్ కమిషన్(సిడబ్ల్యూసి)సభ్యులు, బాబ్లీ బంధారా కృతి సమితి ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1,064 అడుగుల వద్ద 15,567 టిఎంసిల నీరు నిల్వ ఉంది. బాబ్లీ గేట్లు తెరవడం ద్వారా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్‌పి)లోకి నీరు చేరే అవకాశం ఉంది, ఇది దిగువన ఉన్న రైతులకు, మత్స్యకారులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని ఇప్పటికే వారు సంతోషం వ్యక్తం చేశారు.

గోదావరినదిలో నీటి ప్రవాహం సాయంత్రం నాటికి పెరిగే అవకాశం ఉన్నందున, నదీ పరీవాహక ప్రాంత ప్రజలు, రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రతి సంవత్సరం జూలై 1 నుండి అక్టోబర్ 28 వరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెరిచి ఉంచాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

## నక్సలైట్లపై ప్రగల్భాలు పలకటం తగదు


సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వియస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**నిజామాబాద్ లో పసుపు బోర్డు ఆఫీసును ప్రారంభించటానికి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా అసందర్భంగా నక్సలైట్లపై ప్రగల్భాలు పలకటం తగదని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వియస్.బోస్ అన్నారు. పసుపు బోర్డుకు ఆఫీసును గుర్తించటం చేతకాని అమిత్‌షా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ప్రజా ప్రతినిధి క్యాంప్ ఆఫీసులో పసుపు బోర్డుకు రిబ్బన్ కట్ చేయటం సిగ్గుచేటన్నారు. పసుపు బోర్డు సమావేశంలో రైతులకు జరిగే ప్రయోజనాలు, తెలంగాణాలోని పసుపు రైతులకు కేంద్రం ప్రకటించే రాయితీలు, గిట్టుబాటు ధరల గురించి స్పష్టమైన ప్రకటన చేయకుండా పైపై మాటలతో సరిపెట్టి, అదనంగా నక్సలైట్ల గురించి మాట్లాడటం హోంమంత్రికి తగదని అన్నారు. మావోయిస్టులు అనుసరిస్తున్న పంథా వేరైనప్పటికీ వారి సిద్ధాంతం మార్క్సిజమని ప్రపంచ ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. కమ్యూనిజాన్ని అంతం చేస్తామని ప్రగల్భాలు పలికిన హిట్లర్ కుక్క చావు చచ్చిన ఉదంతం చరిత్ర చెపుతున్న సత్యమన్నారు. మావోయిస్టులతో చర్చలు జరిపి సమాజంలో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

## కెసిఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ‘కూలేశ్వరంగా’ మారింది

శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కెసిఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరంగా మారిందని, అవినీతి అక్రమాలకు పాల్పడి ఆ పార్టీ పాతాళానికి వెళ్లిందని, కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారికి ప్రతిఫలం దక్కుతుందని నాయకులు గ్రూప్ రాజకీయాలకు స్వస్తి పలికి, మంచిరాజకీయాలు చేసి పేరు తెచ్చుకోవాలని జిల్లా ఇంచార్జి మంత్రి, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం నిజామాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క విచ్చేసి మాట్లాడారు. గ్రూప్ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని, పేరు ప్రతిష్టలు పెంచేలా రాజకీయాలు చేసి పేరు తెచ్చుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను నియోజకవర్గం నాయకులు, మండల స్థాయి అధ్యక్షులు, గ్రామస్థాయి అధ్యక్షులు, కార్యకర్త లు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. అలాగే సన్నబియ్యం విషయంలో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బయట షాపుల్లో సన్న బియ్యం రూ.52కు కిలో దొరికితే, మన ప్రభుత్వం పేదవారికి సన్నబియ్యం ఉచితంగా ఇస్తుందన్నారు. గత ప్రభుత్వం కెసిఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలేశ్వరంగా మారిందన్నారు. జులై 4న ఎల్‌బి స్టేడియంలో జరిగే కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే వస్తున్న నేపథ్యంలో జిల్లా నుంచి నియోజకవర్గం నుండి బూత్‌స్థాయి మండల అధ్యక్షులు, గ్రామశాఖ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ రంగాల అనుబంధ అధ్యక్షులు, కార్యకర్తలు సభకు తరలిరావాలన్నారు.



కార్యక్రమం లో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్, ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్‌మోహన్‌రావు, డిసిసి అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ‘బి’ కేటగిరి సీట్లు అమ్ముకుంటున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు

ఎఐవైఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:**‘బి’ కేటగిరి సీట్లు అమ్ముకుంటున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలిని ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎఐవైఎఫ్ అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్‌తో కూడిన ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాల కిష్టారెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ కౌన్సిలింగ్ కంటే ముందే ఇంజనీరింగ్ కాలేజీల సీట్ల దందా జోరందుకున్నదని, ప్రైవేట్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీల మధ్యవర్తిత్వంతో సీట్ల రిజర్వేషన్ ప్రక్రియకు తెరలేపారని ఆరోపించారు. సిఎఎస్‌సి, ఐటి, ఇఇఇ కోర్సుల సీటుకు సగటున రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల చొప్పున అమ్ముకుంటున్నాయని మండిపడ్డారు. కన్వీనర్ కోటా కటాఫ్ కంటే అధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కు సీట్ల టెన్షన్ పట్టుకుందని, ఇదే అంశంపై ఇంజనీరింగ్ కాలేజీలకు కాసులు కురిపిస్తోందని వారు తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఉన్నత విద్యామండలి ఆదేశాలను, నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయని, కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభం కాకముందే పేరొందిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు సీట్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టాయని ఉన్నత విద్యా మండలి దృష్టికి వారు తీసుకెళ్లారు. ఉన్నత విద్యామండలి ఆదేశాలను పాటించని ఇంజనీరింగ్ కళాశాలలపై క్రిమినల్ కేసులను నమోదుచేసి, వాటి గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

### కగార్ ఆపరేషన్ నిలిపివేసి మావోయిస్టులతో
# శాంతియుత చర్చలు జరపాలి

జులై 15న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

చండూరులో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/చండూరు:** దేశంలో మావోయిస్టుల మనుగడ లేకుండా చేసే లక్ష్యంతో మావోల ఏరివేత పేరిట కేంద్రం ఆపరేషన్ కగార్ పేరిట హత్యాకాండ కొనసాగిస్తోందని, మావోయిస్టులను భౌతికంగా అంతమొందించడం తక్షణమే నిలిపివేసి వారితో శాంతియుత చర్చలు జరపాలని ఎంఎల్‌సి, సిపిఐ నల్గొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి డిమాండ్ చేశారు. మంగళవారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఒక హిట్లర్, నియంతలా వ్యవహరిస్తున్నారని అన్నారు. దేశానికి హోంమంత్రిగా ఉన్న వ్యక్తి దేశంలో మావోయిస్టుల ఉనికి లేకుండా విచక్షణా రహితంగా కాల్చేస్తామంటూ నియంతలా వ్యవహరిస్తున్నాడని తీవ్రస్థాయిలో విమర్శించారు. కగార్ ఆపరేషన్ తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని డిమాండ్ చేశారు. దేశంలో కేవలం మావోయిస్టులే సమస్య అన్నట్లుగా వారిని అంతమొందించడం ద్వారానే అది సమసి పోతుందన్నట్లుగా కేంద్రప్రభుత్వం పెద్దలు కపట నాటకమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి, ఆక్రమాలు, దేశ సంపదను కొల్లగొట్టే కార్పొరేట్ శక్తులను నియంత్రించకుండా దేశంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికోసం సర్వం త్యాగం చేసి పోరాడుతున్న మావోయిస్టులు తాము శాంతి చర్చలకు సిద్ధం అంటున్నా వారిని కగార్ ఆపరేషన్ పేరుతో అతి కిరాతకంగా కాల్చి చంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ప్రజలు, మేధావులు బిజెపి యొక్క నిజస్వరూపాన్ని, బిజెపి పాలకుల ద్వంద్వనీతి ఏమిటో ఆలోచించాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. గ్రామ పంచాయితీ కార్మికులు చాలీచాలని జీతాలతో వెట్టి చాకిరి చేస్తున్నారని, అంగన్‌వాడీ టీచర్ల సమస్యలతో పాటు ఆర్టీసి యూనియన్‌లను పునరుద్ధరించాలని, అదే విధంగా ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరినట్లు తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న డిండి, ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు తో పాటు త్రాగునీరు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణకు నష్టం చేకూర్చే బనకచర్ల ప్రాజెక్టును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్‌కు అనుకూలంగా ఉండటం, ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం పట్ల కాంగ్రెస్ తన చిత్తశుద్ధిని నిలబెట్టుకుందని అన్నారు. కల్వకుంట్ల కవిత బిసిల మీద కపటప్రేమతో బూటక రాజకీయాలు చేస్తుందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని అన్నారు. జులై 15న దేవరకొండలో జిల్లా మహాసభలను నిర్వహించ దం జరుగుందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజాచారి, గురిజ రామచంద్రం, నల్పరాజు రామలింగయ్య, ఆర్. వెంకటేశ్వర్లు, సిపిఐ చండూరు, మునుగోడు మండల కార్యదర్శులు నల్పరాజు సతీష్ కుమార్, చాపల శ్రీను, బండమీది వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రభుత్వం
### రెవెన్యూ (భూసేకరణ) శాఖ

**ఫారం-C**
**నోటిఫికేషన్**

(10ఎ మినహాయింపు ఇవ్వబడిన చట్టంలోని సెక్షన్ 11 క్రింద) (రూల్ 6/12 చూడండి)

గెజిట్ నెం. GHMC-13 తేది: 25-06-2025

నెం. సి/332/2025 తేది: 25-06-2025

రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామంలో మొత్తం 5430.75 చ.గజాల విస్తీర్ణం గల భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా, హెచ్.సిటీ ప్రతిపాదిత 65.0 మీ మరియు 36.0 మీ. వెడల్పు రోడ్డు క్రింద IIIT జంక్షన్ వద్ద ప్రతిపాదిత మల్టీలెవల్ ఫ్లైఓవర్ నిర్మాణం కొరకు రివైజ్డ్ జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ ప్లాన్ కొరకు అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/స్పెషల్ కలెక్టర్ (భూ.సే.) మరియు కమిషనర్, GHMC వారు భావిస్తున్నారు.

అందువలన రంగారెడ్డి జిల్లాలోని శేరిలింగంపల్లి మండలం, గచ్చిబౌలి గ్రామంలోని కొంచెం హెచ్చుతగ్గులతో 5430.75 చ.గజాల ప్రామాణిక కొలతలుగల భూమి పై సదరు ప్రాజెక్టు కొరకు అవసరమై ఉన్నదని ప్రకటించడమైనది. సేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి యొక్క సవివరమైన వివరణ దిగువ ఇవ్వబడినది.

| క్రమ సంఖ్య | సర్వే నంబరు | తరి రకం | ఖుష్కి రకం | విస్తీర్ణం చ.గజాలలో | ప్రయోజనం గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు | | | | చెట్లు | | కట్టడాలు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | రకము | సంఖ్య | రకము | విస్తీర్ణం చ.గజాలలో |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | ప్లాట్ నెం.2, సర్వే.నెం 124 &125 | - | - | 316.67 | శ్రీ చింతమనేని వెంకటశివ రామకృష్ణప్రసాద్ | స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 2 | ప్లాట్ నెం.3, సర్వే.నెం 124 &125 | - | - | 316.67 | శ్రీమతి వెల్లంకి దేవకి దేవి భర్త: భరద్వాజ రావు | | | | | - | - | - | - |
| 3 | ప్లాట్ నెం.158, సర్వే.నెం 124 &125 | - | - | 316.66 | శ్రీమతి ఝాన్సీ | | | | | - | - | - | - |
| 4 | బిట్‌నెం.1 సర్వే.నెం 124 | - | - | 1124.44 | శ్రీ కె. శ్రీనివాస్ రావు తండ్రి: కె. పుల్లయ్య చౌదరి | | | | | - | - | - | - |
| 5 | ఖాళీస్థలం సర్వే.నెం 124/పార్ట్ | - | - | 440.33 | శ్రీ జి. రమణయ్య నాయుడు, తండ్రి: కీ.శే. వెంకటయ్య నాయుడు | | | | | - | - | - | - |
| 6 | బిట్‌నెం.4 సర్వే నెం. 124 | - | - | 446.88 | మెస్సర్స్ శ్రీ అగ్రి వెంచర్స్ ప్రై.లి., ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ | | | | | - | - | - | - |
| 7 | ఖాళీస్థలం సర్వే.నెం 93 | - | - | 2227.59 | 1.శ్రీమతి కె. లక్ష్మీదేవి 2. శ్రీ కె. అరవింద్ రెడ్డి 3. శ్రీ కె. యం. అభిలాష్ రెడ్డి | | | | | - | - | - | - |
| 8 | ప్లాట్‌నెం.1/ HIG-A సర్వే.నెం 131 | - | - | 89.44 | శ్రీ కె. కోమల వదన్ | | | | | - | - | - | - |
| 9 | ప్లాట్‌నెం.20/ HIG-A సర్వే.నెం 131 | - | - | 152.07 | శ్రీ బువలీ మహబూబ్ | | | | | - | - | - | - |
| | | | మొత్తం | 5430.75 | | | | | | | | | |

భూసేకరణ, పునరుపాధి మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (యాక్ట్ నం.21 ఆఫ్ 2017) ద్వారా సవరించబడిన విధంగా భూసేకరణ, పునరుపాధి మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కుచట్టం, 2013లోని సెక్షన్ 11(1) (కేంద్ర చట్టం నం. 30/2013) నిబంధనల ప్రకారం సంబంధితులందరికీ తెలియజేయుటకు గాను ఈ ప్రకటన చేయడమైనది.

ఈ భూమి ప్లానును స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్ కార్యాలయం, GHMC, హైదరాబాద్లో ఏ పనిరోజునైనా కార్యాలయ పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. సదరు చట్టంలోని సెక్షన్-12లో ఏర్పాటుచేసిన మరియు నిర్దిష్టపరిచిన విధంగా తమ పనిని తగువిధంగా నిర్వహించేందుకు భూమిలో ప్రవేశించి, సర్వేచేసి, ఏవేని భూమి స్థాయిలను తీసుకొనుటకు సబ్సాయిల్ త్రవ్వుటకు లేదా బోర్ వేయుటకు మరియు అవసరమైన అన్ని ఇతర చర్యలు తీసుకొనుటకు అధీకృత అధికారి అంటే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, GHMC, హైదరాబాద్ వారికి మరియు వారి సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం/స్పెషల్ కలెక్టర్(LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్-సహిత-సముచిత ప్రభుత్వం అధికారం ఇస్తోంది.

చట్టంలోని సెక్షన్ 11(4) క్రింద, స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్ వారి ముందస్తు ఆమోదం లేకుండా అట్టి ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏ వ్యక్తి అట్టి భూమిపై ఎటువంటి వ్యవహారములు చేయరాదు లేదా వ్యవహారములకు కారణం కారాదు అంటే అమ్మకం/ కొనుగోలు మొ.నవి చేయరాదు లేదా అట్టి భూమిపై ఎటువంటి తాకట్టు రుణభారాలు కల్పించరాదు.

సేకరణకు అభ్యంతరాలు ఏవైనా ఉంటే మరియు నష్టపరిహారం కోసం సంప్రదింపుల ద్వారా పరిష్కారం కోసం ప్రయోజనంగల/ ప్రభావిత వ్యక్తులందరు వారి క్లెయిములను చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటుచేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురణ తేదీనుండి 60 (అరవై రోజుల)లోగా భూమిలో ప్రయోజనం గలవారు స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్ / అధీకృత అధికారి సమక్షంలో వాటిని దాఖలు చేయవచ్చును.

సం/-
**స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA), GHMC, హైదరాబాద్**

సం/-
**స్పెషల్ కలెక్టర్ (LA) & కమిషనర్, GHMC, హైదరాబాద్**

DIPR R.O.No. 336/LA/PP/ADVT/AGENCY/2025-26

## యుపి తరహా బుల్‌డోజర్ రాజ్యం వద్దు

హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదలు, మధ్య తరగతి ఇండ్లపై హైడ్రా అరాచక రాజ్యం కొనసాగించడం దుర్మార్గమని, హైకోర్టు స్టే ఉన్నప్పటికీ హైదరాబాద్‌లోని గుట్టల బేగంపేటలో ఇండ్ల కూల్చివేత న్యాయవ్యవస్థను అవమానించడమేనని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. తెలంగాణ సిఎంను రాజ్యాంగ విలువలకు, కాంగ్రెస్ పార్టీ చెబుతున్న సిద్ధాంతాలకు లోబడి నడుచుకునేలా ఆదేశించాలని, ఉత్తరప్రదేశ్ తరహా బుల్‌డోజర్ రాజ్యంను తెలంగాణలో నడపొద్దని సిఎం రేవంత్ రెడ్డికి సూచించాలని ఆయన కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ నటరాజన్‌ను కోరారు. ఈ మేరకు హరీశ్ రావు ట్వీట్ (ఎక్స్)లో పోస్ట్ చేశారు. ఒకవైపు ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా బుల్‌డోజర్ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ, ‘మోహబత్‌కి దుకాన్’ అంటూ ప్రేమ సందేశాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటే, మరోవైపు అదే కాంగ్రెస్ పార్టీకి చెందిన సిఎం రేవంత్ రెడ్డి మాత్రం బుల్‌డోజర్ రాజ్యం చేస్తూ పేదల గూళ్లు కూల్చుతున్నారని, ఇది కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు.

**‘పంటల బీమా అమలు’ మాట నిలుపుకోండి**

పంట బీమా అమలు చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంటే, మే, జూన్ నెలల్లోనే టెండర్లను ఆహ్వానించాల్సి ఉండేనని, కానీ ఆ ప్రక్రియ ఇప్పటికీ చేపట్టకుండా చోద్యం చూస్తున్నారని తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి, ఎన్నికల మ్యానిఫెస్టోలో, బడ్జెట్ ప్రసంగాల్లో పంట బీమా అమలు చేస్తామని చెప్పి న మాటను నిలుపుకోవాలని, యూరియా కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకాల వర్షాలు, ఇతర విపత్తులు వచ్చిన ప్రతిసారీ సాయం అందక రైతన్నలు చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్‌ను నిద్ర లేపిందే బిఆర్ఎస్:** ఎపి నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టు బనకచర్ల గోదావరి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మొద్దు నిద్ర లేపింది బిఆర్‌ఎస్ అని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. గోదావరిలో 1000 టిఎంసిలు, కృష్ణాలో 500 టిఎంసిలు చాలు అని చెప్పిన రేవంతుకు, మిగులు జలాల్లోనూ తెలంగాణ రాష్ట్రాని కి వాటా ఉంటుందని జ్ఞానోదయం చేసిందే బిఆర్ఎస్ అని హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఇప్పటికీ సిఎం ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు పట్ల సిఎం రేవంత్‌రెడ్డి చూపుతున్న గురుభక్తికి ఇదొక నిదర్శనం కాదా అని ప్రశ్నించారు.

## కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసింది శూన్యం

మధుసూదనాచారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బిజెపి ఎంపిలు గెలిచినప్పటికీ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసింది శూన్యమని శాసన మండలి ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనా చారి మండిపడ్డారు. ఎపి నుంచి కేవలం ముగ్గురు బిజెపి ఎంపీలు గెలిచినా తెలంగాణతో పోలిస్తే కేంద్రం ఎపికే నిధులు వెళ్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందని బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షుడు రాంచందర్ రావు పగటి కలలు కంటున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు కె.కిషోర్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి, తుంగ బాలుతో కలిసి మధుసూదనాచారి మాట్లాడుతూ బిజెపి ఎప్పుడైనా మూడోస్థానం కోసం పోటీ పడాల్సిందేనని, ఎంఐఎం కంటే ఒక్క సీటు ఎక్కువ తెచ్చుకోవాలనేదే బిజెపి లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్ విషయంలో బిజెపి ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తుందని,కేంద్ర మంత్రి అమిత్ షా కాంగ్రెస్ అవినీతిని ప్రశ్నిస్తారని, మరోవైపు లోపాయి కారిగా కాంగ్రెస్, బిజెపిలు కలిసే పని చేస్తున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బిఆర్‌ఎస్ అని అన్నారు. బిజెపి రాష్ట్ర కొత్త అధ్యక్షుడు రాంచందర్ రావు బిఆర్‌ఎస్‌ను ప్రజలు మరిచిపోయారని చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఆయన ఒక జాక్‌పాట్ ప్రెసిడెంట్ అని ఎద్దేవా చేశారు. పాశమైలారంలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమని, మృతుల కుటుంబాలను రాష్ట్రప్రభుత్వం, యాజమాన్యం కలిసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో కుటుంబ పెద్దను కోల్పోయిన పిల్లల చదువులు పూర్తయ్యే వరకు రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చులు భరించాలన్నారు.



ప్రజాపక్షం
బుధవారం, 02 జులై

## యమపాశమైన కెమికల్ ఫ్యాక్టరీ

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో ఫార్మా కంపెనీ సిగాచి ఇండస్ట్రీస్‌లో సోమవారం ఉదయం సంభవించిన రియాక్టర్ ప్రేలుడు ఇటీవల కాలంలో పారిశ్రామిక ప్రమాదాల్లో అత్యంత తీవ్రమైనది, ఘోరమైనది. క్షణాల్లో సంభవించిన ప్రేలుడులో ఎంతమంది కార్మికులు ఆహుతి అయినారో రెండో రోజు సాయంత్రానికీ నిర్ధారణ కానీ దుస్థితి. 36 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రుల్లోని రెండు డజన్‌ల మందిలో 10–12 మంది పరిస్థితి విషమంగా ఉంది. 70 మంది వరకు అదృశ్యమైనారు. వారి జాడ తెలియదు. భయోత్పాతంలో ఎటైనా పరుగు తీశారో లేక కూలిపోయిన భవనం శిథిలాల కింద మరేమైన మృతదేహాలున్నాయో ఊహకందని స్థితి. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక దళం, పోలీసులు శక్తి వంచన లేకుండా సహాయక చర్యలు నిర్వహిస్తున్నారు. మృతదేహాలు గుర్తించ లేనంతగా మాడిపోయినందున డాక్టర్లు డిఎన్‌ఎ పరీక్షల ద్వారా గుర్తించి బంధువులకు అప్పగించే పనిలో ఉన్నారు. ఇది మాటలకందని విషాదం. చనిపోయిన, గాయపడిన, జాడ తెలియని కార్మికుల్లో అత్యధికులు బిహార్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ వలస కార్మికులు. కరోనా కాలం అనుభవంతో వలస కార్మికులను తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించింది. సుప్రీంకోర్టు సైతం వారికి రేషన్ వగైరా సమగూర్చే నిమిత్తం రిజిస్టర్ చేయాలని ఆదేశించింది. అయితే కొందరు మధ్య దళారులు, ఏజెన్సీలు వలస కార్మికులను రప్పిస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారో లేదో తెలియదు. తక్కువ వేతనాలకు పని చేస్తారు కాబట్టి అనేక పరిశ్రమలు వారిని పనుల్లో పెట్టుకుంటున్నాయి. భవన నిర్మాణం, వ్యవసాయ పనుల్లో సైతం వలస కార్మికులను ఉపయోగించుకుంటున్నారు. వలస కార్మికుల శ్రమను దోపిడీ చేయడమే కానీ వారి ఆరోగ్యం, భద్రత గూర్చి పట్టించుకునే వారు లేరు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా లేబర్ ఆఫీసర్ల తనిఖీలే లేవు. భద్రత అధికారులున్నా వారిని మేనేజ్ చేయడం అనే కళలో ఆరితేరారు యజమానులు. సోమవారం ఉదయం పాశమైలారం విస్ఫోటనం సంభవించి దాదాపు 40 మంది ప్రాణాలు క్షణాల్లో గాలిలో కలిసిపోగా సిగాచి పరిశ్రమ ఉన్నత యజమానుల జాడే లేదు. ప్రమాదస్థల పరిశీలనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ విషయమే ప్రశ్నిస్తే స్థానిక మేనేజర్ల నీళ్లు నమిలారు. కార్మికుల ప్రాణాల పట్ల పారిశ్రామికవేత్తల నిర్లక్ష్యానికిది ఒక ఉదాహరణ.

ఇటీవల మనం అనేక అగ్ని ప్రమాదాలు, ప్రేలుడు ప్రమాదాలు చూసాం. ప్రమాదం జరిగినప్పుడు అధికార యంత్రాంగం హడావుడి చేయడం, ప్రభుత్వం లేదా సంబంధిత యజమానులు ఆ ప్రమాదాల్లో మృతులకు, క్షతగాత్రులకు పరిహారం, ఎక్స్‌గ్రేషియా సహాయం ప్రకటించడంతో వాటిని అంతటితో వదిలేస్తారు. భద్రత నిబంధనలు నెరవేర్చకపోయినా అనుమతులిచ్చిన అధికారులపై చర్యలుండవు. ఈ తాత్సారం విడనాడాలి. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ పెరుగుతున్న కాలంలో వాటితో పాటు శ్రామికుల భద్రతకు ఇతోధిక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రభుత్వం కార్మిక శాఖకు జవసత్వాలు చేకూర్చాలి. 2025 మే 18న గుల్జార్ హౌస్‌లో ఎసి కంప్రెసర్ ప్రేలుడు ప్రమాదంలో 17 మంది దుర్మరణం పొందారు. దాని తర్వాత 9–10 ప్రమాదాలు జరిగాయి. ఎందరో కొందరు కార్మికులు మృతి చెందారు. ఆ తర్వాత ఈ పాశమైలారం ప్రమాదమే అతిపెద్దది. తమ కుటుంబ పోషకుల ఆనవాళ్లు దొరకక, బతికి ఉన్నారేమోనన్న ఆశ–నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్న కుటుంబ సభ్యుల మనస్తాపం వర్ణనాతీతం. ఎందరో యువతీ యువకుల సుందర స్వప్నం బుగ్గిపాలైంది. ఈ ప్రమాదంపై ఉన్నత స్థాయి పారిశ్రామిక భద్రతా నిపుణులతో దర్యాప్తు జరిపించాలి. గుర్తించిన వైఫల్యాలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పారిశ్రామిక వాడల్లో సమగ్ర భద్రత ఆడిట్ నిర్వహించి దిద్దుబాటు చర్యలు అమలు చేయించడం ప్రభుత్వ బాధ్యత.

# బిహార్‌లో ఓటర్లను ఏరివేసే ప్రమాదం

## ఎన్‌ఆర్‌సికి బీజం వేస్తున్న ఎన్నికల కమిషన్

జ్ఞాన్ పాఠక్

బిహార్ శాసనసభకు గడువు 2025 నవంబర్ 22 ముగియక ముందే ఎన్నికలు నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భారీ ఎన్నికల యుద్ధానికి అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి, ప్రధాని నరేంద్ర మోదీకి, బిజెపికి బిహార్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎన్నికల యుద్ధం. ఈసారి బిహార్‌లో 200 లేదా అంతకంటే ఎక్కువగా ప్రధాని ఎన్నికల సభలు, ర్యాలీల నిర్వహణకు ఆ పార్టీ ప్రణాళికలు రచించినట్లు వార్తలు వస్తున్నాయి. గత దశాబ్దంలో జరిగిన ఏ ఇతర ఎన్నికల కంటే బిహార్ ఎన్నికలను మరింత గంభీరంగా తీసుకోవడం తప్ప భారత ఎన్నికల సంఘానికి (ఇసిఐ)మరో ప్రత్యామ్నాయం లేదు.

ఇలాంటి సందర్భంలో, భారత ఎన్నికల సంఘం 2025 జులై 1నుంచి ప్రారంభమయ్యే ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కోసం ఆదేశాలు జారీ చేసింది. చివరి సమగ్ర సవరణ 2003 జనవరి 1 అర్హత తేదీగా నిర్వహించబడింది. అంటే ఓటరు జాబితాను కొత్తగా తయారుచేస్తారని అర్థం. తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి పౌరుడు, ముఖ్యంగా 2023 ఓటరు జాబితాలో పేర్లు లేని వారు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాలి.

ఓటర్లు అందరూ ఒక లెక్కింపు (ఎన్యూమరేషన్) ఫామ్‌ను సమర్పించాలని, 2003 తర్వాత నమోదు చేసుకున్న వారు అదనంగా కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, షెడ్యూల్ ప్రకారం తమ పౌరసత్వాన్ని నిరూపించుకునే పత్రాలను, కొత్తగా పౌరసత్వ ప్రకటన (డిక్లరేషన్) ఫామ్‌ను సమర్పించాలని ఇసి తెలిపింది. గతంలో ఇసి ఫామ్ 6 ద్వారా దరఖాస్తుదారుడు తన పౌరసత్వాన్ని స్వయంగా ప్రకటించుకునేవారు. జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ'(ఎస్‌ఐఆర్), చివరికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కవర్ చేస్తుందని కమిషన్ తెలిపింది. బిహార్‌లో సవరించిన ఓటరు తుది జాబితా 2025 సెప్టెంబర్ 30న ప్రచురించబడుతుంది.

కాగా, ఇసి తాజా నిర్ణయం అత్యంత వివాదాస్పదంగా మారుతోంది. ఎందుకంటే అస్సాంలో బంగ్లాదేశీ చొరబాటుదారులకు మాత్రమే కాకుండా, నిజమైన భారతీయ పౌరులకు కూడా పౌరసత్వాన్ని నిరూపించుకోవడం ఎంత కష్టమో మనం ఇప్పటికే చూశాం. ముసాయిదా జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి) 40 లక్షల మందిని తొలగించింది. 1971ని కటాఫ్(గడువు) సంవత్సరంగా నిర్ణయించినప్పటికీ తుది జాబితాలో 19 లక్షల మందిని తొలగించింది. వారు తమ పౌరసత్వాన్ని సాక్ష్యాలతో నిరూపించుకోలేకపోయారు. తొలి జాబితా 2018లో విడుదలైన తర్వాత, తుది జాబితా 2019లో ప్రచురించిన తర్వాత కూడా సమస్య ఇంకా పరిష్కారం కాలేదు.

అస్సాం ఉదంతం బిహార్‌లో కేవలం రెండు నెలల్లోపు తయారు చేయబడనున్న 2025 సవరించిన ఓటరు జాబితా నుండి లక్షలాది మంది తొలగించబడతారనే వాస్తవాన్ని స్పష్టంగా గుర్తు



రూల్సు సవరణ

**బిహార్‌లో ఓటర్ల సమగ్ర రూపకల్పన తీరుతెన్నులపై ఆగ్రహాలు వ్యక్తమవుతున్నందున ఎన్నికల కమిషన్ సోమవారం దాని నిబంధనలకు చిన్న సవరణ చేసింది. 1987 తర్వాత జన్మించినవారు తమ జనన సర్టిఫికెట్‌తోపాటు వారి తల్లిదండ్రుల జనన సర్టిఫికెట్లు సమర్పించాలన్న తుగ్లక్ ఫర్మానా ఉపసంహరించుకుంది. అందుకు ప్రత్యామ్నాయంగా, 4.96 కోట్ల ఓటర్లతో కూడిన 2003 ఓటర్ల జాబితాను అప్‌లోడ్ చేసింది. ఓటు నమోదుకు దరఖాస్తుదారు తన జనన ధృవీకరణతోపాటు ఆ ఓటర్ల జాబితాలోని తమ తల్లిదండ్రుల పేర్లున్న భాగాన్ని పొందుపరిస్తే సరిపోతుందని చెప్పింది. దీంతో మొత్తం ఓటర్లలో 60 శాతం మంది ఏ డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం ఉండదన్నారు. అయితే 2003 జాబితాలోని వ్యక్తులు 1.8 కోట్ల మంది చనిపోవటమో లేక వలస పోవటమో జరిగింది. కాబట్టి ఇసి ప్రక్రియకు లీగల్ సవాలు ఎదురుకావచ్చు.**

చేస్తుంది. ఓటరు తన పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి ఇసి పరిమిత సమయాన్ని ఇస్తుంది. ఓటరుకి అది సాధ్యం కాదని అస్సాం అనుభవం ఇప్పటికే నిరూపించింది. అదనంగా, 2023 తర్వాత బిహార్‌లో జన్మించిన వారందరికీ జనన ధ్రువీకరణ పత్రాలు కూడా లేవని గమనించాలి. జనాభా పరిశోధనా కేంద్రం నివేదిక ప్రకారం, 2018లో బిహార్‌లో జనన నమోదు రేటు కేవలం 80.3 శాతం మాత్రమే. దీని అర్థం లక్షలాది మంది తమ జనన ధ్రువీకరణ పత్రాలను కూడా సమర్పించలేరు. అందువల్ల సవరించిన ఓటరు జాబితా నుండి వారు తొలగింపునకు గురికావచ్చు.

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇసి స్పష్టంగా ప్రభావితమైంది. అది ఎన్‌ఆర్‌సి రాజకీయాలను ఆడుతోంది. సవరించిన ఓటరు జాబితాలో చేర్చడానికి 'పౌరసత్వాన్ని నిరూపించుకోవడం' అనే షరతు ద్వారా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పేరుతో ఎన్‌ఆర్‌సిని పరోక్షంగా అమలు చేయడమే అవుతుంది. పౌరసత్వాన్ని నిరూపించుకోవడమనేది వివాదాస్పద అంశం కాబట్టి, ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు ఇసి దానిని షరతుగా ఉంచకూడదు.

మోదీ ప్రభుత్వం తరపున పౌరసత్వ సమస్యలోకి ఇసి తలదూర్చడం ద్వారా అది రాజీపడడమే కాకుండా, భారతదేశం అంతటా ఎన్‌ఆర్‌సిని తయారు చేసి, దానిని నిర్వహించాలనే అంశం మోదీ ప్రభుత్వం అజెండాలో ఉందని కూడా సూచిస్తుంది. ఈ నేపథ్యంలో టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటన గమనించదగినది. సవరణ వల్ల గ్రామీణ ప్రజలు మినహాయించబడతారని ఆమె అన్నారు. 'ఆపై మీరు జాబితాను పెంచడానికి 'అరువు తెచ్చుకున్న ఓటర్ల' పేర్లను చేర్చుకుంటారు. ఎందుకంటే మీరు ఓడిపోతున్నారు. మీరు ఓడిపోతున్నందున, మీరు ఇతర రాష్ట్రాలకు చెందిన వారి పేర్లను చేర్చుకుంటారు. ఇది ఎన్‌ఆర్‌సి కంటే ప్రమాదకరమైనది' అని ఆమె అన్నారు.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం వచ్చే ఏడాది ఎన్నికలకు వెళ్లనుందని గమనించాలి. కొత్త ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియ ముసుగులో బిజెపి, ఇసి కలిసి పనిచేస్తున్నాయని, 'బెంగాల్, దాని ప్రజలను', ముఖ్యంగా బెంగాల్ యువతను లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆమె ఆరోపించారు. 'ఇది చాలా ఆందోళనకరమైనది. ఓటరు జాబితాలో మీ పేరును చేర్చడానికి వారు ఒక డిక్లరేషన్ ఫామ్‌ను ప్రవేశపెట్టారు. 1987 జులై 1, 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు, వారి పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయడానికి తల్లిదండ్రుల జనన ధృవీకరణ పత్రాలతో పాటు కొత్త డిక్లరేషన్ ఫారంను సమర్పించాలి. తల్లిదండ్రుల జనన ధృవీకరణ పత్రాలు సమర్పించాలని ఇసి చెబుతోంది. సమగ్ర సవరణ పేరుతో ఏమి జరుగుతోంది? ఇది ఇసి ఇచ్చిన ఒక పత్రం, డిక్లరేషన్ ఫామ్. చాలా అవకతవకలు ఉన్నాయి' అని ఆమె మండిపడ్డారు ఇక్కడ 'ఓటరు జాబితా తారుమారు' ఆరోపణలు వస్తున్నాయి. ఇది ప్రాథమికంగా సాధ్యమేనని అనిపిస్తుంది. ఇది బిజెపి, ఎన్‌డిఎలకు అనుకూలంగా ఉండవచ్చు. ఈ విధంగా మహారాష్ట్రలో బాగా జరిగింది. ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించినట్లుగానే. ఇసి కొత్త చర్యను కాంగ్రెస్ కూడా వ్యతిరేకించింది. ఇందులో రాష్ట్ర యంత్రాంగాన్ని ఉపయోగించుకొని ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించే ప్రమాదం ఉందని, ఇది 'కుట్ర' అని అభివర్ణించింది.

బిహార్‌తో ప్రారంభించి, దేశవ్యాప్తంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ నిర్వహిస్తామని ఇసి ఇప్పటికే చెప్పినందున, అటువంటి అన్ని కసరత్తులలో పౌరసత్వ రుజువు షరతు ఉంటుందని మనం ఊహించవచ్చు. ఇది ఓటరు జాబితా సవరణలో ఒక కొత్త విషయం. ఇందుకు ఇసి కొత్త నియమాలు, మార్గదర్శకాలను రూపొందించింది. కానీ, దీనిని పాటించేందుకు ఓటర్లకు తగినంత సమయం ఇవ్వడం లేదు. ఇది పూర్తిగా ఎన్నికల కమిషన్ అప్రజాస్వామిక వైఖరి.

ఈ సమస్య బిహార్‌లో ఇప్పటికే రాజకీయ తుపానును సృష్టించింది. ఇది ఇతర రాష్ట్రాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. బుధవారం పాట్నాలో బిహార్ ముఖ్య ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో జరిగిన రాజకీయ పార్టీల సమావేశానికి ఆర్‌జెడి, కాంగ్రెస్, సిపిఐ సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, సిపిఐ(ఎం) సహా ఇండియా కూటమి ప్రతినిధులు హాజరయ్యారు. ప్రత్యేక ఓటర్ల పరిశీలన ప్రక్రియను పేద, గ్రామీణ, మైనారిటీ ఓటర్లను తొలగించడానికి ఒక పన్నాగంగా ప్రకటిస్తూ వారు ఏకగ్రీవంగా దానిని తిరస్కరించారు.

# ప్రైవేట్ ఏజెన్సీకి సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపు

## సమగ్ర విచారణకు కార్మిక సంఘాల డిమాండ్

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు (టిబిఓసిడబ్ల్యూ) పరిధిలో 14.90 లక్షల మంది కార్మికులు నమోదయ్యారు. ఈ సభ్యుల నుండి (అడ్మిషన్ 50/+ సం.రానికి 12/లు 5 సం. రాలకు 60/)చొప్పున రూ.110/లు ప్రతి సభ్యుడు బోర్డుకు చెల్లించడం జరిగింది. రాష్ట్రంలో భవన, నిర్మాణ సంస్థల నుండి సెస్సు రూపేణా ఒక శాతం వసూలు చేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో జమ చేయాలి. ఇట్టి నిధులను కార్మిక సంక్షేమానికి ముఖ్యంగా సభ్యులుగా నమోదై ఉన్నవారు ప్రమాదంలో చనిపోతే రూ.5 లక్షలు, సహజ మరణానికి రూ.1లక్ష, అంగవైకల్యం జరిగితే, హాస్పిటలైజేషన్ అయితే, కార్మికులు చనిపోతే దహన క్రియలకు రూ.30వేలు, ప్రసూతి అలవెన్స్ రెండు కాన్పులకు రూ.30వేలు, ప్రమాదంలో చనిపోయిన వారి బాడీని వారి స్వగ్రామానికి పంపించుటకు, సభ్యుల కుమార్తె వివాహ ఖర్చులకు, తదితర సంక్షేమాలకు కార్మికులకు అందజేయవలసి ఉన్నది.



సంక్షేమ బోర్డు నియమ నిబంధన ప్రకారం కార్మిక సంఘాల ప్రతినిధులు, బిల్డర్స్ ప్రతినిధులు, ప్రభుత్వ (కార్మికశాఖ) ప్రతినిధులతో త్రైపాక్షిక కమిటీ ఉండాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో ఆనాటి కార్మిక శాఖ మాత్యులు లేట్ నాయిని నరసింహారెడ్డి చైర్మన్‌గా (2015–18)వరకు ఉండినారు. ఆ తదుపరి గత ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభు త్వం బోర్డుకు పాలకమండలిని నియమించకుండా, కార్మిక సంఘాలతో సమావేశాలు జరపకుండా.. ప్రభుత్వ అధికారులు, కార్మిక శాఖ ఇష్టానుసారంగా వ్యవహరించుతూ బోర్డు నిధులను ఇష్టమొచ్చిన రీతిగా ఖర్చు చేస్తున్నారు. కార్మికులకు అందించవలసిన సహాయం సకాలంలో అందుట లేదని.. బోర్డు నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేయడం, దుర్వినియోగంపై విచారణ జరపాలని కోరుతూ కార్మిక సంఘాలు, ఈ మధ్యకాలంలో లేబర్ కమిషనర్ ఆఫీసును ముట్టడించి ధర్నాలు ప్రదర్శన చేయడం జరిగింది.

### నిధులు మళ్లింపు

నిర్మాణరంగంలో పనిచేసే కార్మికులకు హెల్త్ స్కీమ్ పెట్టాలని.. వారికి ఈఎస్‌ఐ మాదిరిగా కుటుంబానికి వర్తించే విధంగా హెల్త్ కార్డు ఇస్తూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా ఆరోగ్య టెస్టులు చేసి మందులు అందించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో హెల్త్ స్కీం ప్రవేశపెట్టకపోగా.. సంక్షేమ బోర్డు నుండి నిధులు కాజేసేందుకు కొన్ని ఏజెన్సీలు కేంద్ర ప్రభుత్వం కార్మిక శాఖతో మిలాఖతై కార్మికులకు హెల్త్ టెస్టుల పేరుతో దొడ్డి దారిన నిధులు కొల్లగొట్టొచ్చని ఒక పథకాన్ని రూపొందించాయి.

అందులో భాగంగానే 2022లో కేంద్ర 'ఐటి, కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ' నిర్ణయించింది. ఆ శాఖ పరిధిలో పనిచేసే 'సిఎస్ ఈఈ గవర్నెన్స్ ఇండియా లిమిటెడ్'కు కార్మికుల హెల్త్ స్క్రీనింగ్ బాధ్యతలను అప్పగించారు. ఈ విభాగం కార్మికులకు వైద్య పరీక్షలు చేసే బాధ్యతను సిఎస్‌ఈ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ప్రైవేట్ ఏజెన్సీకి కట్టబెట్టింది. ఈ సంస్థను 2022 జూన్‌లో ఏర్పాటు చేయగా.. అదే ఏడాది నవంబర్‌లోనే కేంద్రప్రభుత్వం టెండర్ లేకుండానే ఈ కాంట్రాక్టును కట్టబెట్టింది. లక్షల మందికి హెల్త్ స్క్రీనింగ్ చేసే సంస్థకు జాతీయ అక్రిడిటేషన్ బోర్డు టెస్టింగు, కాలిబ్రేషన్ లేబోరేటరీస్ (ఎన్‌ఏబీఎల్) నుంచి ఎలాంటి సర్టిఫికెట్ లేదు. టెండర్ లేకుండానే ఒప్పందం ఎలా చేసుకుంటారని హైదరాబాద్‌కు చెందిన ఎం.శ్రీనివాస్ పలుమార్లు ఆర్టిఐ కింద దరఖాస్తు చేయగా.. రాష్ట్ర కార్మిక శాఖ నుంచి సమాధానం లేదు.

### కోట్ల రూపాయలు పక్కదారి పట్టిందిలా

రాష్ట్రంలో భవన ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డులో 14.90 లక్షల మంది కార్మికులు నమోదయి ఉన్నా రు. ఇప్పటివరకు ప్రైవేటు ఏజెన్సీ 14.63 లక్షల మందికి అంటే 99 శాతం కార్మికులకు పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కేవలం రక్త నమూనాల సేకరణ కే పరిమితమైనప్పటికీ.. 20 రకాల పరీక్షలు చేసినట్లు పేర్కొం ది. ఒక్కొక్క కార్మికుడికి పరీక్షలు చేసినందుకు రూ.3,256లు రాష్ట్ర ప్రభుత్వ కార్మికుల సంక్షేమ బోర్డు నిధుల నుండి సదరు ఏజెన్సీకి ముట్టచెప్పినట్లు తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించకుండానే కొందరు కార్మిక శాఖ అధికారులు సహాయంతో రూ.462.58 కోట్లు నిధులను ఈ ఏజెన్సీ పక్కదారి పట్టించింది. 2022 నుంచి 2025 ఫిబ్రవరి వరకు ఈ మొత్తం చెల్లించినట్లు కార్మిక శాఖ అధికారికంగా వెల్లడించింది.

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల పరిధిలో నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పరీక్షలు చేయకుండానే పరీక్షలు చేసినట్లు కొంతమంది ఏజెన్సీలను, పైరవీకారులను పెట్టుకొని స్థానిక లేబర్ అధికారులతో లాలూచీపడి కోట్ల రూపాయలను కొల్లగొట్టుతున్న సంస్థ నిర్వాకంపై సమగ్రంగా విచారణ చేపట్టాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయుసీ) ఆధ్వర్యంలో జూన్ 17న రాష్ట్ర లేబర్ కమిషన్ ఆఫీస్ వద్ద నిరసన ధర్నా చేపట్టి ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రవిచారణ జరిపించాలని నూతనంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జి.వివేక్‌ని కోరటం జరిగింది. తక్షణమే బోర్డుకు గుర్తించబడిన కార్మిక సంఘాల ప్రతినిధులతో పాలక మండలి నియమించాలని కోరడం జరిగింది.

# ప్రగతి బాటలు వేసే విద్యా విధానం కావాలి

విద్యార్థులకు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన విద్యారంగం, నేడు అనేక సవాళ్లతో సతమతమవుతోంది. వ్యాపార కేంద్రాలుగా మారిన విద్యాసంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, కేవలం మార్కులు, ర్యాంకులకు ప్రాధాన్యతనిస్తూ జ్ఞాన వికాసాన్ని నిర్లక్ష్యం చేయడం వంటివి ప్రస్తుత విద్యావిధానంలోని లోపాలు. ఈ నేపథ్యంలో, సమూలమైన మార్పులు ఆవశ్యకం.

ప్రస్తుతం, విద్య అనేది ఒక వ్యాపారంగా మారిపోయింది. ప్రైవేటు విద్యాసంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తూ, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయి. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయాలి. విద్యను మళ్లీ ఒక సేవా దృక్పథంతో చూడాలి. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆధునిక బోధనా పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా వాటిని బలోపేతం చేయాలి. తద్వారా, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించి, ఒకే విధానంలో విద్యా బోధన జరిగేలా చూడాలి.

నేటి విద్యావిధానం కేవలం మార్కులు, ర్యాంకుల చుట్టూ తిరుగుతోంది. ఇది విద్యార్థులపై అనవసరమైన ఒత్తిడిని పెంచుతోంది తప్ప, వారికి నిజమైన జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించడం లేదు. నూతన విద్యా విధానంలో జ్ఞాన వికాసానికి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి. సిద్ధాంత పరిజ్ఞానంతో పాటు, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించే వృత్తి విద్యా వర్క్‌షాప్‌లు కలిగిన విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. ఇది విద్యార్థులను భవిష్యత్తులో ఉద్యోగాలకు సిద్ధం చేయడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది.

బోధనా పద్ధతులలో గణనీయమైన మార్పులు అవసరం. కేవలం బట్టీపట్టే విధానానికి స్వస్తి పలికి, ఆవిష్కరణాత్మక, సృజనాత్మక పద్ధతులను ప్రోత్సహించాలి. విద్యార్థులకు ఆసక్తి పెంపొందించే విధంగా, ఆడుతూ పాడుతూ విజ్ఞాన వికాసానికి దోహదం చేసేలా విద్యా సంస్థలు ఉండాలి. దీనికి అనుగుణంగా, ప్రతి ఉపాధ్యాయునికి అవసరమైన ఆధునిక శిక్షణను అందించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో సమర్థవంతంగా వినియోగించుకునేలా ఉపాధ్యాయులను తీర్చిదిద్దాలి. బోధన అనేది కేవలం సమాచారాన్ని అందించడం కాకుండా, విద్యార్థులలో ఆలోచనా శక్తిని, విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందించేదిగా ఉండాలి.

నూతన విద్యా విధానం విజయవంతం కావాలంటే, తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం. కేవలం పాఠశాలపైనే భారం వేయకుండా, తల్లిదండ్రులు తమ వంతు బాధ్యతగా తమ పిల్లలకు సరైన విద్యావకాశాలు కల్పించాలి. పిల్లల అభిరుచులను గుర్తించి, వారిని ప్రోత్సహించాలి. విద్యార్థులు పాఠశాలలోని అన్ని కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేలా చూడాలి. ఇంటి వద్ద కూడా నేర్చుకునే వాతావరణాన్ని కల్పించడం ద్వారా వారి బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలి.

నూతన విద్యా విధానం అనేది కేవలం పుస్తకాల బరువును తగ్గించడం కాదు, విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం మాత్రమే కాదు. అది వారిని జ్ఞానవంతులుగా, నైపుణ్యవంతులుగా, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే సమగ్ర ప్రణాళిక అంటున్నారు.

– దండంరాజు రాంచందర్ రావు
9849592958

# కుల వృత్తులపై కార్పొరేట్ కత్తి

## కార్పొరేట్ బ్రాండ్ల మాయలో కనుమరుగవుతున్న సంప్రదాయ కుల వృత్తులు

కుల వృత్తికి గౌరవం అనే భావన మసకబారుతోంది. బ్రాండెడ్ బిజినెస్ విస్తరణతో సంప్రదాయ సేవా కుల వృత్తులు కనుమరుగవుతున్నాయి. ఇది కేవలం ఉపాధి విషయంలోనే కాదు – నైపుణ్యాన్నీ, సంస్కృతిని, సమాజ నిర్మాణాన్ని వెక్కిరించే వాస్తవంగా మారుతుంది. ఒక సమాజం శాశ్వతంగా నిలబడాలంటే, రెండు మూలాధారాలు అవసరం. ఒకటి విలువలు. రెండోది కుల వృత్తులు. భారత దేశ గ్రామీణ నిర్మాణంలో ఈ రెండూ కలిసిపోయిన జీవన తంత్రం. ప్రతి కులానికి ఒక వృత్తి – ప్రతి వృత్తికి ఒక గౌరవం అన్న తత్వం శతాబ్దాలుగా గ్రామ జీవనశైలికి ఊపిరిలా వుంది. కానీ తాజాగా – కార్పొరేట్ విస్తరణ, బ్రాండెడ్ మార్కెటింగ్, గ్లోబల్ ఫ్యాషన్ కల్చర్ – ఈ మూడు కలిసి సంప్రదాయ వృత్తుల మెడపై కత్తిగా మారాయి. ఇది కేవలం ఆర్థికంగా కాదు – సామాజిక నిర్మాణం, వారసత్వ కళలు, కుటుంబ జీవన విధానాలపై ప్రబలమైన ప్రభావాన్ని చూపుతున్నాయి.

### హాలియాలో నాయీబ్రాహ్మణుల ధర్నా

ఇటీవల నల్లగొండ జిల్లా హాలియా మండల కేంద్రంలో ఓ కార్పొరేట్ సెలూన్ ప్రారంభానికి వ్యతిరేకంగా స్థానిక నాయీబ్రాహ్మణులు 45 రోజులుగా శాంతియుతంగా ధర్నా చేస్తున్నారు. ఇది ఒక్క వారికి సంబంధించిన విషయం మాత్రమే కాదు – ఇది గ్రామీణ జీవన విధానానికి అన్ని కుల వృత్తులకు వారి అస్తిత్వానికి సంబంధించినది..

☞ గతంలోనూ నల్లగొండ జిల్లా కేంద్రంలో బ్రాండెడ్ సెలూన్లకు వ్యతిరేకంగా చేసిన పోరాటం ఫలించలేదు.

☞ ఇప్పుడు అదే కత్తి మండల కేంద్రాలకు గ్రామాలలో కూడా చొచ్చుకెళ్తోంది.

☞ కార్పొరేట్ సెలూన్ల వల్ల స్థానిక సెలూన్లు మూత పడుతూ, నాయీబ్రాహ్మణులు ఉపాధి కోల్పోతున్నారు.

ఇది ఒక్క నాయి బ్రాహ్మణుల, నల్గొండ జిల్లా సమస్య మాత్రమే కాదు తెలుగు రాష్ట్రాలలో ప్రతీ జిల్లా మండల కేంద్రాల్లో అన్నీ కుల వృత్తుల వారికి ఈ పరిస్థితి వుంది.. తెలుగు రాష్ట్రాలలో ప్రతీ గ్రామంలో సగటున 3–4 నాయీబ్రాహ్మణ కుటుంబాలు వారి వృత్తి ఆధారంగా జీవించేవి ఉన్నాయి. కానీ తాజాగా, తెలుగు రాష్ట్రాలలో వివిధ మండలాల్లో ఒక్కో ప్రాంతంలో 2–3 బ్రాండెడ్ సెలూన్లు, 1–2 బ్యూటీ పార్లర్లు పెరగడం వల్ల స్థానిక వృత్తిదారుల ఆదాయం 50%కు తగ్గినట్లు నాయీ సంఘాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాలలో సుమారు ఐదు నుంచి ఆరు లక్షల మంది నాయీబ్రాహ్మణులు ప్రత్యక్షంగా, ఒకటి నుండి రెండు లక్షమందికిపైగా పరోక్షంగా సెలూన్ సేవలపై ఆధారపడుతున్నారు. ఇదే తరహాలో దేశవ్యాప్తంగా 1.2 కోట్లు పైగా సంప్రదాయ వృత్తిదారులు నష్టాల్లో ఉన్నారు.

### కుల వృత్తులు – సేవా ధర్మానికి నిదర్శనాలు

☞ నాయీబ్రాహ్మణులు పండుగల సమయంలో అర్ధరాత్రి వరకు సేవలందించే వృత్తి సంస్కృతి కలిగినవారు. శుభ కార్యాలకు వీరి అవసరం అత్యంత ప్రాధాన్యత. ప్రతీ ఇంట్లో జరిగే మంచికి చెడుకు అన్నిటికీ వీరి అవసరం వుంటుంది, ఇది తరతరాలుగా వస్తున్న అనవాయితీ.

☞ కమ్మరులు – బంగారానికి కళాత్మక రూపం ఇచ్చేవారు. ఒక్కో ఆభరణాన్ని రోజుల తరబడి చెక్కేవారు. కానీ ఇప్పుడు బ్రాండెడ్ జ్యువెలరీ షాపుల ఈఎంఐ ఆఫర్లు, సినీ సెలబ్రిటీలు ప్రచారం వంటి వాటి వలన వీరికి ఉపాధి కష్టంగా మారింది. ఇంకా చేనేత వృత్తుల వారు ఇంకా ఎన్నో కుల వృత్తుల వారు కార్పొరేట్ మార్కెట్ల మాయకు ఉపాధి కోల్పోతున్నారు. ఇవి వారి అస్థిత్వాన్నే ప్రమాదంలో పడేశాయి.

☞ ఇది కేవలం ఆర్థికపరమైన పోటీ మాత్రమే కాదు. ఇది ఒక వ్యవస్థ విచ్ఛిన్నం. కార్పొరేట్ విస్తరణలో గ్రామీణ నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకోకపోతే, మనం పది ఏళ్లలో శతాబ్దాల వారసత్వాన్ని కోల్పోతాం.


☞ స్థానిక వృత్తులను పరిరక్షించేందుకు ప్రత్యేక జాబితా, మార్కెట్ లింకేజులు, ఈ కామర్స్ మార్కెట్ వంటివి అవసరం. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా అన్న పేర్లు ఉన్నా... వీటిని గ్రామీణ సంప్రదాయ వృత్తులకు అన్వయించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది.

### ప్రభుత్వం, సమాజం తీసుకోవాల్సిన చర్యలు

- స్థానిక వృత్తుల కోసం రిజర్వేషన్ స్ట్రాటజీ అమలు చేయాలి
- మునిసిపాలిటీలలో, మండల పరిధిలో కార్పొరేట్ సంస్థలకు లైసెన్సులు ఇచ్చే ముందు, స్థానిక వృత్తులపై సోషియో ఎకనామిక్ ఇంపాక్ట్ అసెస్మెంట్ తప్పనిసరిగా చేయాలి.
- మేడ్ఇన్ విలేజ్, ప్యూర్ స్కిల్ సర్వీస్ గోల్డ్ బై హ్యాండ్ వంటి బ్రాండ్లు తీసుకురావాలి.
- నాబార్డ్ ఎంఎస్ఎంఈ, కెవిఐసి వంటి సంస్థలు గ్రామీణ వృత్తిదారులకు మౌలిక సదుపాయాలకు, బ్రాండింగ్ మద్దతు అందించాలి.
- నూతన పరికరాలు, సాంకేతికత, సోషల్ మీడియా మార్కెటింగ్, డిజిటల్ మార్కెటింగ్ వంటి అంశాల్లో వృత్తిదారులకు శిక్షణ ఇవ్వాలి.
- ఈ కామర్స్ ద్వారా దేశవాళీ సేవలకు మార్కెట్ కలిపే అవకాశాలు అందించాలి.
- పాఠశాల స్థాయిలోనే సంప్రదాయ వృత్తులపై అవగాహన కల్పించాలి.
- గ్రామ పంచాయతీల నుంచే స్థానిక సేవల ప్రోత్సాహానికి ప్రణాళిక రూపొందించాలి.

కార్పొరేట్ సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థలో భాగం కావచ్చు. కానీ వాటి అభివృద్ధి – సంప్రదాయ వృత్తులను తుడిచిపెట్టేలా ఉంటే, అది సమతుల అభివృద్ధి కాదు. 45 రోజుల నాయీబ్రాహ్మణుల ధర్నా – ఇది కేవలం ఉపాధి కోల్పోయిన ఆవేదన కాదు... మౌనంగా ఉండి పోయిన వ్యవస్థపై ఒక గళం. అభివృద్ధి కావాలి కానీ అస్థిత్వాన్ని కోల్పోయే అభివృద్ధి కాదు. బ్రాండ్లు కావాలి కానీ బ్రతుకులను మింగే బ్రాండ్లు కావు! నవీనత కావాలి కానీ నైపుణ్యాన్ని నిర్వీర్యం చేసే నూతనత కాదు! గ్రామీణ జీవనాన్ని రక్షించడమే అసలైన జాతీయ అభివృద్ధి. పాత కుల వృత్తుల పునరుజ్జీవనమే – భవిష్యత్తు భారత నిర్మాణానికి అసలైన పెట్టుబడి. ఇప్పటికైనా ప్రభుత్వాలు, సమా జం స్పందించకపోతే రేపటి మన గ్రామాలు, మన కళలు, మన వృత్తులు బ్రాండ్ల నీడల్లో కనుమరుగైపోవడం ఖాయం.

– జి.అజయ్ కుమార్
సామాజిక విశ్లేషకులు



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ముగిసిన భారత్-ఫ్రాన్స్ యుద్ధ విన్యాసాలు

న్యూఢిల్లీ : భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి భారతఫ్రెంచ్ సైన్యాలు ఉమ్మడి కార్యాచరణ సంసిద్ధతను పెంచడంపై దృష్టి సారించాయి. ఈ మేరకు ఇరు దేశాల సైన్యాలు ఫ్రాన్స్‌లో రెండు వారాల యుద్ధ విన్యాసాలను నిర్వహించాయి. జూన్ 18నుండి జూలై 1వరకు (మంగళవారం) జరిగిన భారత్‌ఫ్రెంచ్ సైనిక విన్యాస శక్తిలో దాదాపు 50 సాయుధ, వ్యూహాత్మక వాహనాలు, ఫైటర్ జెట్లను మోహరించారు. ఫ్రెంచ్ ఆర్మీ, ఫారిన్ లెజియన్‌కు చెందిదన పలు యూనిట్ల నుంచి 500కు పైగా దళ సభ్యులు, సైనిక సిబ్బంది, ఫ్రెంచ్ ఎయిర్, స్పేస్ ఫోర్స్ వారు ఈ యుద్ధ విన్యాసంలో భాగస్వాములయ్యారని ఫ్రెంచ్ ప్రభుత్వం జారీచేసిన ఒక 'రీడ్ ఔట్' (ప్రకటన) తెలియజేసింది. 90మంది సిబ్బందితో కూడిన భారత బృందంలో ప్రధానంగా జమ్మూ,కశ్మీర్ రైఫిల్స్ కు చెందిన బెటాలియన్‌తో పాటు ఇతర ఆయుధాలు, సేవలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు. ఇండోఫ్రెంచ్ ఉమ్మడి సైనిక విన్యాసాలు మోన్‌క్లార్ జిల్లాలోని అవేయ్‌రాన్‌లో, హెరాల్ట్‌లో జరిగాయి. కఠినమైన పోరాట పరిస్థితులను ఎదుర్కోవడానికి ఉమ్మడి కార్యాచరణ సంసిద్ధతను పెంపొందించడానికి భారత్‌ఫ్రెంచ్ సైనిక శక్తి కసరత్తు ఒక ముఖ్యమైన అవకాశం అని ఫ్రెంచ్ రాయబార కార్యాలయం జారీచేసిన ప్రకటనలో పేర్కొంది.

## తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర..

**న్యూఢిల్లీ :** వంట గ్యాస్ వినియోగదారులు స్వల్ప ఊరట లభించింది. ప్రతి నెల ఒకటో తేదీన గ్యాస్ సిలిండర్ ధరలను సవరిస్తున్న దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు.. తాజాగా వాణిజ్య అవసరాలకు వినియోగించే సిలిండర్ ధరలను తగ్గించాయి. 19కేజీల కమర్షియల్ సిలిండర్ ధరను రూ.58.50 మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి. సవరించిన ధరలు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశాయి. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ.1723 నుంచి రూ.1665కు చేరింది. కోల్‌కతాలో రూ.1769, చెన్నైలో రూ.1822.50గా ఉన్నది. గత నెల కూడా రూ.24 మేర సిలిండర్ ధర తగ్గిన విషయం తెలిసిందే. కాగా, గృహావసరాలకు ఉపయోగించే 14 కేజీల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుతం ఒక్కో సిలిండర్ ధర రూ.855.50గా ఉన్నది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.50 పెరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి వాటి రేట్లు యధాతథంగా కొనసాగుతున్నాయి.

## జిఎస్‌టిని సంస్కరించాలి

### ఆశ్రిత కార్పొరేట్, ఆర్థిక అన్యాయ క్రూర సాధనం
### ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ :** వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) అమల్లోకి వచ్చి జులై 1వ తేదీతో ఎనిమిది సంవత్సరాలు పూర్తి అయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ స్పందించింది. జిఎస్‌టిని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ఆశ్రిత కార్పొరేట్ క్రూర సాధనంగా అభివర్ణించారు. సంస్కరించబడిన జిఎస్‌టి ప్రజలకు అనుకూలంగా, వ్యాపారానికి మిత్రబంధంగా, నిజమైన సమాఖ్య స్ఫూర్తితో ఉండాలని రాహుల్ ఉద్ఘాటించారు. కొద్దిమందికి మాత్రమే కాకుండా అందరికీ పనిచేసే పన్ను వ్యవస్థకు భారతదేశం అర్హమైనదని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. చిన్న దుకాణదారుడి నుండి రైతు వరకు ప్రతి భారతీయుడు దేశ పురోగతిలో భాగస్వామిగా ఉండాలన్నారు. 'ఎనిమిది సంవత్సరాల మోడీ ప్రభుత్వం జిఎస్‌టి పన్ను సంస్కరణ కాదు. ఆర్థిక అన్యాయం, కార్పొరేట్ ఆశ్రితవాద క్రూరమైన సాధనం. పేదలను శిక్షించడానికి, ఎంఎస్‌ఎంఇలను అణిచివేయడానికి, రాష్ట్రాలను అణగదొక్కడానికి, పధానమంత్రి కొంతమంది బిలియనీర్ స్నేహితులకు ప్రయోజనం చేకూర్చడానికి దీనిని రూపొందించారు' అని రాహుల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. తగిన సరళమైన పన్ను వాగ్దానం చేశారని, కానీ అందుకు బదులుగా భారతదేశానికి సమ్మతి పీడకల రాగా, ఐదు స్లాబ్‌ల పన్ను విధానం తీసుకువచ్చారన్నారు. దీనిని 900 సార్లు సవరించారని విమర్శించారు. దీంతో కారామెల్ పాప్‌కార్న్, క్రీమ్ బన్స్ కూడా జిఎస్‌టి గందరగోళ వలయంలో చిక్కుకున్నాయన్నారు. 'భారతదేశంలో అతిపెద్ద ఉద్యోగ సృష్టికర్తలైన ఎంఎస్‌ఎంఇలు ఎక్కువగా నష్టపోయాయి. ఎనిమిది సంవత్సరాల క్రితం జిఎస్‌టి అమలులోకి వచ్చినప్పటి నుండి 18 లక్షలకు పైగా సంస్థలు మూతపడ్డాయి. పౌరులు ఇప్పుడు టీ నుండి ఆరోగ్య బీమా వరకు ప్రతిదానిపై జిఎస్‌టి చెల్లిస్తున్నారు. కార్పొరేట్లు ఏటా లక్ష కోట్లకు పైగా పన్ను మినహాయింపులను పొందుతున్నారు' అని రాహుల్‌గాంధీ ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌ను ఉద్దేశపూర్వకంగా జిఎస్‌టి చట్రం వెలుపల ఉంచడం వల్ల రైతులు, రవాణాదారులు, సాధారణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలను శిక్షించడానికి జిఎస్‌టి బకాయిలు కూడా ఆయుధాలుగా ఉపయోగించబడుతున్నాయని, మోడీ ప్రభుత్వ సమాఖ్య వ్యతిరేక ఎజెండాకు ఇది స్పష్టమైన రుజువు అని గాంధీ ఆరోపించారు. జిఎస్‌టి నాటి యుపిఎ దార్శనికత ఆలోచన అని, భారతదేశ మార్కెట్లను ఏకం చేయడానికి, పన్నులను సరళీకృతం చేయడానికి ఉద్దేశించబడిందని ఆయన అన్నారు. కానీ పేలవమైన అమలు, రాజకీయ పక్షపాతం, అధికార అతిక్రమణ ద్వారా మోసం చేస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. సంస్కరించబడిన జిఎస్‌టి ప్రజలకు ముందు, వ్యాపారానికి అనుకూలంగా, నిజంగా సమాఖ్య స్ఫూర్తితో ఉండాలన్నారు.

## జిఎస్‌టి మైలురాయిలాంటి సంస్కరణ:మోదీ



**న్యూఢిల్లీ :** వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి) అమలులోకి వచ్చి ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. పరోక్ష పన్ను విధానం భారతదేశ ఆర్థిక దృశ్యాన్ని పునర్నిర్మించిన ఒక మైలురాయి సంస్కరణగా నిలుస్తుందని అన్నారు. మంగళవారం ప్రధాని ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'సమ్మతి భారాన్ని తగ్గించడం ద్వారా, ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు వ్యాపార సౌలభ్యాన్ని ఇది బాగా మెరుగుపరిచింది. భారతదేశ మార్కెట్‌ను ఏకీకృతం చేసే ఈ ప్రయాణంలో రాష్ట్రాలను సమాన భాగస్వాములుగా చేయడం ద్వారా నిజమైన సహకార సమాఖ్యవాదాన్ని పెంపొందించడంతో పాటు, జిఎస్‌టి ఆర్థిక వృద్ధికి శక్తివంతమైన ఇంజిన్‌గా కూడా పనిచేసింది' అని అన్నారు. జూలై 1, 2017 నుండి అమలు చేయబడిన జిఎస్‌టి, 17 పన్నులు, 13 సెస్‌లను ఏకీకృతం చేసింది. సమ్మతిని సరళీకృతం చేయడం, పన్ను వ్యవస్థలను డిజిటలైజ్ చేయడం ద్వారా సజావుగా జాతీయ మార్కెట్‌ను సృష్టించింది. ఇది పన్ను చెల్లింపుదారుల స్థావరాన్ని విస్తరించింది, సహకార సమాఖ్యవాదాన్ని బలోపేతం చేసిందని ప్రభుత్వం తెలిపింది. ఆపరేషన్ మొదటి సంవత్సరం (తొమ్మిది నెలలు) స్థూల జిఎస్‌టి వసూళ్లు రూ. 7.40 లక్షల కోట్లు. సంవత్సరాలుగా ఇది ఘాతాంక వృద్ధిని సాధించిందని పేర్కొంది. 2024–25లో, స్థూల జిఎస్‌టి వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.22.08 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 9.4 శాతం వృద్ధిని సూచిస్తుంది. ఈ పెరుగుదల ఆర్థిక వ్యవస్థ పెరుగుతున్న అధికారికీకరణ, మెరుగైన పన్ను సమ్మతిని ప్రతిబింబిస్తుంది. వార్షిక జిఎస్‌టి ఆదాయాలు దాదాపు మూడు రెట్లు పెరిగాయి. 2017–18 ఆర్థిక సంవత్సరంలో రూ.7 లక్షల కోట్ల నుండి 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.22 లక్షల కోట్లకు పెరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

## 'డిజిటల్ ఇండియా' పదేళ్ళైనా గ్రామాలకు బ్రాడ్ బ్యాండ్ ఏది? : ఖర్గే



**న్యూఢిల్లీ :** మోదీ ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ ఇండియా పథకం పదేళ్ళు పూర్తయినా గ్రామాలు, పాఠశాలలకు ఇంకా బ్రాడ్‌బ్యాంక్ సదుపాయం లభించలేదని, ప్రభుత్వ రంగ టెలికాం సంస్థలు ఎంటిఎన్‌ఎల్, బిఎస్‌ఎన్‌ఎల్ అప్పులు పెరిగిపోయాయని, సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే మండిపడ్డారు. భారత్ ఇంటర్నెట్ ప్రాజెక్టు కింది 2025 జూన్ 26 నాటికి మొత్తం 6.55 లక్షల గ్రామాలకు బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యం కాగా, వీటిలో 4.53 లక్షల గ్రామాలు, అంటే వాటిలో 65 శాతం ఇంకా కవర్ చేయబడలేదని ఆయన పేర్కొన్నారు. ప్రవైటు టెలికాం సంస్థలు 5 జి ఆపరేట్ చేస్తుంటే, ప్రభుత్వ రంగ సంస్థ బిఎస్‌ఎన్‌ఎల్ మాత్రం ఇంకా లక్ష 4 జి టవర్‌ల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ప్రస్తుతం కేవలం 0.73% (766) గ్రామ పంచాయతీలకు మాత్రమే క్రియాశీల వైఫై సేవలు ఉన్నాయని అన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ అప్పు 291.7 శాతం పెరిగిందని, మార్చి 2014 లో రూ. 5,948 కోట్ల నుండి మార్చి 2024 లో రూ. 23,297 కోట్లకు పెరిగిందని ఆయన ఎత్తి చూపారు.అదే కాలంలో ఎంటిఎన్‌ఎల్ అప్పు 136.2% పెరిగి, రూ. 14,210 కోట్ల నుండి రూ. 33,568 కోట్లకు పెరిగిందని తెలిపారు. ఈ మేరకు ఖర్గే తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

**డిజిటల్ ఇండియా అంతరాన్ని తగ్గించింది, అవకాశాన్ని ప్రజాస్వామ్యం చేసింది: మోడీ**

దశాబ్దం క్రితం ప్రారంభించిన డిజిటల్ ఇండియా ఉన్నవారు, లేనివారి మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించిందని, అవకాశాలను ప్రజాస్వామీకరణ చేసిందని, ఇది ప్రజా ఉద్యమంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2014 లో భారతదేశంలో దాదాపు 25 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు ఉండగా, ఆ సంఖ్య 97 కోట్లకు పైగా పెరిగిందని, 42 లక్షల కిలోమీటర్లకు పైగా ఆప్టికల్ ఫైబర్ కేబుల్ భూమి మరియు చంద్రుని మధ్య దూరాన్ని 11 రెట్లు కలుపుతూ ఇప్పుడు మారుమూల గ్రామాలను కూడా కలుపుతోందని ఆయన అన్నారు. భారతదేశం 5 జి విస్తరణ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైనదని, కేవలం రెండు సంవత్సరాలలో 4.81 లక్షల బేస్ స్టేషన్లు ఏర్పాటు చేయబడ్డాయని ఆయన అన్నారు. ఈ మేరకు ప్రధాన మోదీ లింక్డిన్‌లో పోస్ట్ పెట్టారు.

## సమస్యల నుంచి పలాయనానికే ప్రధాని విదేశీ పర్యటనలు : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** తాజాగా విదేశీ పర్యటనలకు వెళ్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ మంగళవారం విమర్శలు గుప్పించింది. 'తరచుగా విదేశాలకు వెళ్లే ప్రధాని' ఐదు దేశాల 'విహారయాత్ర'కు బయలుదేరారని, మణిపూర్ పరిస్థితి, భారతదేశం, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ తీసుకువచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలు సహా నాలుగు సమస్యల నుండి ఆయన పారిపోతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. 'ఆపరేషన్ సిందూర్‌లోని మొదటి రెండు రోజుల్లో ప్రధాని నిర్ణయాల కారణంగా భారతదేశం ఎదురుదెబ్బలు తగిలాయని రక్షణ అధికారులు వెల్లడించిన విషయాల' నుండి ప్రధానమంత్రి పారిపోతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు.ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతాలో ఆయన పోస్ట్ చేశారు. వ్యాపార ఒప్పందం ఆశ చూపి భారతదేశం, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణను తాను అమలు చేశానని అధ్యక్షుడు ట్రంప్ చేసిన నిరంతర వాదనల నుండి ప్రధాని పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. '70 రోజుల తర్వాత కూడా పహల్గాం తీవ్రవాదులను న్యాయం ముందుకు తీసుకురావడంలో నిరంతర వైఫల్యం' నుండి ప్రధాని పారిపోతున్నారని ఆయన ఆరోపించారు. ప్రధాని విదేశీ పర్యటనలకు ముందు కాంగ్రెస్ తరచుగా ఆయన హింసాత్మక మణిపూర్‌ను ఎందుకు సందర్శించడం లేదని ప్రశ్నిస్తూ విమర్శలు గుప్పిస్తోంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, బ్రెజిల్‌తో సహా ఘనా, ట్రినిడాడ్, టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాను ప్రధాని మోదీ సందర్శిస్తారు.

## శివకాశీలో భారీ పేలుడు.. ఐదుగురు మృతి..



**చెన్నై :** తమిళనాడు విరుదునగర్ జిల్లా శివకాశిలోని బాణసంచా తయారీ కర్మాగారంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఫ్యాక్టరీ నుండి పెద్ద శబ్దం, పొగలు రావడంతో వెంటనే అప్రమత్తమైన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, రెస్క్యూ సర్వీసెస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని హుటాహుటినా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు సహా 5 మంది కార్మికులు మరణించినట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ఫ్యాక్టరీ మొత్తం ధ్వంసమైందని, పలువురు గాయపడ్డారని, ప్రస్తుతం శిథిలాలను తొలగించే పని జరుగుతోందని అగ్నిమాపక, రక్షణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం బాణసంచా తయారీ కర్మాగారంలో రసాయనాలను కలిపే పని జరుగుతుండగా పేలుడు సంభవించింది. రసాయనాలను కలిపే సమయంలో ఘర్షణ కారణంగా మంటలు చెలరేగి, ఫ్యాక్టరీలో పేలుడు సంభవించిందని భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు ప్రారంభించినా, అప్పటికి చాలా నష్టం జరిగిపోయింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేప్పట్టారు.

## 'అటవీ సంరక్షణ సవరణ చట్టం-2023'ను రాజీ చేయవచ్చు

### భారత ప్రధాన న్యాయమూర్తికి 60మంది పూర్వ సివిల్ సర్వెంట్ల బృందం లేఖ



**న్యూఢిల్లీ :** సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికారికత కమిటీ (సిఇసి)లో 'ప్రయోజన సంఘర్షణ' నెలకొన్న నేపథ్యంలో అటవీ సంరక్షణ సవరణ (ఎఫ్‌సిఎఎ)చట్టం2023ను సవాల్ చేసే కేసుల ఫలితాన్ని రాజీచేయవచ్చని 60 మంది పూర్వ సివిల్ సర్వెంట్ల బృందం తెలిపింది. ఈ బృంద ఈ విషయాన్ని భారత ప్రధానన్యాయమూర్తి (సిజెఐ)కి రాసిన ఒక లేఖలో నివేదించింది. జూన్ 30న రాసిన బహిరంగ లేఖలో పూర్వ కార్యదర్శులు, రాయబారులు, పోలీస్ అధిపతులు, అటవీ అధికారులు, నలుగురు సభ్యుల కేంద్ర సాధికారికత కమిటీలో ముగ్గురు మాజీ భారతీయ అటవీ సర్వీస్ (ఐఎఫ్‌ఎస్) అధికారులు, ఇటీవలే అటవీ డైరెక్టర్ జనరల్, పర్యావరణ మంత్రిత్వ శాఖతో అనేక సంవత్సరాల పాటు పనిచేసిన రిటైర్డ్ సైంటిస్ట్ కూడా ఉన్నారని, ప్యానెల్‌లో స్వతంత్ర నిపుణులు ఎవరూ లేరని చెప్పారు. 'పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖలో అత్యున్నత పదవులు నిర్వహించిన, విధాన రూపకల్పనలో దగ్గరి సంబంధం ఉన్న అధికారులతో కూడిన సిఇసి అత్యున్నత న్యాయస్థానానికి ప్రత్యేక సలహా ఇస్తుందని ఆశించలేము. వారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఇచ్చిన సలహాకు భిన్నంగా ఉంటుంది' అని లేఖలో పేర్కొన్నారు.2002లో ఏర్పాటైన కేంద్ర సాధికారికత కమిటీ 2023నాటికి సంతులిత కూర్పును కలిగిఉందని రాజ్యాంగ నిర్వహణ గ్రూప్‌లో భాగమైన రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్ తెలిపారు. 'ఇంతకుముందు సిఇసిలో ప్రభుత్వ నిపుణులు మాత్రమే కాకుండా స్వతంత్ర సభ్యులు, వన్యప్రాణి నిపుణుడు, సుప్రీంకోర్టు న్యాయవాది సీనియర్ ప్రభుత్వ పదవులను నిర్వహించడం గానీ ఫారెస్ట్ పాలసీ నిర్ణయాలలో పాల్గొనడం జరుగలేదు. తద్వారా నిష్పాక్షితను నిర్ధారిస్తుంది. ప్రయోజన సంఘర్షణను నివారిస్తుంది' అని వారు చెప్పారు. పర్యావరణ మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న ప్రస్తుత సిఇసి సభ్యుడు జాయింట్ పార్లమెంటరీ సమావేశం ముందు పరిరక్షణ సవరణ బిల్లును సిద్ధం చేసి సమర్థించారని పదవీ విరమణ చేసిన అధికారులు ఎత్తి చూపారు. ఆ సమయంలో చట్టం,దాని నియమాలు, మార్గదర్శకాలన్నీ తెలియజేయబడ్డాయి. 'ఎఫ్‌సిఎఎ2023 చట్టాన్ని సవాల్ చేసే సందర్భాలలో ప్రస్తుత సిఇసి ఇచ్చే ఏదైనా సలహా లేదా నివేదిక, దాని పరిస్థితిని బట్టి అన్ని విధాలుగా ఆమోదించబడిన చట్టానికి అనుకూలంగా ఉంటుంది. అందువల్ల ప్రయోజనాల సంఘర్షణను సూచిస్తుంది' అని లేఖలో చెప్పబడింది.ఎఫ్‌సిఎఎ2023 కేసులు సంబంధిత ఇతర ముఖ్య విషయాలైన అడవులు, వన్యప్రాణజీవులు, పర్యావరణ భద్రతకు సంబంధించిన కేసులను కోర్టులో ప్రస్తుత కేంద్ర సాధికారికత కమిటీని అనుమతించకూడదని ఈ 60మంది పూర్వ సివిల్ సర్వెంట్ల బృందం ప్రధాన న్యాయమూర్తిని కోరింది.

## ప్రభుత్వంలో నాయకత్వ మార్పు ఉండదు..

### ఊహాగానాలకు తెరదించిన కర్ణాటక డిప్యూటీ సిఎం డికె



**న్యూఢిల్లీ :** కర్ణాటక సర్కారులో త్వరలో నాయకత్వ మార్పు జరగబోతోందని, సిద్ధరామయ్యను తొలగించి సీఎం పదవిని ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌కు కట్టబెట్టబోతున్నారని గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలా బెంగళూరులో పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం కావడం ఆ ప్రచారానికి మరింత ఊపు తెచ్చింది. దాంతో ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఆ ప్రచారంపై పెదవి విప్పారు. ప్రభుత్వంలో ఎలాంటి నాయకత్వ మార్పు ఉండబోదని చెప్పారు. తాను నాయకత్వ మార్పును కోరుకోవడం లేదని, ముఖ్యమంత్రి పదవి కోసం తనకు ఏ ఎమ్మెల్యే మద్దతు అవసరం లేదని చెప్పారు. ప్రస్తుతం తమ దృష్టంతా స్థానిక సంస్థల ఎన్నికలు, 2028లో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికలపై ఉందన్నారు. రణ్‌దీప్ సుర్జేవాలా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సమావేశమైంది ప్రభుత్వంలో నాయకత్వ మార్పుపై చర్చించేందుకు కాదని, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాలపై చర్చించడానికని డికె చెప్పారు. నాయకత్వ మార్పు జరగనుందంటూ ఎమ్మెల్యే ప్రచారం చేయడం మానుకోవాలని ఆయన సూచించారు. ఇకపై ఈ అంశాన్ని ప్రస్తావించే ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## హిమాచల్‌లో వర్ష బీభత్సం..

### నలుగురు మృతి, 16 మంది గల్లంతు



**సిమ్లా :** హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాలకు హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో బియాస్ నది ఉప్పొంగి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. ఈ వర్షాలకు ఇప్పటి వరకూ మండి జిల్లాలో నలుగురు మరణించారు. కనీసం తొమ్మిది మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోగా.. 19 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. ఇక ఇప్పటి వరకూ 99 మందిని రక్షించినట్లు చెప్పారు. ఈ వర్షాలకు పది ఇళ్లు, 12 గోశాలలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. చండీగఢ్‌మనాలీ హైవేలోని మండి–మనాలీ మార్గంలో అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొండచరియలు విరిగిపడిన కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా మంగళవారం మండిలోని అన్ని విద్యా సంస్థలను అధికారులు మూసివేశారు. కాంగ్రా, సిర్మౌర్, సోలన్ జిల్లాల్లోని పాఠశాలలను కూడా మూసివేశారు. మండి, సిర్మౌర్ జిల్లాల్లోని దాదాపు 250కిపైగా రహదారులను అధికారులు మూసివేశారు. అంతేకాదు 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి. ఇక ఈ సీజన్‌లో వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య 23కి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. పొరుగున ఉన్న ఉత్తరాఖండ్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం, బుధవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి హెచ్చరికలు జారీ చేసింది. చమోలి, రుద్రప్రయాగ్, ఉత్తరకాశి, బాగేశ్వర్, పిథోరగఢ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికలతో అనేక జిల్లాల్లో పాఠశాలలను మూసివేశారు. చమోలిలో జులై 1 నుంచి 1–12వ తరగతి వరకూ అన్ని తరగతులకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## లా కాలేజీ విద్యార్థుల నిరసన ప్రదర్శన



**కోల్‌కతా :** ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ కోల్‌కతా లా కాలేజీలో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం తమకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ లా కాలేజీ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని, న్యాయం చేయాలని నినదించారు. సంస్థ పాలకమండలిలో సమగ్ర సంస్కరణలు చేయాల్సిన అవసరాన్ని వారు ఉద్ఘాటించారు. 24 ఏళ్ల మహిళపై సామూహిక అత్యాచారం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు విద్యార్థులను కళాశాల నుండి బహిష్కరించారు. ప్రధాన నిందితుడైన కాంట్రాక్టు ఉద్యోగి సేవను అధికారులు రద్దు చేశారు. ఈ ఘటనలో పాల్గొన్న వ్యక్తులకు తమ కళాశాలలో స్థానం ఉండదని నిరసనలో పాల్గొన్న ఓ విద్యార్థి పేర్కొన్నారు. ఆ వ్యక్తులు లా కళాశాల ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని మరొక నిరసనకారుడు అన్నారు. అధికారులు తమకు భద్రత కల్పిస్తారని నమ్మి తమ తల్లిదండ్రులు మమ్మల్ని కళాశాలకు పంపారని, ప్రతిఫలంగా మాకు ఏమి వచ్చింది? అని కళాశాల ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను ప్రశ్నిస్తూ ఒక విద్యార్థి నిలదీశారు. నిరసనకారులు తటస్థ పాలక మండలిని ఏర్పాటు చేయాలని, విద్యార్థుల ప్రతినిధులను కూడా అందులో చేర్చాలని పిలుపునిచ్చారు. కళాశాలలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న ప్రధాన నిందితుడు మోనోజిత్ మిశ్రా కూడా ఇన్స్టిట్యూట్ నుండి బహిష్కరించబడిన వారిలో ఉన్నారు. మిశ్రా, సహ నిందితులు జైబ్ అహ్మద్, ప్రమిత్ ముఖర్జీలను అరెస్టు చేసి మంగళవారం వరకు పోలీసు కస్టడీకి తరలించారు. కాగా, అలిపోర్ కోర్టుకు చెందిన దాదాపు 100 మంది న్యాయవాదులు కూడా నిందితులకు ఆదర్శప్రాయమైన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ కోర్టు ప్రాంగణంలో నిరసన చేపట్టారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అలిపోర్ కోర్టు అధ్యాయానికి చెందిన న్యాయవాదులు ఈ ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ క్యాంపస్ చుట్టూ ప్రదర్శన తీశారు.

## టర్కీ ప్రతిపక్షానికి వేధింపులు

### మేయర్ సహా 120 మంది అరెస్టు

**అంకారా:** టర్కీ ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్‌పార్టీ (ఆర్‌పిపి)ని లక్ష్యంగా చేసుకున్న అధ్యక్షుడు రెసిప్ తయ్యప్ ఎర్డొగాన్ ప్రభుత్వం 120 మందిని అవినీతి ఆరోపణలపై మంగళవారం నాడు అరెస్టు చేసింది. వీరిలో దేశాధ్యక్షుడికి ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న ప్రజాదరణ పొందిన మేయర్, ఆర్‌పిపి ప్రాంతీయ అధ్యక్షుడు ఎక్రెమ్ ఇమామోగ్లూ కూడా ఉన్నారు. మాజీ మేయర్ టంక్ సోయర్, పార్టీ ప్రాంతీయ అధ్యక్షుడు సెలోన్ అస్లనోగ్లూతో పాటు ఇతర సీనియర్లు కూడా అరెస్టైనవారిలో ఉన్నారని పార్టీ ఉపాధ్యక్షుడు మురాత్ బకాన్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. రు. పశ్చిమప్రాంత నగరం ఇజ్మిర్‌లో ఈ అరెస్టులు చేశారు. వాస్తవానికి 157 మందిపై అరెస్టు వారెంట్లు జారీ చేశారు. అరెస్టయిన వారిలో ఎక్కువమంది సిటీ హాల్ సభ్యులు. ప్రతిపక్ష ఆర్‌పిపి అనేక సంవత్సరాలుగా ఇజ్మిర్‌లో స్థానిక ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపిస్తోంది.

## అక్రమంగా చేపల వేట భారతీయ మత్స్యకారులు అరెస్ట్

### శ్రీలంక నావీ వెల్లడి



**కొలంబో :** శ్రీలంక ద్వీపం జాతీయ జలాల్లో అక్రమంగా చేపల వేట సాగిస్తున్నారన్న అభియోగంపై ఏడుగురు భారతీయ మత్స్యకారులను అరెస్ట్ చేసి, వారి ట్రాలర్ పడవలను స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం శ్రీలంక నావికాదళం తెలిపింది. వారంలో ఈ తరహా సంఘటన జరగడం ఇది రెండవసారి. తలైమన్నార్ రీజియన్‌లో ప్రాదేశిక జలాల్లో సోమవారం రాత్రి ఈ అరెస్టులు జరిగాయని నావికాదళం అధికార ప్రతినిధి చెప్పారు. అరెస్ట్ అయిన మత్స్యకారులను, వారి ట్రాలర్లను మన్నార్‌లోని ఫిషరీస్ ఇన్‌సెక్టొరేట్‌కు అప్పగించినట్లు నావికాదళం తెలిపింది. నావికాదళం ఆదివారం 8మంది మత్స్యకారులను అరెస్ట్ చేసింది. కాగా ఇటీవల భారతదేశంశ్రీలంకకు చెందిన మత్స్యకారులు తరచుగా అనుకోకుండా ఇరుదేశాల ప్రాదేశిక జలాలలోకి ట్రెస్‌పాసింగ్ చేస్తున్నారు. భారతదేశంశ్రీలంక సంబంధాల లో మత్స్యకారుల సమస్య వివాదాస్పదమైంది. శ్రీలంక నావికాదళ సిబ్బంది పాక్ జలసంధిలో భారతీయ మత్స్యకారులపై కాల్పులు జరిపి, ద్వీప జాతీయ జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారనే అభియోగంపై అనేక సంఘటనలలో వారి పడవలను స్వాధీనం చేసుకున్నారు. శ్రీలంక నుంచి వేరుచేసే జలసంధి అయిన పాక్ జలసంధి ఇరుదేశాల నుంచి వచ్చే మత్స్యకారులకు ఒక గొప్ప చేపల వేట కేంద్రంగాపరిగణింపబడుతోంది.

## ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని యాదాద్రి టౌన్షిప్ వద్ద నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన్ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఇందిరా మహిళా శక్తి భవన్ ద్వారా జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలు వారి యొక్క కార్యకలాపాలు, శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని వారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్, ఉత్పత్తుల ప్రదర్శన ,మేళాలు, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణకు ఈ కార్యాలయం ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఈ మాధవ్ కి కలెక్టర్ తెలిపారు.

## భూనిర్వాసితుల స్థలం పరిశీలన



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పరిధిలోని హుస్సేనాబాద్ కాలనీలో బస్వాపురం రిజర్వాయర్ ప్రాజెక్టులో ముంపుకి గురైనా బిఎన్ తిమ్మాపురం గ్రామస్తులకు కేటాయించిన స్థలాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావుతో కలిసి పరిశీలించారు. కాలనీకి కావాల్సిన అన్ని సదుపాయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. గ్రామస్తుల కోరిన విధంగా కొత్త రోడ్డు సదుపాయం కల్పించడం జరుగుతుందని తెలిపారు. భూ నిర్వాసితులు గ్రామాన్ని, ఇంటిని నిర్మించుకునేందుకు గ్రామస్థులతో మాట్లాడి త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే చెప్పారు. కాలనీలో త్వరగా మంచి నీటి, రోడ్డు, డ్రైనేజీ వంటి సదుపాయలు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



## కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆల్ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఎఐటియుసి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని గోవిందాపురంలో ఎఐటియుసి అనుబంధ సభఘమైన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను మోదీ కాలరాయాలని చూస్తున్నారన్నారు. పెద్ద ఎత్తున తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికుల బలం చూపించాలని కోరారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా కార్మికులు అత్యధిక సంఖ్యలో సమ్మెకు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి జెట్టి ప్రసాద్,మండల అధ్యక్షులు ముడుసు పాపారావు,బొప్పన రాజు,మెండెం రాము,లక్ష్మల్ల నరేష్,దాసరి ధనమూర్తి,తెల్లమల్ల మధు,గంపల కొండలు, ఇట్టిమల్ల మట్టయ్య,తుమ్మకొమ్మ నాంజి,కామళ్ళ సుందర్ రావు,దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోదీ సర్కార్

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస రావు



**ప్రజాపక్షం/కోదాడ:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందనీ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస రావు అన్నారు. మంగళ వారం కోదాడలో సిపిఐ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. స్వతంత్రానికి పూర్వమే సాధించుకున్న కార్మిక హక్కులను హరించే ప్రయత్నంలో భాగమే అన్నారు. దేశ జనాభాలో సగానికి పైగా కార్మిక వర్గం ఉన్నదని ఆ కార్మిక వర్గానికి చేయాల్సింది చేయకపోగా ఉన్న హక్కులను తీసివేస్తూ కార్పోరేట్ పెట్టుబడిదారీ శక్తులకు కొమ్ముకాస్తున్న నరేంద్ర మోడీ అని ఆయన దుయ్యబట్టారు. జులై 9న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం కదం తొక్కుతుందని ఆ గాలిలో నరేంద్ర మోడీ కొట్టుకొని పోవడం ఖాయంఅన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ లతీఫ్ ఏఐటీయూసీ నాయకులు కే అచ్చయ్య రామారావు కాంతారావు ఎస్ కే జానీ టమటం వెంకట్రెడ్డి సైదులు పాషా పాల్గొన్నారు.

## రూ. 25 లక్షల విలువగల 112 మొబైల్ ఫోన్లను రికవరీ

..బాధితులకు అందజేత



**ప్రజాపక్షం/ సూర్యాపేట:** గత కొన్ని రోజుల నుండి వివిధ రూపాల్లో పోగొట్టుకున్న వారి కి సంబంధించి దాదాపు రూ.25 విలువ గల 112 మొబైల్స్ ను పోలీసులు గుర్తించి రికవరీ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పి కార్యాలయంలో జిల్లా ఎస్పి నరసింహ ఆదేశాల మేరకు రూరల్ సిఐ రాజశేఖర్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యావసరమైనద నీ అన్నారు. దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్లైన్ విద్య కోసం వినియోగిస్తున్నారు. మొబైల్ ఫోన్ లో విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్ లో నిక్షిప్తం చేసుకుంటున్నామని మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుందని చెప్పారు. వినియోగదారులు మొబైల్ ఫోను జాగ్రత్తగా ఉండాలి అని సూచించారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే పోర్టల్ నందు నమోదు చేసుకోవాలి, మొబైల్ ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా ధరఖాస్తు సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇవ్వాలన్నారు. మొబైల్ రికవరీ మేళా నందు హాజరైన బాధితులకు సైబర్ మోసాలు వాటి నుండి జాగ్రత్తలు మొదలగు అంశాల గురించి సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రస్తుతం మొబైల్ ద్వారా అన్ని బ్యాంక్ లావాదేవీలు జరుగుతున్నాయని, ఎవరైనా అపరిచితులు మొబైల్ ఫోన్ కు పంపించే బ్లూ లింకులను అనుసరించవ దన్నారు. వ్యక్తిగత వివరాలు ఎవరైనా అడిగితే వారికి బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలు చెప్పవద్దని వివరించారు.

## అమరుల ఆశయాలు సాధించాలి...

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** అమరుల ఆశయాలను సాధించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని అమరవరంలో సిపిఐ మండల కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు తల్లి మరకతమ్మ మృతి చెందారు. ఆమె మృతదేహంపై సిపిఐ జెండాను కప్పి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు,రైతు కూలీల పక్షాన క్షేత్ర స్థాయిలో పోరాడింది కమ్యూనిస్టులేనన్నారు. ఆనాటి కమ్యూనిస్టు నాయకుల ఆశయాలను,సిద్దాంతాలను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ,హుజూర్‌నగర్ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,పగిడి సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు,సుందరయ్య పాల్గొన్నారు.



# సూర్యాపేట మున్సిపాలిటీలో 'ఇంటి' దొంగలు!

**జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సూర్యాపేట మున్సిపాలిటిలో ఇంటి దొంగలు ఎక్కు వయ్యారు. పాలకవర్గం లేకపోవడంతో కొందరు ఉద్యోగులు తాము ఆడిందే ఆట, పాడిందే పాటగా వ్యవహరిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండిపెడుతున్నారు. ఏకంగా బిల్లు వసూళ్లు చేసే రసీదు పుస్తకాన్నే మాయం చేశారు. ఇటీవల నిర్వహించిన ఆడిట్‌లో రసీదు పుస్తకం పోయిన విషయం బయటపడింది. దీనిపై స్పందించిన నాటి మున్సిపల్ కమిషనర్ ఈ విషయం మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. గత నెల 19వ తేదీన పట్టణ పోలీస్ స్టేషన్‌లో రసీదు పుస్తకం మాయంపై ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యం.**

పన్ను వసూళ్ల రసీదు పుస్తకం మాయం

అడిట్ చేస్తుండగా బయటపడ్డ వైనం

పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం శూన్యం



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** సూర్యాపేట మున్సిపాలిటిలో 2024/25 నల్లా బిల్లుల వసూళ్ల కోసం బిల్ కలెక్టర్‌కు ఇచ్చిన రసీదు పుస్తకం మాయమైంది. అధికారులు నల్లా బిల్లు వసూళ్లకు పుస్తకం 267 సీరియల్ నెంబర్ ఉన్న దానిని కేటాయించారు. దీనిని సంబంధిత బిల్ కలెక్టర్ చౌడం సురేష్‌కు అధికారులు ఇవ్వడం జరిగింది. ఈ రసీదు పుస్తకానికి సంబంధించి సదరు బిల్లు కలెక్టర్ 33 రసీదుల ద్వారా నల్లా బిల్లు వసూలు చేసి ఆ సొమ్మును మున్సిపల్ కార్యాలయంలో జమచేశారు. అనంతరం అనారోగ్య కారణాలతో ఆయన సెలవు పెట్టడంతో పై అధికారులు కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్, మరో బిల్లు కలెక్టర్ సైదులు ను జంట చేసి సెలవులో ఉన్న చౌడం సురేష్ ఇంటికి పోయి రసీదు పుస్తకం, హ్యాండ్ హెల్డర్ మిషన్ తీసుకుని రావాలని అదేశించడంతో వాటిని తీసుకవచ్చినట్లు సమాచారం. నల్లా బిల్స్ వసూళ్ల కౌంటర్‌లో వాటిని భద్రపరిచి తిరిగి మూడు రోజుల తర్వాత సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్ తీసుకపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత రసీదు పుస్తకం కనిపించకుండా పోయిందని, ఇటీవల ఆడిట్ చేస్తుండగా 267 రసీదు పుస్తకం లేదనే విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో నాటి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు బిల్ కలెక్టర్ చౌడం సురేష్‌కు మెమో జారీ చేశారు. దీనికి ఆయన కమిషనర్‌కు లిఖితపూర్వకంగా వివరణ ఇస్తూ తాను అనారోగ్యంతో విధులకు హాజరుకాకుండా సెలవులో ఇంటి వద్ద ఉండటంతో తన ఇంటికి సీనియర్ అసిస్టెంట్ బూర సతీష్ వచ్చి పై అధికారులు రసదు పుస్తకం, హెల్డర్ మిషన్ తీసుకరమ్మని పంపారంటూ అందులో పేర్కొన్నారు. ఆ రోజే అతడికి ఇవ్వడం జరిగిందని, తిరిగి ఆ పుస్తకాన్ని రెవిన్యూ ఆఫీసర్ కళ్యాణికి అందజేయడం జరిగిందని, ఆ సమయంలో తన స్నేహితుడు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుడు చిన్నరాజు కూడా ఉన్నట్లు అందులో పేర్కొన్నాడు. అనంతరం నాటి కమిషనర్ శ్రీనివాసులు రెవిన్యూ ఆఫీసర్ కళ్యాణికి కూడా మెమో జారీ చేయగా ఆమె కూడా లిఖితపూర్వకంగా కమిషనర్‌కు తిరిగి వివరణ ఇవ్వడం జరిగింది. అసలు నల్లా బకాయిల వసూళ్ల రసీదు పుస్తకం తనకు ఇవ్వలేదని, నల్లా బిలుల్ల వసూలుకు తనకు ఎలాంటి సంబంధం లేదని తనకు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ అందులో పేర్కొన్నట్లు తెలిసింది. మని వాల్యూ బుక్ చాల విలువైనందున ముగ్గిరిపై మెమోలు జారీ చేసి, వారి వివరణల ఆధారంగా సూర్యాపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రయోజనం శూన్యం**

నల్లా బిల్లుల వసూళ్ల రసీదు పుస్తకం కనిపించకపోవడంతో గత నెల 19వ తేదీన సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నాడు విధుల్లో ఉన్న కమిషనర్ శ్రీనివాసులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. నేటికి పోలీసులు ఈ విషయాన్ని ఎటూ తేల్చకుండా తాత్సారం చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదుకు కనీసం రసీదు కూడా తిరిగి తమకు ఇవ్వలేదని వాపోతున్నారు. ఇదే విషయం తాము పోలీసులను అనేకమార్లుఅడిగిన రేపూమాపూ అంటూ ఇస్తామంటూ కాలం వెళ్లదీస్తున్నారని చెప్పకనే చెబుతున్నారు. కనపడకుండా పోయిన 267 నెంబర్ గల రసీదు పుస్తకంలో రాయనవి రసీదులు 67 ఉన్నాయని, అవి దేనికైన ఉపయోగిస్తే మున్సిపాలిటికి లక్షల్లో నష్టం వాటిల్లే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పోలీస్ అధికారులు వెంటనే స్పందించి రసీదు పుస్తకాన్ని మాయం చేసిన అసలు దొంగలను కనిపెట్టాలని కోరుతున్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి జరిమానా విధించడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ పిసిపి ఎన్డిటి చట్టము సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల 1994 పీసీ&సీఎన్‌డిటి అమల్లోకి వచ్చింది అన్నారు. జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ కేంద్రాలు విధిగా నిర్దేశించిన రూల్స్ ప్రకారము నిర్వహించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమించినట్లయితే స్కానింగ్ సెంటర్ల యొక్క రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. చట్ట ప్రకారం డాక్టర్లు సిబ్బంది, నిర్వాహకులు ప్రత్యక్షంగా, కానీ పరోక్షంగా కాని చేసిన మొదటి తప్పుకు రూ.10 వేలు జరిమానా, మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రెండవ సారి తిరిగి తప్పు చేస్తే ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధించబడుతుంది. లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం నిబంధనలు ఉల్లంఘించిన స్కానింగ్ సెంటర్ల పై తీసుకోనున్న చర్యలపై, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 8074261809 గల గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్స్‌డే సందర్భంగా కేక్ కట్ చేస్తూ డాక్టర్స్ అందరికీ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ డిసిపి లక్ష్మి నారాయణ, జిల్లా వైద్య అధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## సాధ్యమైనంత త్వరగా నెల్లికల్ ఎత్తిపోతల పథకం పనులు

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నెల్లికల్ ఎత్తిపోతల పథకం పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రాజక్ట్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆమె తిరుమలగిరి సాగర్ మండలం, నెల్లికల్ లో నిర్మిస్తున్న నెల్లికల్ ఎత్తిపోతల పథకం పంపు హౌస్, పైప్ లైన్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. వర్షం వల్ల పనులు ఆగిపోకుండా ముందే పూర్తి చేసే విధంగా ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు, ప్రాజెక్టు ఏజెన్సీ చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని పనులు పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రెషర్ మెయిన్ కు సంబంధించి భూసేకరణ అవార్డు పాస్ చేయడమే కాకుండా, చెల్లింపులు సైతం చేయడం జరుగుతున్నదని, ఈ పని సైతం త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రావిటీ మెయిన్‌కు సంబంధించి సర్వేను వేగవంతం చేయాలన్నారు.కాగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు జలాల ఆధారంగా తిరుమలగిరి సాగర్ మండలం లోని గ్రామాలు, మరికొన్ని గ్రామాలు కలిపి మొత్తం 11 గ్రామాలలో ని 24624 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించి చేపట్టిన నెల్లికల్ ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా నడుస్తున్నాయి. ఈ పనుల్లో భాగంగా పంప్ హౌస్, పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. గ్రావిటీ మెయిన్ సర్వే పనులు నడుస్తుండగా, ప్రెస్సర్ మెయిన్ కు సంబంధించి భూసేకరణ పూర్తయింది. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ప్రాజెక్టు డిప్యూటీ ఇంజనీర్ సీతారాం, అసిస్టెంట్ ఇంజనీరు రవి, పెద్దఊర తహసిల్దార్ శ్రీనివాస్, ఏజెన్సీ ప్రతినిధులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## విద్యాభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలి

జిల్లా కలెక్టర్ సంతోష్



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** నీతి ఆయోగ్ ర్యాంకింగ్‌లో దేశవ్యాప్తంగా టాప్ 5 లో స్థానం దక్కించుకున్న గట్టు బ్లాక్‌లో కృషి చేసిన అధికారులను అభినందిస్తూ, భవిష్యత్తులో అగ్రస్థాన లక్ష్యంగా పెట్టుకని మరింత ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ విడుదల చేసిన 2024/25 క్యు4 డెల్టా ర్యాంకింగ్‌లో గట్టు బ్లాక్ దేశంలో 5వ స్థానం జోన్ 3 లో 2వ స్థానాన్ని సాధించిందని తెలిపారు. ఈ విజయానికి గుర్తింపుగా గట్టు బ్లాక్‌కు నితి ఆయోగ్ నుంచి రూ.1 కోటి పురస్కారం దక్కిందని తెలిపారు.ఈ విజయం సాధించినందుకు గట్టు మండలంలోని అధికారులు, విభాగాధిపతులు, ఫ్రంట్ లైన్ సిబ్బందిని అభినందిస్తూ, భవిష్యత్తులో 100% కెపిఐ లక్ష్య సాధన కోసం ఇదే అంకితభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఆరోగ్య శాఖకు సహకరిస్తున్న ఎస్‌బిఐ సంజీవని, భవిష్య భారత్, టీచర్ for చేంజ్, MV foundation వారిని అభినందించారు.ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి వంటి ఐదు కీలక రంగాలలో ఉన్న 39 పనితీరు సూచికలను సమర్థంగా నిర్వహిస్తూ, భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రస్తుతం గట్టు బ్లాక్ కంపోజిట్ స్కోర్ 69.43 గా ఉండగా, దీన్ని మరింత మెరుగుపరచి 100% లక్ష్య సాధనవైపు ముందుకు సాగేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, డిపిఓ నాగేంద్రం,జిల్లా వైద్య అధికారి సిద్ధప్ప, జిల్లా సంక్షేమ అధికారి సునంద, ఎంపిడిఓ చెన్నయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ సంధ్య రాణి, ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ అఫ్జల్ పాల్గొన్నారు.

## దరఖాస్తు ఇస్తే పూర్తి విచారణ చర్యలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గడచిన రెండున్నర నెలల్లో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ 1500 కేసులను పరిశీలించి ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ తెలిపారు. మంగళవారం అయన జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు వచ్చిన ఫిర్యాదులను మానవ హక్కుల కమిషన్ వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ 2025 ఏప్రిల్ 17 న చార్జి తీసుకున్నదని, తనతో పాటు, మరో ఇద్దరు సభ్యులు కమిషన్లో ఉన్నారని, రాష్ట్రంలో ఎక్కడైనా మానవ హక్కులు ఉల్లంఘన జరిగినప్పుడు ఆన్‌లైన్ ద్వారా లేదా రాతపూర్వకంగా దరఖాస్తు ఇస్తే వాటిని పరిశీలించి వాటిపై పూర్తి విచారణ చేసిన తర్వాత చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విచారణ అనంతరం అవసరమైతే ప్రభుత్వానికి సిఫారసు చేయడం జరుగుతుందని తెలిపారు. కమిషన్ ఛార్జ్ తీసుకున్న సమయంలో 11,500 కేసులు పెండింగ్ లో ఉన్నాయని, గడచిన రెండున్నర నెలల కాలంలో 1500 కేసులను పరిశీలించి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పా రు. మానవ హక్కుల పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మానవ హక్కు ల కమిషన్ చర్యలు తీసుకుంటుందని, ప్రతి ఒక్కరికి మంచి విద్య, వైద్యం, సమానత్వం అందాల్సిన బాధ్యత రాజ్యాంగ ప్రకారం ఉందని ఆయన తెలిపారు.



## చిట్టీల పేరుతో మోసం నలుగురు అరెస్ట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడలో చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ సీఐ సోమనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సైదిరెడ్డి, కటికం వెంకట్ రెడ్డి, ముత్తిరెడ్డికుంటకు చెందిన మామిళ్ల వెంకన్న, రాంనగర్‌కు చెందిన గుణగంటి జానయ్యలు గత కొంతకాలంగా చిట్టీల పేరుతో పలువురి నుంచి డబ్బులు వసూలు చేస్తూ మోసం చేశారు. ఇంట్రెస్ట్ ఎక్కువగా ఇస్తామని ఆశ చూపి, 42 మంది బాధితుల నుంచి సుమారు రూ.1.50కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని బాధితులు కోరగా ఇవ్వకపోడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో తమను నిందితులు తమకు బెదిరింపులకు పాల్పడ్డారని అన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుల నుంచి 46 చిట్టీ పుస్తకాలు, 50 ప్రామిసరి నోట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఐలు రాంబాబు, హర్షవర్ధన్‌రెడ్డిలు ఉన్నారు.


## ప్రతి అర్జీని తప్పక పరిశీలించాలి

అర్జీల పరిశీలన ప్రక్రియను ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/(నాగారం) తుంగతుర్తి:** భూభారతిలో రైతులు పెట్టుకున్న ప్రతి అర్జీని తప్పక పరిశీలించాలని రైతులు రెవెన్యూ అధికారులకు పూర్తిగా సహకరించాలని తమ వద్ద ఉన్న ఆధారాలను దసరాలను అధికారులకు చూపించి వెంటనే సమస్యను పరిష్కరించుకునే విధంగా తోడ్పడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ తెలిపారు.మంగళవారం నాగారం మండలం లక్ష్మాపురం గ్రామం లో రెవెన్యూ అధికారులు జరుగుతున్న దరఖాస్తుల పరిశీలనను ఆకస్మికంగా సందర్శించి రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఆర్జీ పరిశీలన ప్రక్రియను రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న రెవెన్యూ రికార్డులను స్వయంగా పరిశీలించారు. లక్ష్మాపురం గ్రామంలోని రైతు పొదిల ప్రవీణ్ కుమార్ భూభారతి కార్యక్రమంలో భాగంగా జరిగిన రెవెన్యూ సదస్సులో చేసిన దరఖాస్తును పరిశీలనకు వచ్చిన నాగారం మండలం రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో దరఖాస్తులను పరిశీలించి దానికి సంబంధించిన భూ వివరాలు దస్తావేజులను పరిశీలించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 63 లో1:18 గుంటల భూమి పాసుపుస్తకంలో నమోదు కాలేదని దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలనకు అధికారులు వచ్చినందుకు రైతు సంతోషం వ్యక్తం చేశారు. తహసీల్దార్ హరి కిషోర్ శర్మ డిప్యూటీ తాసిల్దార్ షఫీ మహమ్మద్ సర్వేయర్లు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గుండాల మండల సిపిఐ కార్యదర్శిగా రామచంద్రయ్య



**ప్రజాపక్షం/గుండాల:** గుండాల సిపిఐ మండల 13వ మహాసభలు సోమవారం మండల కేంద్రంలోని వాసవి గార్డెన్‌లో జరిగాయి. ఈ మహాసభలో సిపిఐ గుండాల మండల కార్యదర్శిగా మూడవ సారి అనంతుల రామచంద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శిగా ఎన్నికైన అనంతుల రామచంద్రయ్య మాట్లాడుతూ మండలంలోని ప్రజా, రైతాంగా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకాలు పేద ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అనంతుల రామచంద్రయ్యను గ్రామ కార్య దర్శులు, కార్యవర్గ సభ్యులు ఘనంగా శాలువాలతో సన్మానించారు.

## పాశ మైలారం రసాయన పరిశ్రమ ప్రమాదంపై ఎమ్మెల్యే మట్టా దంపతుల దిగ్భ్రాంతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఓ రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదం పై మట్టా దంపతులు దిగ్భ్రాంతి చెందారు. రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకి ఎమ్మెల్యే మట్టా దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు మాట్లాడుతూ కష్టపడే కార్మికులు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం మమ్మల్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, తీవ్రగాయాలపాలైన క్షతగాత్రులకు ప్రభుత్వ మెరుగైన వైద్య చికిత్స అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద ఘటనపై స్పందించి రూ.కోటి నష్టపరిహారం అందజేసిందన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను పంపిణీ చేశారు. మంగళవారం రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ తాతా రఘురాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లను అందిస్తుందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఈ పథకం క్రింద ఐదు లక్షల రూపాయలను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనురాధ, మాజీ సర్పంచ్ లు , ఇందిరమ్మ కమిటీ సభ్యులు ,పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెంలో గల రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. దీనికి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.సరిత హాజరై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జె. ఉమానాగేష్, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతు అనుమల రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి: అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ బోనకల్:**ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ పేర్కొన్నారు. మంగళవారం జానకీపురం జెడ్పీఎస్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేసి ఉత్తీర్ణతాశాతం పెంచాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, పరిసరాలను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఈఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ దామాల పుల్లయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశవర్కర్ల సమ్మె నోటీసు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవి,పాలెం పిహెచ్‌సీ వైద్యునికి ఆశ వర్కర్లు సమ్మె నోటీసును సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయకార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌రావు మాట్లాడారు...జులై 9న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులకు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్లు జ్యోతి, సుభద్ర, భాగ్యమ్మ, నాగమణి, పుష్ప, నీలిమ, సుజాత, తిరపమ్మ, శ్రీవిద్య, ఉమాశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కంది విత్తనాలు పంపిణీ

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** జాతీయ ఆహార భద్రత పథకం, పప్పు ధాన్యాల పథకం క్రింద రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. మంగళవారం రఘునాథపాలెం రైతు వేదిక నందు జరిగిన కార్యక్రమంలో కంది రకం ఎల్ఆర్‌జి 52 రకం కంది విత్తనాలను రైతులకు ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఏ మాట్లాడుతూ ఎల్ఆర్‌జి 52 కంది రకం సాధారణ రకాల కన్న 20 రోజులు ముందుగానే పంట త్వరగా వస్తుందన్నారు. దిగుబడి ఎకరానికి ఆరు నుంచి ఎనిమిది క్వింటాళ్లు వస్తుందని చీడ పీడలను ఇతరత్రా వాటిని సమర్థవంతంగా తట్టు కుంటుందన్నారు. రైతులు ఇట్టి కంది రకాన్ని సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, రైతు శిక్షణ వ్యవసాయ అధికారులు భాస్కర్‌రావు, శరత్,ఎఇఒలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/పినపాక:**మండల కేంద్రంలోని ఏడూళ్ళ బయ్యారం విత్తనాల, ఎరువుల దుకాణాలను పోలీస్‌లు తనిఖీ చేశారు. రైతులు సాగు పనులు ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు నకిలీ విత్తనాలను నివారించేందుకు గాను ఫెర్టిలైజర్ షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా షాప్ లైసెన్సులు, షాపులో నిర్వహించే స్టాక్ రిజిస్టర్, ఇతర రికార్డులను, విత్తనాల ప్యాకెట్లను, ఎరువులకు సంబంధించి రిజిస్టర్లను, పెస్టిసైడ్స్ వివరాలను, గోడౌన్ లైసెన్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు అమ్మిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాల విక్రయంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్‌లకు సమాచారం అందివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, సీఐ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈదురు గాలులతో భారీ వర్షం

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



**ప్రజాపక్షం/ఏన్కూరు:**మండలంలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలతో పాటు చెట్లు నేల కొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ప్రధాన సెంటర్ లో చెట్టు కూలి రోడ్డుపై పడింది. గురుకుల పాఠశాలలో చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యార్థులు భయాందోళన గురయ్యారు. ఈదురుగాలతో కురిసిన భారీ వర్షానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ శాఖ ఎఇ ఉమాకాంత్ ఆధ్వర్యంలో అర్ధరాత్రిలో తాత్కాలిక విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టారు. రాత్రి కురిసిన వర్షం పత్తి పంటకు ప్రాణం పోసినట్లు అయ్యింది. దీంతో రైతన్నలు ఎరువులు, పాట్లు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. వరదలకు రోడ్లన్నీ జలమయమై వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

# చినుకు పడితే చిత్తడే... 'పడకేసిన'పారిశుద్ధ్యం!

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:**మండల కేంద్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్నటువంటి వర్షాల కారణంగా మండలంలోని ప్రధాన రహదారిపై, అదే విధంగా పలు గ్రామాలలో రోడ్లు చిత్తడి వానలతో బురద మయంగా మారాయి. మరీ ముఖ్యంగా అన్నపురెడ్డిపల్లి ప్రధాన రహదారి వెంట రోడ్డు విస్తరణ పనులు సజావుగా సాగకుండా మధ్యలో ఆగిపోవడంతో అటు వ్యాపారస్తులు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నాలుగు గురుకుల పాఠశాల కళాశాలలు, రెండు వసతి గృహాలు, మూడు ప్రభుత్వ పాఠశాలలు వీటిలో సుమారు 2500 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుండి వస్తూ ఈ మండలంలో విద్యను అభ్యసిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మండల కేంద్రానికి ప్రజల రాకపోకలతో రద్దీ పెరిగింది. ఇదిలా ఉండగా మండల ప్రధాన కేంద్రంలో సైడ్ డ్రైనేజీలు లేకపోవడం వలన వర్షపు నీరు వరద మొత్తం రోడ్డుపై ప్రవహించడం జరుగుతుంది.





దీని వలన రోడ్డుపై బురద ఇసుక పేరు కొనిపోయి వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు కూడా రోడ్డుపై వరద ప్రవాహించడం వలన ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పంచాయతీలకు నిధుల కొరత ఉండటంతో కార్మికులు విధులకు రాకపోవడం వలన, గ్రామాల్లో ఎక్కడ చెత్త అక్కడే ఉండి నేను ఇక్కడే ఉండి కుళ్ళిపోతానంటూ పారిశుద్ధ్యం పడకేసినట్లైయింది. ముసురుతున్న వర్షాలతో అటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. తక్షణమే ఇటువంటి పరిస్థితులను ముందస్తుగా అంచనా వేసి ఉన్నతాధికారులు సమీక్షించి మండల ప్రధాన కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకి ఇరువైపుల డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని, వెంటనే పారిశుద్ధ్యం పనులు చేయించి, బ్లీచింగ్ క్లోరినేషన్ వంటి ముందస్తు చర్యలను చేపట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా 4వ మహాసభ

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:**అఖిల భారత విద్యార్థి సమైక్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని సోమవారం నాడు. విద్యార్థులతో కలిసి కరపత్రాలు ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా ఆవిష్కరించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ, దేశ స్వతంత్రం కోసం అనంతరం విద్యారంగ సమస్యల కోసం నూతన శాస్త్రీయ విద్య విధానం కోసం, చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో అలుపెరుగని పోరాటాలు చేస్తూ వచ్చిన సంఘం ఎఐఎస్ఎఫ్ అని, 1936 నుండి దేశ స్వతంత్రం కోసం చురుకైన పాత్ర వహించి స్వతంత్రం అనంతరం ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కలిగినటువంటి చదువును కల్పించాలని ఉద్యమాలు నిర్మించిన సంఘం ఏఐఎస్ఎఫ్ సంఘం అని వారు అన్నారు. మూడవ తేది న పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్ నందు నిర్వహించుకుంటున్న అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.అన్ని మండలాల నుండి విద్యార్థులు స్వచ్ఛందంగా తరలి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అజిత్, కొత్తగూడం పట్టణ కార్యదర్శి రణధీర్, కమల్, శివ, విజయ్ కాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం :** ప్రగల్లపల్లి వద్ద ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి దుమ్ముగూడెం మండలాన్ని సస్యశ్యామలం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గంగోలు వివిఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సిపిఐ 20వ మండల మహాసభలో ముఖ్య అతిథిగా ఎస్‌కె సాబీర్ పాషా పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా పార్టీ జెండాను మండల కార్యదర్శి రావులపల్లి రవికుమార్ ఆవిష్కరించారు. అనంతరం కిలిమి ఎల్లారెడ్డి, పాయం యర్రయ్య అధ్యక్షతన జరిగిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ దుమ్ముగూడెం వద్ద నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ ప్రాజెక్టుతో ఈ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని సారవంతమైన నేలను కోల్పోతున్నారన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి సైతం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రగల్లపల్లి వద్ద ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు సాగునీటిని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా మాత్రమే ఈ ప్రాంత రైతాంగానికి సరైన న్యాయం జరుగుతుందన్నారు. వందలాది బీడు భూములు ఈ పథకం ద్వారా సాగులోకి వస్తాయన్నారు. భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలన్నారు. పోడు సాగుదారులకు సిపిఐ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. కనీస వసతులైన విద్య, వైద్యం, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు సిపిఐ చేసిన పోరాట ఫలితంగానే ఈ ప్రాంతంలో వసతులు సమకూరాయన్నారు. స్వామినాథన్ సిఫారసు మేరకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోల్లోజు అయోధ్య మాట్లాడుతూ పోడు సాగుదారులకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. రైతులకు అన్యాయం చేస్తే సిపిఐ పక్షాన పోరాడతామన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇల్లందు డిఎస్‌పి ఎన్ చంద్రబాను అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఒఎస్డి నరేందర్ సూచనలతో ఇల్లందు డిఎస్‌పి ఎన్ చంద్రబాను, సిఐ టి సురేష్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈదుల, కిచ్చనపల్లి గ్రామాలలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్‌పి చంద్రబాను అక్కడి ప్రజలతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. అలాగే తెలియని వ్యక్తులు తమ తమ గ్రామాలలోకి ప్రవేశిస్తే వారికి ఆశ్రయం కల్పించొద్దని తెలిపారు. ఇటీవల వరుస ఎదురు కాల్పులు, అరెస్టుల వలన అసాంఘీక శక్తులు తమ రక్షణ కోసం చత్తీష్‌ఘడ్ ప్రాంతానికి దగ్గరగా ఉన్న తెలంగాణలోని సరిహద్దు గ్రామాల్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నందున గుర్తు తెలియని వ్యక్తులు, మావోయిస్టు సానుభూతి పరులు మీ గ్రామానికి మీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు కనిపిస్తే స్థానిక పోలీసులకు లేదా 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, అట్టి సమాచారం తెలిపిన వారికి తగిన నగదు పారితోషకం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని వారికి దూరంగా ఉండాలని తెలిపారు. వర్షాకాలంలో కరెంటు సమస్యలు ఏర్పడి పిల్లల చదువులకు ఇబ్బంది కలుగుతుందని ఉద్దేశంతో ఈదుల్ల గ్రామంలో 10 కుటుంబాలకు కిచ్చనపల్లి గ్రామంలో 43 కుటుంబాలకి సోలార్ విద్యుత్ దీపాలని అందజేశారు. ఈకార్యక్రమంలో సిఐ టి సురేష్, ఆళ్లపల్లి ఎస్ఐ ఎం సోమేశ్వర్, టిజిఎస్‌పి సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులు చైతన్యంతో పోరాడాలి

వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/కొణిజర్ల:**వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం చైతన్యంతో సమరశీల పోరాటాలు నిర్వహించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం తుమ్మలపల్లి గ్రామంలో పిట్టల రాంబాబు, బొడ్డుపల్లి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కొణిజర్ల మండల వ్యవసాయకార్మికసంఘం మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. భూమికోసం, భుక్తికోసం అనేక పోరాటల ద్వారా సాధించుకున్న భూములు తప్ప ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులకు భూపంపిణీ జరపలేదని అన్నారు. వ్యవసాయకార్మికులకు శాశ్వత రక్షణ సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టం తేవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కొణిజర్లలో జులై 4వ తారీకు నిర్వహించే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 26వ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు , రైతుసం ఘం జిల్లా ఉపాధ్యక్షుడు , మండల కార్యదర్శి, సిపిఐ జిల్లా నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు సమాయత్తం



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:**కొత్తగూడెంలోని స్థానిక శేషగిరి భవన్ నందు సోమవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, సత్తనపల్లి విజలక్ష్మి మాట్లాడుతూ, జులై తొమ్మిదో తేదీన దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయడానికి కార్మిక సంఘాలుఫెడరేషన్లు ,అసోసియేషన్లు రాష్ట్ర సమావేశం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించాయన్నారు. జులై 9న సమ్మె విజయవంతానికి శాయశక్తుల కృషిచేసి రాష్ట్రంలో లక్షలాది కార్మిక ఉద్యోగులను సమ్మెకు సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో 11 సంవత్సరాలుగా ప్రభుత్వం కొలువుదీ రి కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితులు యుద్ధ వాతావరణ నేపథ్యంలో జాతీయ సార్వత్రిక సమ్మెను జూలై 9 న జరపడానికి కార్మిక సంఘాలు ఐక్య కార్యాచరణలు రూ పొందించయని చెప్పారు. 1980 సంవత్సరంలో కార్మికులను రాష్ట్రవ్యాప్తంగా అసంఘటితపరిచి సంఘాన్ని ఏర్పాటు చేసి అ నేక సమరశీల పోరాటాలుఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహి ంచామని చెప్పారు. కొత్త లేబర్ కోడ్లను ఉపసంహరించుకొని పనిప్రదేశంలో సమానత్వం ,భద్రతను క ల్పించాలని రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేసి పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరారు. 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం 26000 నిర్ణయించి అమలు చేయాలని అన్నారు. కార్మిక, కార్మికుల హ క్కులను చట్టబద్ధమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కో డ్లను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని చెప్పారు. ఈ కార్యక్రమంలోఎఐటియుసి నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి

మంచుకొండలో పాఠశాల, పిహెచ్‌సి కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మంగళవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రఘునాథపాలెం మండలంలో పర్యటించారు. మంచుకొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రభుత్వ ఆదేశానుగుణంగా నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని విద్యాధికారులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒపి రూమ్, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి తెలుగు చదవడం, ఇంగ్లీష్ మాట్లాడటం అనర్గళంగా వచ్చేలా చూడాలన్నారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేటట్లు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధవహించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించాలని ఇందుకు ప్రారంభం నుండే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శిశువుల ఎదుగుదల, మానిటరింగ్ నిరంతరం చేయాలని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ మహిళలకు 100 శాతం టీకాలు వేయించాలన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు కరుణకుమారి, వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇటుకల తయారీ ముసుగులో ఇసుక దందా..!

**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండలంలో ఇసుక దందాను కొందరు అక్రమార్కులు కొత్త కొత్త ఆలోచనలతో నూతన మార్గాలను అనుసరిస్తూ సాగిస్తున్నారు. మండలంలోని కంపగూడెం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ప్లైయాష్ బ్రిక్స్ తయారీ కేంద్రాల వద్ద ఇసుకను అక్రమంగా నిల్వ చేసి ఇష్టానుసారంగా లారీల తో ఇసుకను రవాణా సాగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సామాన్యులు ఇంటి నిర్మాణం కోసం ట్రాక్టర్ ద్వారా ట్రక్ట్ ఇసుకను తోలనియ్యని పోలీస్, రెవిన్యూ అధికారులు మాత్రం ఇటుకల తయారీ ముసుగులోఇసుకను రోడ్డు ప్రక్కన పోసి రవాణా చేస్తున్న పట్టించుకోకపోవడం గమనార్హం. ఇటుకల తయారీ ముసుగులో ఇసుక దందాకు పలువురు రెవిన్యూ, పోలీసు అధికారులు సహకరించడం మూలంగానే లారీల ద్వారా రవాణా సాగిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ఫ్లైయాష్ బ్రిక్స్ తయారీ కేంద్రాల ముసుగోలో ఇసుక దందాపై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## సిపిఐ వందేండ్ల ఉత్సాహంతో ప్రజా పోరాటాలు




విలేకరుల సమావేశంలో సిపిఐ మండల కమిటీ వెల్లడి


**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**వందేండ్ల సిపిఐ పార్టీ చరిత్రకు వన్నెతెచ్చేలా..నూతన ఒరవడితో ప్రజా పోరాటాలకు నాంది పలకబోతున్నట్లు సిపిఐ ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ ఉమ్మడి కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తెలిపారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల సిపిఐ నేత దండి రంగారావు నివాసంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల మహాసభలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. 100సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ సాధించిన హక్కులు, పోరాటాలు ఈ నాటి తరానికి తెలియజేస్తూ ఇంటింటా...వాడా వాడా ప్రచారం చేయబోతున్నట్లు వివరించారు. అలాగే పదివేల కుటుంబాలకు తక్కువ కాకుండా పార్టీ నిధికి విరాళాల సేకరణ చేసే దిశగా నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీ విస్తరణ కోసం ఖమ్మంరూరల్ మండలంలోని గ్రామాలు, ఏదులాపురంమున్సిపాలిటీలోని అన్ని డివిజన్లలో శాఖలు ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ ప్రాంతాలలో ప్రజా సమస్యలను గుర్తించి, తద్వారా ప్రజా సంబంధాలను విస్తృత పరుచుకొనునట్లు పేర్కొన్నారు. యువ నాయకత్వానికి బాధ్యతలు అప్పగించి అన్ని ప్రజా సంఘాలను నిర్మించడంతో పాటు వాటి ద్వారా బహుముఖ కార్యక్రమాలు చేపట్టి పార్టీ ఉద్యమాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మండల మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించి రైతులకు రూ.రెండు లక్షల మాఫీ, 2లక్షల పైబడి రైతులకు రెండు లక్ష మాఫీని వర్తింపు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలను గుర్తించి అర్హులందరికీ మంజూరు, ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలో పేదల ఇండ్లు, స్థలాల సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరిష్కరించాలని కోరారు. అలాగే ఖమ్మం రూరల్ మండలంలోని పేద ప్రజలకు ఇండ్లు, స్థలాలు మంజూరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న మైత్రి మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ ప్రయోజనాల అనుగుణంగా కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయకార్యదర్శులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, కళింగి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షుడిని కలిసిన రాజనాల శ్రీహరి



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : హైదరాబాదులోని గాంధీ భవన్‌లో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ని వరంగల్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజనాల శ్రీహరి కలిసారు. మహేష్ కుమార్ గౌడ్ ఈ నెల 4న జరిగే సభను విజయవంతంగా చేయవలసిందిగా రాజనాలకు సూచించారు. ఐదుగు బల హీన వర్గాల అందరూ తరలివస్తారని, వరంగల్ నుం చి జనాన్ని తరలించి విజయవంతం చేస్తానని రాజనాల పిసిసి అధ్యక్షుడికి హామీ ఇచ్చారు. పిసిసి అధ్యక్షుడితో పాటు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉన్నారు.

## బిటి-3 పత్తి విత్తనాలను నియంత్రించాలి



ప్రజాపక్షం/మరిపెడ:మరిపెడ మండలంలోని రబీ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమైన వేళ మండలంలోని అమాయక రైతులను ఆసరాగా చేసుకుని బిటి 3 పత్తి విత్తనాలను విచ్చలవిడిగా మండలంలోని గ్రామాల్లో విక్రయిస్తున్నారని వాటిని తక్షణమే నియంత్రించాలని వ్యవసాయాధికారులను సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. అలాగే అనుమతిలేని, రిస్ట్రిక్టెడ్ వేయని ఫెర్టిలైజర్స్ షాపులపై చర్యలు తీసుకోఆవలని, ప్రభుత్వం నిషేధించిన క్రిమిసంహారక రసాయన ఎరువులను అన్ని ఫెర్టిలైజర్ షాపుల్లో నిల్వ లేకుండా చూడాలని, రైతులకు ఎంఆర్పి ధరల కే మందులు అందించాలని పలు డిమాండ్లతో కూడి వినతిపత్రాన్ని మరిపెడ వ్యవసాయాధికారి వీరాసింగ్‌కు అందించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్,, యాకన్న,సత్యం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సభను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి



ప్రజాపక్షం/ఖిలా వరంగల్/వరంగల్ టౌన్ : : ఈనెల 4న గ్రామస్థాయి నేతలతో హైదరాబాద్‌లోని ఎల్బి స్టేడియంలో ఏర్పాటు చేయబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పిలుపునిచ్చారు. ఈ రోజు వరంగల్ తూర్పు నియోజకవర్గం ఓ సిటీ లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎ మ్మెల్సీ కొండా మురళి మాట్లాడుతూ, గ్రామస్థాయి, డివిజన్ స్థాయి కార్యకర్తలతో నేరుగా మాట్లాడాలని ఆలోచనతో నిర్వహించ తలపెట్టిన సభకు ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని, ఆ సభను విజయవంతం చేయాలని నాయకులకు మరియు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంటు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిలుగా నియమితులైన టిపిసిసి ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ , టిపిసిసి ప్రధాన కార్యదర్శులు దుద్దిళ్ల శ్రీనుబాబు, పల్లె శ్రీనివాస్ గౌడ్, మోత్కూరి ధర్మారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లు , కాంటెస్టెడ్ కార్పొరేటర్లు డివిజన్ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శభరీస్




ప్రజాపక్షం/హనుమకొండ : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా వైద్యవృత్తికి న్యాయం చేకూర్చడం జరుగుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శభరీస్ అన్నారు. బి ఎస్ రాయ్ వైద్యరంగంలో చేసిన సేవలు గుర్తుగా జులై 1న భారతదేశంలో డాక్టర్స్ డే నిర్వహించుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో డాక్టర్స్ డే పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజలను చేసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా వైద్య అధికారులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి పేదవాడికి వైద్యం అందాలని, ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, తాను కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయ్యానని, ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయ్యే విధంగా ప్రతి ఒక్క గర్భిణిని ప్రోత్సహించాలని కోరారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు వినియోగించుకోవాలని, ప్రతి వైద్యుడు అంకిత భావంతో ప్రజలకు మెరుగు మెరుగైన సేవలు అందించాలన్నారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో డాక్టర్ల సేవలు మరువలేనివని, అందరికీ జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసినారు.కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కె. రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బి.సి రాయ్ సేవలు మర్చిపో లేవని, ప్రతి పేదవానికి వైద్య సేవలు అందాలని, ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకొస్తునది తెలియజేశారు.జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా,సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిద్దామని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను వినియోగించే లా, నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ అప్పయ్య, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె రామ్ కుమార్ రెడ్డి, అడిషనల్ వైద్య అధికారిడాక్టర్ టి .మద మోహన్ రావు, జిల్లా ఇమ్యూనిజషన్ అధికారి డాక్టర్ మహేందర్, జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డాక్టర్ హిమబిందు, ప్రోగ్రామ్ అధికారి ఎంసిహెచ్ డాక్టర్ మంజుల,ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇన్ సిడి డాక్టర్ అహ్మద్‌ను జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, బస్తీ, పల్లె దవాఖాన వైద్యాధికారులు, ఆర్ బి ఎస్ కే వైద్యాధికారులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కోలా రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫాసిస్ట్ బిజెపి పాలనకు వ్యతిరేకంగా సిపిఐ ప్రజా పోరాటాలు

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: దేశంలో గత 11 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఫాసిస్ట్ బిజెపి పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసి ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. కురవి మండల కేంద్రంలో సిపిఐ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లడుతూ క్షేత్రస్తాయి నుండి జాతీయ స్థాయి వరకూ జరిగే మహాసభల్లో భాగంగా కురవి మండల కేంద్రంలో జరిగే మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభల జరుగుతున్నాయని, ఈ మహాసభలు పార్టీ వందేళ్ళు పూర్తి చేసుకున్న చారిత్రక నేపధ్యంలో కొనసాగడం, మరో పక్క కమ్యూనిస్టు భావజాలాన్ని తుడిచిపెటాలని, లౌకిక, ప్రజాస్వామ్యాలను తుదముట్టించి, నియంత పాలన తేవాలనే ప్రమాదకర ధోరణి అవలంబిస్తున్న బిజెపికి తగిన బుద్ధి చెప్పడానికి, ప్రజలను చైతన్యవంతం చేసి ప్రజా పోరాటాల దిశగా నిర్దేశం ఈ మహాసభలు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్య, బస్వకొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన వద్దు.. అందుబాటులో యూరియా : అనురాధ



ప్రజాపక్షం/నెక్కొండ:రైతులు యూరియా కోసం ఎలాంటి ఆందోళన చెందొద్దని అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకూడదని జిల్లాలో రైతులకు కావలసినంత యురియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ అన్నారు. ఆమె మంగళవారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని పిఎసిఎస్, ప్రైవేటు, ఎరువుల దుకాణాలను తనికి చేసిన సందర్భంగా అన్నారు. ఆమె మాట్లాడుతూ, రైతులు అధిక యూరియా వాడితే కొత్త కొత్త తెగుళ్లు వ్యాధులతో దిగుబడి తగ్గుతుందని తద్వారా రైతు నష్టపోతారని ఇది గమనించి రైతులు కావలసినంత మాత్రమే యూరియా వాడాలని ఆమె అన్నారు. రైతులు నానో యూరియా, డిఎపి, వాడితే అధిక దిగుబడి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, సానిటేషన్ న్యూట్రిషన్, ఎడ్యుకేషన్, హెల్త్ అంశాలపై ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ జిల్లాలోని డోర్నకల్, కురవి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. బలపాల పిహెచ్‌సిని తనికీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరుపట్టిక, మందుల స్టాక్ వివరాలను, పరిసరాలను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా మం దులు సిద్ధంగా ఉంచుకోవాలని, షెడ్యూలు ప్రకారం వైద్య క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వెన్నారం గ్రామంలోని అంగ్‌వాడీ కేంద్రంలో పిల్లలకు నాణ్యమైన న్యూట్రిషన్ ఫుడ్ అందించాలన్నారు. గ్రామస్థుల సహకారంతో వెన్నారం పిఎస్‌లో ఎన్‌రోల్‌మెంట్ పెంచడంలో గ్రామస్థుల భాగస్వామ్యాన్ని గమనించి గ్రామస్తులను కలెక్టర్ అభినందించారు. రెండు పాఠశాలల్లోని భౌతిక వనరులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి తగిన సూచనలిచ్చారు. కలెక్టర్ వెంట మహబూబాబాద్ విద్యాశాఖాధికారి డాక్టర్ ఏ.రవీందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఎల్కతుర్తిలో తెలంగాణ ఉద్యమకారుల శాంతి దీక్ష



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : తెలంగాణ ఉద్యమకారుల శాంతి దీక్ష చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎల్కతుర్తి మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఒక్కరోజు శాంతి దీక్ష చేయడం జరిగింది. ఈ శాంతి దీక్షలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి నిమ్మల మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం 2001 మొదలై 2014 వరకు కొనసాగి దాదాపు మలిదశ ఉద్యమంలో 1200 మంది ఆత్మబలిదానాలు చేసుకోవడం జరిగిందని, ఈ ఆత్మ బలిదానాల వల్లనే తెలంగాణ సాధించుకోవడం జరిగింది అన్నారు. తెలంగాణ వచ్చినాక నీళ్లు, నిధులు, నియామకాలు, విద్య, వైద్యం అని చెప్పి పది సంవత్సరాలు అధికారంలో ఉన్నటువంటి కెసిఆర్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు ఒరగ పెట్టింది ఏమీ లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి మేనిఫెస్టోలో 6గ్యారంటీలు అందులో ఆరో గ్యారెంటీ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇయ్యకపోవడం బాధాకరం అన్నారు. అదేవిధంగా 250 గజాల ఇంటి స్థలము, జార్ఖండ్ రాష్ట్ర తరహాలో ప్రతి ఉద్యమకారుడికి 25వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమకారుల కోసం పదివేల కోట్లతో ఒక బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమకారుల పిల్లలకు విద్యా వైద్యం ఉచితంగా ఇవ్వాలని, రైల్వే, బస్సు పాసులు ఇవ్వాలని, డిమాండ్ చేస్తున్నాము అన్నారు. ఈ న్యాయమైన డిమాండ్స్‌ను నెరవేర్చని యెడల రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారుల సత్తా చూపుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి సంఘీభావంగా బిఎస్‌పిఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వేల్పుల రాజు, బిఎస్‌పిఎస్ సీనియర్ నాయకులు ఎనగందుల శంకర్, బోయిని బాబు, సిపిఐ మండల కార్యదర్శి శనిగరపు రాజకుమార్, తెలంగాణ భూ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రఘు, బిఎస్‌పి సీనియర్ నాయకులు కామెర లక్ష్మ ణ్, ధర్మసమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి బొంకూరి రాజు, సిపిఐ నాయకులు తండ మొం దయ్య, గడ్డం సంజీవ్, రేణిగుంట్ల, సాంబయ్య, సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మర్రి శ్రీనివాస్, జూపాక శ్రీనివాస్, మేకల రాజయ్య ,మర్రి అమరేందర్, పుట్ట ప్రతాప్ ,వంగ రమేష్, ముద్ర కోళ్ల శాంతమ్మ, పోతర బోయిన వజ్రమ్మ, పోతర బోయిన విజ్జమ్మ, మేకల భాగ్యమ్మ, చది రాధమ్మ, చదిరం ఎల్లమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభం



ప్రజాపక్షం/కెయు క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలో 2025– 26 విద్యా సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సులలో అడ్మిషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమయ్యింది. ఈ ప్రక్రియ ఈనెల 5వ తేదీ వరకు కొనసాగుతుందని ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. ఇంజనీరింగ్ అడ్మిషన్స్ ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహించబడుతుందని అడ్మిషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు తమ తమ ఒరిజినల్ కుల ధ్రువీకరణ ఆధార్ కార్డు పత్రాలను అన్నింటిని వెంట తెచ్చుకోవాలని సూచించారు. కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కౌన్సిలింగ్లో కళాశాల వైస్ ప్రిన్సిపల్, అడ్మిషన్ డైరెక్టర్ డాక్టర్ అంజన్ రావు, రెహమాన్, సుధీర్, డాక్టర్ జితేందర్, డాక్టర్ చందర్ కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ధ్రువీకరణ పత్రాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి విద్యార్థికి అందజేశారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్




ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని జాతీయ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కొరిమి రాజ్ కుమార్, మిరియాల రాజిరెడ్డి, తుమ్మల రాజిరెడ్డి, చక్రపాణి, విశ్వనాధులు డిమాండ్ చేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఏఐటియుసి కొమురయ్య భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ, బ్రిటిష్ కాలం నుండి 44 కార్మిక చట్టాలను సాధించుకోవడం జరిగిందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కార్మిక 44 చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజించి కార్మిక హక్కులను కాల రాస్తున్నాయని మండిపడ్డారు. ఈ కోడ్ ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఈ ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మెతో కార్మిక శక్తి ఏంటో కేంద్ర ప్రభుత్వానికి తెలిసే విధంగా సింగరేణి సంస్థను పరిరక్షించే విధంగా జాతీయ సంఘాల జెఎసి దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మిక సంఘాలు ఉండకూడదని కుట్రతో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం లేబర్ చట్టాలను తెచ్చిందని, వాటిని తిప్పి కొట్టే విధంగా కార్మిక సంఘాల జెఎసి ఏర్పడిందన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభం చేసే ఈ నాలుగు కోడ్ ల అమలు వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని, భూపాలపల్లి ఏరియాలోని అన్ని సంఘాల నాయకులు కార్మికులు,కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జెఎసి నాయకులు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెఎసి సంఘాల నాయకులు మాతంగి రామ్ చందర్, నూకల చంద్రమౌళి, బడి తల సమ్మయ్య, కంపేటి రాజయ్య, గణేష్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.


## సమాజ హితం కోరే వారే వైద్యులు

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్




ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:సమాజ హితం కోరే వారే వైద్యులు, వారి గౌరవించడం ధర్మమైందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా మ ంగళవారం జనగామ ఐఎంఎ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వయించా రు. విజయ పంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సం దర్భంగా జరిగిన కార్యక్రమానికి ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ బాలాజీ అధ్యక్షత వహించగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో డాక్టర్లకు ప్రత్యేకత ఉందన్నారు. ప్రభుత్వం వైద్య రంగాన్ని అధిక ప్రాధాన్యత ఇస్తుందని, జనగామలో ఆపరేషన్ లేకుండా గర్భిణుకు వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ హాస్పటల్‌లోనే కాకుండా ప్రైవేవేట్ హాస్పటల్‌లో ఆపరేషన్ లేకుండా చికిత్స చేయడం వలన మహిళలు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ప్రధానమైన చికిత్సలకు సంబందింది ఐఎంఎ ఆధ్వర్యంలో కిట్స్ అందజేస్తే బా గుంటుందన్నారు. డాక్టర్స్ డే సందర్భంగాఈ రక్తదాన శిబిరం నిర్వయించడం, అత్యధిక మందితో రక్తదానం చేయించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్ రాజమౌళి డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కల్నల్ బిక్షపతి, పట్టణ పుర ప్రముఖులు కన్నా పరశురాములు, డాక్టర్ కనక రాజు, డాక్టర్ వెంకటాచలం, ప్రదీఫ్, సృజన్, స్వప్న రాథోడ్, డాక్టర్ రజినీ డాక్టర్ మౌనిక, డాక్టర్ అనూష, తదితరులు పాల్గొన్నారు.

## రాజేందర్‌కు రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్



ప్రజాపక్షం/కెయు క్యాంపస్ : తెలంగాణ మలిదశ ఉద్యమంలో కాకతీయ యూనివర్సిటీ నుండి కీలక భూమిక పోషించిన జట్టి రాజేందర్ కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. దూర విద్యా కేంద్రం మాజీ సంచాలకులు ఆచార్య చింతకాయల దినేష్ కుమార్ పర్యవేక్షణలో 'పొలిటికల్ ఎంపవర్మెంట్ ఆఫ్ ట్రైబల్ ఉమెన్: ఎ స్టడీ విత్ రిఫరెన్స్ టు పంచాయతీ రాజ్ ఇన్స్టిట్యూషన్ ఇన్ తెలంగాణ స్టేట్ ' అనే అంశంపై ఆయన సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఆయనకు పిహెచ్ డి అందించినట్టు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కట్ల రాజేందర్ తెలిపారు. హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం బైరాన్ పల్లి గ్రామానికి చెందిన జట్టి చంద్రకళ చేరాలుల పెద్ద కుమారుడు డాక్టర్ జట్టి రాజేందర్ ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి గా కొనసాగుతున్నారు. మలిదశ ఉద్యమం నుండి అనేక విద్యార్థి సమస్యలపై పోరాటం చేసి పలుమార్లు అరెస్ట్ అయ్యారు. పిహెచ్‌డి సాధించిన సందర్భంగా జట్టి రాజేందర్ ను యూనివర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, భారత రాష్ట్ర సమితి నాయకత్వం అభినందించింది.

## కళాశాలల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు

కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ఇంటర్మీడియట్ కళాశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనపై విద్యా, టిజిడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూనియర్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు కల్పనకు జిల్లాలోని 5 జూనియర్ కళాశాలలకు 41.07 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రతిపాదనలు అందచేయాలని ప్రిన్సిపాల్స్ ను ఆదేశించారు. ఈ నిధులతో సివిల్ మరమ్మతులు, ఎలక్ట్రికల్, మంచినీరు, పారిశుధ్య కార్యక్రమాలు వంటి సదుపాయాలపై ఫోకస్ చేయాలని, పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న, డిఇఓ రాజేందర్, టిజడబ్ల్యూఐడిసి డిఇ రామ కృష్ణ, ఎఇ మహేందర్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

## విపత్తుల్లో ప్రాణనష్టం జరగకుండా చర్యలు

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: విపత్తుల నేపథ్యంలో ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా సహాయక చర్యలు చేపట్టుటకు సిద్ధంగా ఉండాలని, గోదావరి నది, జంపన్నవాగు పరిసర ప్రాంతాల ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందం(ఎన్‌డిఆర్‌ఎఫ్)ను కోరారు. మంగళవారం జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందం (ఎన్‌డిఆర్‌ఎఫ్) జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్‌జితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని రామప్ప, లక్నవరం సరస్సులు, గోదావరి నది, జంపన్నవాగు నీటి ప్రవాహం గతంలో జరిగిన సంఘటనల గురించి(ఎన్‌డిఆర్‌ఎఫ్) బృందంకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ బెటాలియన్, విజయవాడ కమాండెంట్ ప్రసన్నకుమార్ ఆదేశాల ప్రకారం ఆర్ఆర్‌సి హైదరాబాద్ నుండి ఇన్‌స్పెక్టర్ ముకేష్ కుమార్ కమాండర్, ఎఎస్ఐ సుధీర్, హెడ్ కానిస్టేబుల్ జగదీష్‌తో 28 మంది ఒక టీం జులై, ఆగష్టు, సెప్టెంబర్, మూడు మాసాల వర్షాకాలం ముగిసే వరకు జిల్లాలో ఉంటుందని అన్నారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందనకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను సమకూర్చాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, కలెక్టరేట్ డి సెక్షన్ పర్యవేక్షకులు శివకుమార్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లి మరణించిన మనస్తాపంతో రైల్వే ట్రాక్‌పై కొడుకు ఆత్మహత్య



ప్రజాపక్షం / వేలేరు : తల్లిమరణించిందని మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో చోటు చేసుకుంది,గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలప్రకారం వేలేరు మండలంలోని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన రంగు అమరేందర్ జమున దంపతుల కుమారుడు రాహుల్(20)సంవత్సరాల వ్యక్తి తన తన తల్లి గత రెండు సంవత్సరాల క్రితం తనతల్లి అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పటినుండి మనోవేదనతో దిగులు చెంది జీవితంపై విరక్తిపుట్టి మంగళవారం కాజిపేట మండలం అయోధ్యపురం రైల్వే పట్టాలపై ఎదురుగా వస్తున్న ట్రైన్ క్రింద పడి మృతిచెందాడని తెలిపారు.

## ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : నేరాల నియంత్రణతో పాటు, నేరస్థులను పట్టుకోవడంలో పోలీస్ అధికారులు ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. జూన్ నెల సంబంధించి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండిరగ్‌లో వున్న కేసులను సమీక్ష జరపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకై అర్బన్, మున్సిపల్, గ్రామ స్థాయిల్లోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతి వి.పి.ఓ వద్ద, నేరాల నియంత్రణకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇక ఉదయం 6గంటల వరకు పెట్రొలింగ్ కొనసాగించాలని, అలాగే పెట్రోలింగ్ నిర్వహించే సిబ్బంది నిర్వహించాల్సిన విధులపై ముందుగానే స్టేషన్ అధికారులు తెలియజేప్పాల్సి వుంటుందని. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి అంశంపై పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిప్పుడు పోలీస్ అధికారులు సంబంధిత ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో రోడ్డు ప్రమాదాలకు గల కారణలపై క్షేత్ర స్థాయిలో సమీక్ష జరపాలని సిపి తెలిపారు. యువతను రక్షించుకోవడంలో భాగంగా డ్రగ్స్ అలవాటు పడి పోలీసులకు చిక్కిన యువతను పునరావస కేంద్రాలకు తరలించి చికిత్స అందించేందుకు కార్యచరణ ప్రణాళికను రూపోందించాలని, పోలీస్ కమిషనర్ తెలియజేసారు. పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదులపై స్టేషన్ తప్పనిసరిగా కేసులను నమోదు చేయాలని, ప్రధానంగా ప్రజావాణి నుండి ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాల్సి వుంటుందని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, వరంగల్,జనగాం ఎఎస్పీలు శుభం, చేతన్, అదనపు డిసిపిలు ప్రభాకర్, బోనాల కిషన్‌ఇ రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు,ఆర్.ఐలు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

# క్రీడ

## రెండో టెస్ట్ మ్యాచ్‌లో స్లిప్స్ ఫీల్డింగ్‌లో కనిపించని జైస్వాల్



ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా టీమ్‌ఇండియా నేటి (జులై 2) నుంచి బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా రెండోటెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లిష్ జట్టుతో తలపడనుంది. భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ ఈ మ్యాచ్‌లో స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేయడు. లీడ్స్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో ఇదే స్థానంలో ఫీల్డింగ్ చేసిన అతడు ఏకంగా నాలుగు క్యాచ్‌లను వదిలేశాడు. అవి టీమ్‌ఇండియా విజయావకాశాలను దెబ్బ తీశాయి. అయితే రెండో టెస్ట్ మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో స్లిప్ ఫీల్డింగ్‌లో జైస్వాల్ కనిపించలేదు. కరుణ్ నాయర్, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ మాత్రమే స్లిప్స్‌లో క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశారు. జైస్వాల్ మాత్రం.. టీమ్‌ఇండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే సమక్షంలో షార్ట్‌లెగ్, లెగ్ స్లిప్ పొజిషన్స్‌లో ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకున్న ఇంగ్లాండ్ బ్యాటర్లు భారీ స్కోర్లు సాధించి, టీమ్‌ఇండియాకు విజయాన్ని దూరం చేశారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్ నాలుగు క్యాచ్‌లను డ్రాప్ చేశాడు. అందులో మూడు.. బుమ్రా బౌలింగ్‌లో వచ్చిన క్యాచ్‌లే కావడం గమనార్హం. ఇదే విషయమై టీమ్‌ఇండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే విలేకరులతో మాట్లాడాడు. జైస్వాల్‌ను స్లిప్ ఫీల్డింగ్ బాధ్యతల నుంచి తప్పించిన విషయం నిజమే అని ధ్రువీకరించాడు. అతడు కొంతకాలం స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేయడు. నిజానికి యశస్వి జైస్వాల్ మంచి ఫీల్డర్. ఇంతకు ముందు చాలా మంచి క్యాచ్‌లు అందుకున్నాడు' అని ర్యాన్ టెన్ డస్కాటే వివరించాడు.

## ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వేలానికి రిషబ్ పంత్

**మరికొంత మంది ఐపిఎల్ స్టార్లు కూడా!**



గతేడాది జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో రిషభ్ పంత్‌ని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ భారీ ధరకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ వికెట్‌కీపర్ బ్యాటర్‌ని రూ.27 కోట్లు వెచ్చించి సొంతం చేసుకుంది. టోర్నీ చరిత్రలోనే ఇదే అత్యధికం. తాజాగా రిషభ్ పంత్ మరో టీ20 లీగ్ వేలంలోకి వచ్చాడు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ రెండో ఎడిషన్ కోసం జులై 6, 7 తేదీల్లో వేలం నిర్వహించనున్నారు. డీపీఎల్ ఆక్షన్‌లో రిషభ్ పంత్ తన పేరును నమోదు చేసుకున్నాడు. ఈ సారి డిపిఎల్‌లో న్యూ ఔటర్ ఢిల్లీ, న్యూ ఢిల్లీ పేరిట రెండు కొత్త ఫ్రాంచైజీలు చేరాయి. దీంతో ఫ్రాంఛైజీల సంఖ్య ఎనిమిదికి చేరింది. 2024లో జరిగిన డిపిఎల్ తొలి ఎడిషన్ ద్వారా దిగ్వేశ్ రాఠీ, ప్రియాంశ్ ఆర్య వంటి ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చారు. అనంతరం ఐపిఎల్ ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సారి దిగ్వేశ్, ప్రియాంశ్‌తోపాటు ఐపిఎల్ స్టార్లు ఇషాంత్ శర్మ, ఆయుష్ బదోని, హర్షిత్ రాణా, హిమ్మత్ సింగ్, సుయాశ్ శర్మ, మయాంక్ యాదవ్, అనుజ్ రావత్ డిపిఎల్ వేలం బరిలో నిలిచారు.

### సెహ్వాగ్ తనయులు సైతం..

మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఇద్దరు కుమారులు ఆర్యవీర్ సెహ్వాగ్, వేదాంత్ సెహ్వాగ్ కూడా డిపిఎల్ వేలంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ వేలంలో 'బి' కేటగిరీలో ఉన్నట్లు సమాచారం. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అన్న కుమారుడు ఆర్యవీర్ కోహ్లీ కూడా ఢిల్లీ ప్రీమియర్ లీగ్ వేలంలో ఉంటాడని సమాచారం. విరాట్ చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ దగ్గర ఆర్యవీర్ కోహ్లీ మెళకువలు నేర్చుకుంటున్నాడు.

## 'మీమ్స్'పై కావ్య మారన్ స్పందన



ఆట పట్ల నాకున్న మక్కువ వల్లే నేను ఎక్కువగా కెమెరామెన్ దృష్టిలో పడుతుంటానని తెలిపారు. 'క్రికెట్ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే మా జట్టు ఆడే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షిస్తా. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఎక్కడ ఆడినా నేను వెళ్తాను. హైదరాబాద్‌లోనే కాకుండా అహ్మదాబాద్, చెన్నై లాంటి ప్రాంతాలకు కూడా వెళ్తుంటాను. టీమ్‌కు మద్దతు తెలుపుతాను. ఆ సమయంలో నేను స్టాండ్స్‌లో ఎక్కడో చాలా దూరంలో కూర్చొని ఉంటా. అయినా కెమెరామెన్ నన్ను వదలడు. ఎలాగోలా కనిపెట్టి కెమెరాలో బంధిస్తాడు. అలా నా ఎక్స్‌ప్రెషన్స్ నెట్టింట మీమ్స్‌గా మారుతున్నాయి' అంటూ కావ్య మారన్ చెప్పుకొచ్చారు.

## ఐసిసి టీ–20 బ్యాటర్ల ర్యాంకింగ్‌లో మూడవ స్థానంలో స్మృతి మందాన

భారత మహిళా క్రికెటర్ స్మృతి మందాన.. ఐసిసి టీ–20 ర్యాంకుల్లో టాప్ మూడవ బ్యాటర్‌గా నిలిచింది. వన్డేల్లో ఇప్పటికే వరల్డ్ నెంబర్ వన్ స్థానంలో ఉన్న ఆమె.. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ ఫస్ట్ మ్యాచ్‌లో సెంచరీ సాధించడంతో స్మృతి మందాన తన పాయింట్ల పట్టికను మెరుగుపరుచుకున్నది. ఫస్ట్ టీ20లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గాయం కావడంతో ఆ బాధ్యతలను స్మృతి మందాన పోషించింది. మందాన తన ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టింది. కేవలం 62 బంతుల్లోనే ఆమె 112 రన్స్ చేసింది. నాటింగ్‌హామ్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో



ఇండియా 97 రన్స్ తేడాతో విజయం సాధించింది. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ స్మృతి మందాన తన కెరీర్‌లో అత్యుత్తమంగా 771 రేటింగ్ పాయింట్లు సాధించింది. దీంతో ఆమె మూడవ ర్యాంక్‌లో నిలిచింది. వెస్టిండీస్‌కు చెందిన హేలే మాథ్యూస్ 774, ఆస్ట్రేలియా బ్యాటర్ బేత్ మూనీ 794 పాయింట్లతో రెండో, మొదటి స్థానల్లో నిలిచారు. భారతీయ మహిళా క్రికెటర్లలో షఫాలీ వర్మ, హర్లీన్ డియోల్.. రాణించారు. షఫాలీ వర్మ 13వ ర్యాంక్‌లో నిలిచింది. బౌలర్లలో పాకిస్తాన్ స్పిన్నర్ సాదియా ఇక్బాల్.. టీ20ల్లో టాప్‌లో నిలిచింది. 44 రేటింగ్ పాయింట్లతో ఆమె అగ్ర స్థానంలో ఉన్నట్లు ఐసీసీ తన ప్రకటనలో పేర్కొన్నది.

# మహిళ

**ఫోకస్**



**ఆధునిక కాలంలోనూ**

వైద్య రంగం విశేషంగా అభివృద్ధి చెందిన ఆధునిక కాలంలోనూ సంభవిస్తున్న ప్రసూతి మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు ప్రసవ సమయంలో లేదా గర్భధారణ సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పరిస్థితినే ప్రసూతి మరణంగా పిలుస్తారు.

## ప్రసూతి మరణాలా?

ఇది ప్రజారోగ్య సమస్య మాత్రమే కాక, సమాజం మొత్తం ఎదుర్కొంటున్న ఓ సంక్షోభం కూడా. ఇలాంటి మరణాలు గర్భధారణ సమయంలో, ప్రసవ సమయంలో, లేదా ప్రసవానంతరం 42 రోజుల లోపు, గర్భధారణ సంబంధిత లేదా నిర్వహణ కారణంగా సంభవిస్తున్నాయి. ఇది ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పరిస్థితికి అద్దం పడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) అంచనా ప్రకారం, ప్రతిరోజు సుమారు 800 మంది మహిళలు ప్రసవ సంబంధిత సమస్యల వల్ల చనిపోతున్నారు. ప్రసూతి మరణాల రేటు ఆఫ్రికాలో అత్యధికంగా ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ ఆందోళనకరమైన పరిస్థితులు కొనసాగుతున్నాయి. మన దేశం కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, ఇంకా చాలామంది మహిళలు గర్భధారణ, ప్రసవ సమయాల్లో మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఇలాంటి మరణాల రేటు అధికం. అత్యధిక మరణాలకు అధిక రక్తస్రావం (Hemorrhage) ప్రధాన కారణమవుతున్నది. గర్భసంక్లిష్టతలతోపాటు, గర్భానికి ముందు, ఆ తర్వాత వచ్చే సమస్యలు కూడా కొన్ని సందర్భాల్లో పరణాలకు దారితీస్తున్నాయి. రక్తహీనత (అనిమియా), వివిధ రకాలైన ప్రసవాంతర ఇన్‌ఫెక్షన్లు, ప్రీఎక్లాంప్సియా, ఎక్లాంప్సియా వంటి హైపర్‌టెన్షన్ సంబంధిత సమస్యలు కొంత మంది మహిళలకు ప్రాణాంతంగా మారుతున్నాయి. గర్భిణిగా ధ్రువీకరించిన తర్వాత, ప్రారంభ వైద్య సేవలు అందకపోవడం, అంబులెన్స్ సేవలు సకాలంలో లేకపోవడం, గుర్తింపు పొందిన ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవం జరగకపోవడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. పేదరికం, అవిద్య వల్ల మహిళలకు ఆరోగ్యంపై సరైన అవగాహన ఉండడం లేదన్నది వాస్తవం. వివిధ రకాలైన కుటుంబ బాధ్యత కారణంగా ఎక్కువ శాతం మంది మహిళలు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోరని, అనారోగ్యాన్ని కప్పిపుచ్చుకుంటూ, సొంత వైద్యంపై ఆధారపడతారని పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సమస్యకు తెరపడాలంటే, ప్రభుత్వ పరంగా ఉన్న సదుపాయాలను ఉపయోగించుకోవాలి. వాటిపై మహిళలకు, ప్రత్యేకించి మారుమూల ప్రాంతాల్లోని వారికి అవగాహన కల్పించడం అత్యవసరం. జనని సురక్షా యోజన (జెఎస్‌వై) కింద పేద మహిళలకు ఉచిత ప్రసవ సేవలు, ఆర్థిక సహాయం అందుతాయి. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (ఎంఎంఎస్ఎంఎ) ద్వారా గర్భిణులకు ప్రతి నెల 9వ తేదీన ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. తల్లి, శిశు మృతుల్ని తగ్గించడానికి మిషన్ ఇంద్రధనుష్ ద్వారా టీకాల కార్యక్రమాన్ని చేపడతారు. మహిళలు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలి. అదే విధంగా ప్రభుత్వం, మహిళా సంఘాలు, సంస్థలు కూడా ప్రసూతి మరణాలను తగ్గించేందుకు కృషి చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపడాలి. అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మహిళల్లో గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచాలి. గర్భిణులకు పోషకాహారం అందేలా చూడాలి. అనుభవజ్ఞులైన డాక్టర్ల ద్వారా మాత్రమే ప్రసవం చేయాలి. తక్షణ వైద్యం అందించే విధంగా అంబులెన్స్ సేవలు మెరుగుపరచాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే, ప్రసూతి మరణాలను పూర్తిగా నివారించవచ్చని వైద్య నిపుణులు అంటున్నారు. తగిన జాగ్రత్తలు, సమయానికి వైద్య సేవలు, కుటుంబ, సంఘ సహకారంతో ప్రసూతి మరణాలను చాలా వరకు తగ్గించవచ్చు. ప్రసూతి మరణాల నివారణ ఒక సామాజిక బాధ్యత. ఇది ఆరోగ్య రంగం మాత్రమే కాక, విద్య, ఆర్థిక వ్యవస్థ, మహిళ హక్కుల వ్యవస్థల సమన్వయంతో సాధ్యమయ్యేది. ప్రతి తల్లికీ సురక్షితమైన ప్రసవం, జీవితం మీద హక్కు ఉంది. ఈ హక్కును సమయంలోని ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కాపాడాలి.

## స్ఫూర్తిదాయక జీవితం...



చిన్నచిన్న సమస్యలకే భయపడి వణికిపోయేవారు కల్పనా సరోజ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి. రోజు గడవని స్థితి నుంచి ఒక పెద్ద వ్యాపారవేత్తగా ఎదిగి, 'పద్మశ్రీ' అవార్డును కూడా స్వీకరించిన సరోజ్ తన నిజ జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు అన్నీఇన్నీ కావు. 1961లో, మహారాష్ట్రలోని అకోలా జిల్లా, రోపర్‌ఖేతా గ్రామంలో, ఓ మధ్యతరగతి దళిత బౌద్ధ కుటుంబంలో జన్మించిన ఆమె తండ్రి పోలీస్ కానిస్టేబుల్. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. కూతురు పెళ్లి చేస్తే ఒక భారం తీరుతుందని అనుకున్న ఆయన సరోజ్‌కు 12 సంవత్సరాల వయసులోనే వివాహం జరిపించాడు. ఆమె నివాసం మురికివాడలోని పూరి గుడిసెలోకి మారింది. అక్కడితో ఆమె సమస్యలు తీరలేదు. అత్తింట్లో మానసిక, శారీరక వేధింపులు ఎదుర్కొంది. ఒకానొక సమయంలో ఆత్మహత్యా యత్నం కూడా చేసింది. కానీ ఆ ప్రయత్నం ఫలించలేదు. కుమార్తె పరిస్థితి తెలుసుకున్న సరోజ్ తండ్రి ఆమెను తనతోపాటు ముంబయికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ, కొత్త జీవితం ప్రారంభించింది. ఏదైనా వ్యాపారం పెట్టుకుంటే ఆర్థికంగా ఎదగవచ్చన్న నమ్మకంతో, బ్యాంకు నుంచి రుణం తీసుకొని టైలరింగ్ వ్యాపారం, ఫర్నీచర్ దుకాణం ప్రారంభించింది. పట్టుదలతో శ్రమించింది. వ్యాపారాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేసుకుంది. అదే సమయంలో కమానీ ట్యూబ్స్ అనే నష్టాల్లో ఉన్న కంపెనీ అమ్మకానికి ఉందని తెలిసి, దానిని కొనుగోలు చేసింది. రాంజీ హెచ్ కమానీ 1959లో నెలకొల్పిన ఆ కంపెనీ, సరోజ్ కొనుగోలు చేయడానికి ముందు సుమారు మూడు సంవత్సరాలుగా కార్మికులకు, ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదు. అలాంటి కంపెనీని కొనడం ఒక సాహసమే. సాధారణంగా ఎవరూ అంతటి ధైర్యం చేయరు. కానీ, సరోజ్ ఆత్మస్థైర్యం ముందు అనుమానాలు నిలువలేదు. తనను వారించిన వారంతా దిగ్భ్రాంతికి గురయ్యేలా ఆ కంపెనీని సరోజ్ అద్భుతంగా నిర్వహించింది. నష్టాల ఊబి నుంచి కంపెనీని గట్టెక్కించి, లాభాల బాట పట్టించింది. ప్రస్తుతం ఆరు కంపెనీలకు అధినేత్రిగా ఉన్న సరోజ్ నికర ఆస్తుల విలువ సుమారు రూ. 1000 కోట్లు. అందుకే ఆమె జీవితం ఒక స్ఫూర్తిదాయక గాథగా ఎంతో మందికి మార్గదర్శకం చేస్తున్నది. సామాజిక అణచివేత, దళిత కుటుంబం కావడంతో హేళనకు గురికావడం, బాల్యవివాహం, కుటుంబ వేధింపులు వంటి ఎన్నో సమస్యలను అధిగమించి, తన కృషి, పట్టుదలతో దేశంలోనే ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగిన సరోజ టెడెక్స్ స్పీకర్‌గా ప్రేరణాత్మక ప్రసంగాలు ఇస్తున్నది. 'ముళ్ల బాటలో పూలు పూయించుకోవాలంటే ధైర్యం, పట్టుదల అవసరం' అన్న సరోజ్ మాటలు అక్షర సత్యాలు. ఆమె జీవిత కథ ప్రతి యువతికి, మహిళకి, సామాజికంగా వెనుకబడినవారికి స్ఫూర్తిదాయకం. నిరాశలోనూ ఆశను, ఓటమిలోనూ విజయాన్ని కనిపెట్టిన ఘనత ఆమెది.

## బెల్టు షాపులపై పోరాడాలి

**మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన**




**ప్రజాపక్షం /చండూరు :** మహిళాసాధికారిత లక్ష్యంగా భారత జాతీయ మహిళ సమాఖ్య ముందుకు సాగుతుందని భారత జాతీయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన , ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం చండూరులోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మా భవనంలో మునుగోడు నియోజకవర్గ స్థాయి మహిళ సమాఖ్య సమావేశం మాదగోని విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, ఉస్తేల సృజన పాల్గొని మాట్లాడుతూ దేశంలో సామాజిక ఆర్థిక రాజకీయ సమానత్వంకై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అలనాడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాలలో పు రుషులకు ధీటుగా రానిస్తున్నారన్నారు. మహిళలకు రక్షణగా ఉన్నామన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల వివక్ష చూపుతున్నారని అన్నారు. గ్రామాలలో బెల్టు షాపుల నిర్మూలన కోసం నడుం బిగించాలని అన్నారు. మహిళలపై జరుగుతున్న హింసాకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. మునుగోడు నియోజకవర్గంలో అన్ని మండలాలలో మహిళా సమాఖ్య సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా కన్వీనర్ గిరి రమ, హహిళా సమాఖ్య నియోజకవర్గ నాయకులు వల్లి, సత్తమ్మ, చంద్రకళ, రజిత, లావణ్య, యశోద, యాదమ్మ, బోయపల్లి శాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి : మారుపాక

**ప్రజాపక్షం/ హాజీపూర్ :** దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా, దళితుల జీవితం మారలేదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. ఇటీవల మరణించిన నంనూర్ గ్రామ మాజీ సర్పంచ్ దేవి లక్ష్మి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి నాయకులు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు అందిస్తామని ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన అధికార పార్టీ, అధికారంలోకి వచ్చాక దానిని విస్మరించిందని విమర్శించారు. భూమిలేని దళితులకు భూమి కేటాయించాలన్న డిమాండ్‌తో పాటు, పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచి, ప్రైవేట్ రంగాల్లో కూడా రిజర్వేషన్‌ను అమలు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అడ్డుకునేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, జాతీయ సమితి సభ్యులు బోయిని అశోక్, రాష్ట్ర కార్యదర్శి కె. రాజారత్నం, జిల్లా ఉపాధ్యక్షుడు మారుపెల్లి రవి, జిల్లా సహాయ కార్యదర్శి గజ్జల తిరుపతి, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మ ణ్ పాల్గొన్నారు.



## పేదల గుడిసెలకు పట్టాలు, పక్కా ఇళ్ళు

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి డిమాండ్**




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు, ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఖిలా వరంగల్ మండల సిపిఐ మహాసభ వరంగల్ కోటలో ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్‌పా ల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ పాలనలో ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారన్నారు. బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, అటవీ సంపదను కార్పోరేట్‌లకు దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్ అని తక్కళ్లపల్లి అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్‌ను పరుస్తూ లక్షల కోట్ల రూపాయలను రాయితీలు ఇస్తూ ప్రజల సంక్షేమం మరిచి ప్రజాస్వామ్య గొంతును, ప్రజల గొంతుకను అణిచివేస్తూ రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను కేంద్రం తుంగ లో తొక్కుతున్నదన్నారు. రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్యం మం టగలుపుతున్నారని, కేంద్రంలో జాతీయవాదం పేరుతో హిందుత్వ ఏజెండాతో ముస్లిం, క్రిస్టియన్లు, కమ్యూనిస్టుల పై విషం కక్కుతూ ప్రశ్నించే గొంతుకను నొక్కుతున్నారని అన్నారు. నిరుద్యోగం, ఆకలి, దారిద్రం నిరంతరం పెరుగుతూ పేదలకు విద్య, వైద్యం అందక ప్రజలు ఆందోళన కు గురవుతున్న కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నా రు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ఆదివాసీలను హత్య చేస్తున్నదన్నారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టుల తో చర్చలు జరిపేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఫాసిస్ట్ చర్యలను మేధావులు, విద్యార్థులు ఐక్యంగా వ్యతిరేకించాలన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహా య కార్యదర్శులు ఎస్‌కె బాష్ మియా, పనాస ప్రసాద్, మండల కార్యదర్శి దండు లక్ష్మ ణ్, జిల్లా నాయకులు గన్నారపు రమేష్, బుస్సా రవి, తోట చంద్రకళ, సంగి యెలెందర్, ల్యాదెళ్ల శరత్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంకు మౌలిక వసతులు పెంచాలి : బాగం




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగించి పేదల పక్షపాతిగా సిపిఐ నిలిచిందని ఆయన తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని బైపాస్‌రోడ్డులో గల గిరిప్రసాద్ భవన్‌లో సిపిఐ టూ టౌన్ మహాసభ ఎస్‌కె సైదా, బోడా వీరన్న అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపి ఐ నిరంతరం పోరాటాలు సాగిస్తుందని తెలిపారు. ఖమ్మం నగరంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సిపిఐదే అన్నారు. నగర జనాభా పెరుగుతు న్న క్రమంలో దానికి అనుగుణంగా వసతుల కల్పన జరగాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిర మ్మ ఇండ్లను మంజూరు చేయాలని, నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయాలని కోరారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపా రు. కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారాలు మోపు తూ సంపన్న వర్గాలకు కొమ్ముకాస్తుందని ఆయన ఆరోపించారు. ప్రజలకు అవసరమైన వసతుల కల్పనలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మిక, కర్షక, పేద, సామాన్య ప్రజల హక్కులను కాలరాస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని ఆయన డి మాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చా రు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగిం పు సభలో డిసెంబర్‌లో జరుగుతుందని ఈ సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటాలు సాగించాలన్నారు. ఈనెల 6న జరిగే ఖమ్మం నగర మహాసభను జయప్రదం చేయాలని అదేవిధంగా మధిరలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, బిజి క్లైమెంట్, పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, అజ్మీర రామ్మూర్తి, తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెతో కేంద్రానికి గుణపాఠం

**ఎఐటియుసి కొమరం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్**




**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఈనెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఎన్‌హెచ్‌ఎమ్‌లో పనిచేస్తున్న సిబ్బంది మొత్తంగా పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కొమరం భీం జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పేర్కొన్నారు. మంగళవారం రెబ్బెనలో మెడికల్ ఆఫీసర్ సుజిత్‌కు సమ్మె నోటీసు అందజేసిన సందర్భంగా బోగే ఉపేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 2019, 2020లో నలుగురు లేబర్ కోడ్లను చట్టాలుగా చేసింది. వాటి అమలుతో ఉద్యోగుల పని గంటలు, పిఎఫ్, ఇఎస్ఐ, కనీస వేతనాలు, భద్రత, సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె చేసే హక్కులు భంగానికి గురవుతున్నాయి. ఈ నేపథ్యంతో ఎఐటియుసితో పాటు ఇతర కార్మిక సంఘాలు కలిసి జూలై 9న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. ఎన్‌హెచ్‌ఎమ్‌లో 10 సంవత్సరాలు పూర్తి చేసిన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, 2018లో విడుదలైన 510 జిఓ ప్రకారం అన్ని క్యాడర్లకు క్యాడర్ ఫిక్సేషన్ చేసి బేసిక్ పే అమలు చేయాలని, అదే ఏడాది విడుదలైన సిఆర్‌సికి సంబంధించిన ఏడు నెలల బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసి రిటైర్ అయిన ఉద్యోగులకు 10 లక్షల బెనిఫిట్స్ అందించాలని, వారికి జీవనోపాధికి పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. బస్తీ దవాఖానాల్లో 2018, 2019లో నియమితులైన సపోర్టింగ్ సిబ్బందిని ఏజెన్సీలకు అప్పగించకుండా కాంట్రాక్ట్ విధానంలో కొనసాగించాలని, ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగి మరణించినపుడు తక్షణ ఖర్చుల నిమిత్తం 20 వేలు, అలాగే 50 లక్షల నష్ట పరిహారం అందించాలని, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, మహిళా ఉద్యోగులందరికీ 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రాయిల్లా నర్సయ్య, ఎన్‌హెచ్‌ఎమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎఐటియుసీ జాయింట్ సెక్రటరీ ప్రమీల, నాయకులు మృదుల్ మండల్, వనిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

## బలమున్న స్థానాలలో పోటీ : గోదా

**ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్**




**ప్రజాపక్షం/భువనగిరి :** స్థానిక సంస్థల ఎన్నికల లో సిపిఐ పార్టీ బలమున్న ప్రాంతాలలో అభ్యర్థులను నిలబెడతామని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. భువనగిరి మండల, పట్టణ సంయుక్త కమిటీల సమావేశం మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో కామ్రేడ్ ఎండి బాబా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ అభ్యర్థులకు కాంగ్రె స్ పార్టీ సహకారం ఇవ్వాలని కోరారు. భువనగిరిలో నిరుపేదలు 2000 మంది ఇంటి అద్దెలు చెల్లిస్తూ నివాసాలు గడుపుతున్నారని తెలిపారు. వారికి 100 గజాల స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భువనగిరి మండల పరిధిలోగల గ్రామాలలో కూడా ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారందరికీ రాలేదని అన్నారు. గ్రామ కమిటీలు ఏకపక్షంగా నిర్ణయాలు చేస్తున్నారని, స్థలాలు లేకుండా ఇంటి అద్దె చెల్లిస్తున్న వారికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటికైనా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పత్రాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ భూములు భువనగిరి పట్టణంలో మండల పరిధిలో ఉన్నాయని వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరిలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పేదల కోసం ఇంటి నివేషణ స్థలాలు ఇవ్వాలని ఆందోళన చేసామన్నారు. ఈ వారంలో స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో సిపిఐ ప్రతినిధి వర్గం కలిసి మెమోరాండం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించామని అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు అలాగే బిల్డింగ్ సెల్లార్లలో పార్కింగ్ మాత్రమే ఉండే విధంగా పురపాలక సంఘం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య, భువనగిరి పట్టణ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కొమురంభీం జిల్లాలో 31 వరకు పోలీస్ యాక్ట్ అమలు : ఎస్పి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లా శాంతిభద్రతల పరిరక్షణ కోసం జులై 1 నుంచి 31 వరకు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పి కాంతిలాల్ పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో డిఎస్పి లేదా ఆపై స్థాయి అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, ఊరేగింపులు, ధర్నాలు, ర్యాలీలు, ప్రజలు గుమిగూడే కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. నిషేధిత ఆయుధాలు లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు ఉపేక్షించమన్నారు. నేర స్వభావం కలిగించే వస్తువులు కలిగి ఉండరాదని హెచ్చరించారు. చట్టానికి విరుద్ధంగా కార్యక్రమాలు చేపట్టినట్లయితే 30 పోలీస్ యాక్ట్1861 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఎవరైనా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ముందుగానే దరఖాస్తు చేసి అనుమతి తీసుకోవాలని ఎస్పి సూచించారు.

## లేబర్ కోడ్‌ల రద్దుకు 9న సమ్మె

ఏఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు



**ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి :** లేబర్ కోడ్‌ల రద్దుకు జులై 9న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు చాంద్ పాషా, టియుసిఐ జిల్లా కార్యదర్శి దేవరాజు మాట్లాడుతూ దేశ ఆర్థిక నిర్మాణంలో కీలక పాత్ర పోషించే కార్మికులకు హక్కులు లేకుండా చేయడం అన్యాయమని, ఇప్పటి వరకు ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మలచి కార్మిక వర్గాన్ని నష్టపర్చే విధంగా కేంద్రం ముందుకెళ్తుందన్నారు. కార్మిక హక్కులను కాలరాసే ఈ లేబర్ కోడ్‌లను తక్షణమే విరమించుకోవాలని, జులై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో యావత్ కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి పౌలు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం, మల్లయ్య, అరుణ, సురేందర్, భూతగడ్డ చిన్నయ్య, టియుసిఐ ప్రతినిధి ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో సిపిఐ జిల్లా మహాసభలు

సిపిఐ జిల్లా కార్యదర్శి విలాస్



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ /ఖానాపూర్ :** నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్‌లో సిపిఐ జిల్లా 4వ మహాసభల కరపత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. ఖానాపూర్ సిపిఐ మండల కార్యదర్శి కలకుంట రవి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేసేందుకు జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా రమేష్, అర్చన, జయంతి మాల, అనిత, గంగమణి తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడుగు, బలహీనవర్గాలకు అండ

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :** బడుగు బలహీన వర్గాల ప్రజలకు సిపిఐ అండగా ఉండి వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ తెలిపారు. ఇచ్చోడ మండల కేంద్రంలో మంగళవారం ఇచ్చోడ మండల 4వ మహాసభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం సిపిఐ ఇచ్చోడ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కళ్ళేపెల్లి గంగయ్య, సహాయ కార్యదర్శిగా దుబ్బాక అశోక్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ, ఇచ్చోడ మండల ప్రజాప్రతినిధులు, అధికారులు మండలంలో ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇచ్చోడలో తార్‌రోడ్లను, వీధిలైట్లను, మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం విమర్శించారు. నిర్మల్ పట్టణంలోని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు, మౌలిక సదుపాయాలు, ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు కూలిపోవడం, వర్షాలకు పై కప్పులు కారడం వంటి సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన అన్నారు. వెంటనే విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని రఘురాం డిమాంగ్ చేశారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలని కూడా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. విలేకరుల సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా కన్వీనర్ కైలాష్, జశ్వంత్, కిరణ్, రాజేందర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యం, పౌరసరఫరాల శాఖలు ప్రగతి సాధించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్





**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** విద్య, వైద్యం, పౌరసరఫరాల శాఖలు సంక్షేమ ప్రగతి సాధించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యా, వైద్యం, పౌరసరఫరాల శాఖల ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ఊరు మనబడి కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తులు విషయంలో చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ కిచెన్స్ ఏర్పాటు చేయడంలో భాగంగా పూర్తి వివరాలతో సమగ్ర కార్యచరణ రూపొందించాలన్నారు. అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజన పథకం సమగ్రంగా అమలు చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా యాక్షన్ ప్లాన్ తయారుచేసి సంవత్సరానికి రెండుసార్లు ఆర్‌బిఎస్‌కే ద్వారా సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు, వంట చేసే సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సిఎంఆర్ డెలివరీ విషయంలో పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రగతిని సాధించాలన్నారు. సంక్షేమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ పరిశుభ్రంగా తయారు చేయాలని, వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని వేడి ఆహారపదార్థాలు వడ్డించాలన్నారు. సంక్షేమ పాఠశాలల్లో స్టోర్ రూమ్ పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు కిచెన్‌కు ఉపయోగించే సామాగ్రి, కూరగాయలను భద్రపరచి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టెండర్ ద్వారా హాస్టళ్లకు సరఫరా చేసే వస్తువుల్లో నాణ్యత ఉండాలన్నారు. సమీక్షలో జడ్‌పి సిఇఒ ఎల్లయ్య, డిఇఒ రాధాకిషన్, ఎస్‌సి సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, బిడబ్ల్యుఒ హైమావతి, మైనార్టీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్‌తో ఇతర సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మెడికల్ కాలేజీల్లో ఉన్నతస్థాయి తనిఖీ

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఉన్నత స్థాయి తనిఖీ నిర్వహించడం జరిగిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో డా.విమల థామస్, ఉన్నత స్థాయి తనిఖీ నిర్వహించిన అనంతరం కలెక్టర్ అధ్యక్షతన ఉన్నతాధికారుల సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రమాణాలను మెరుగుపర్చేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్ అన్ని విభాగాలను ఉన్నత స్థాయి తనిఖీ అసెస్‌మెంట్ ఇన్‌ఛార్జ్ విమల థామస్ బృందం సభ్యులు తనిఖీ నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా.ఎ.సునీతా దేవి, జిజిఎచ్ మెదక్ ప్రిన్సిపల్ డా.రవి శంకర్, జిఎంసి మెదక్ వైస్ ప్రిన్సిపల్, డా.జయ, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఇబ్బందులు పరిష్కరించేందుకు కృషి

సబ్ కలెక్టర్ వికాస్ మహతో



**ప్రజాపక్షం/బోధన్ :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఆరవ వార్డులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణ పనుల పురోగతి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారిని సబ్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వికాస్ మహతో మాట్లాడుతూ నిర్మాణం ప్రతి దశ పూర్తైన తరువాత సంబంధిత మార్గదర్శకాల ప్రకారం మంజూరైన మొత్తం దశల వారిగా విడుదల చేయబడుతుందని లబ్ధిదారులకు సూచించారు. ఆయన వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# వనమహోత్సవంలో భాగస్వాములవ్వాలి

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** వాతావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వనమహోత్సవంలో భాగస్వామం అవ్వాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో జరిగిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి తో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగస్వాములై మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. వాతావరణ మార్పులు, కాలుష్య స్థాయి పెరుగుతున్న నేపథ్యంలో చెట్లే మనకు రక్షణ అన్నారు. ఆయా ప్రభుత్వ శాఖలకు కేటాయించిన లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన స్థలాలను గుర్తించి, మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి రామ్‌చందర్, గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, ఇతర అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### రాజంపేటకు పారిశుద్ధ్య సిబ్బందిని కేటాయించాలి

రాజంపేట గ్రామపంచాయతీకి ఆసిఫాబాద్ మున్సిపాలిటీ నుంచి పారిశుద్ధ్య సిబ్బందిని తక్షణమే కేటాయించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆసిఫాబాద్ సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట పరిధిలో సుమారు 1,750 మంది జనాభా ఉండడంతో తగిన పారిశుద్ధ్య సిబ్బందిని మున్సిపాలిటీ నుంచి కేటాయించాలని, ప్రతి రోజు తడి, పొడి చెత్తలను ఇంటింటి నుండి సేకరించి డంపింగ్ యార్డు వరకు తరలించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను శుభ్రంగా ఉంచాలని, గ్రామపంచాయతీకి ట్రాక్టర్, చెత్త తరలించే ట్రాలీలు అందించడంతో పాటు వీధిదీపాల ఏర్పాటు చేయాలని, వర్షాకాలం నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులనుఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి , ఆర్‌డిఒ లోకేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ గజానంద్, ఎంపిడిఒ శ్రీనివాస్, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**ప్రజాపక్షం/ఎడపల్లి :** చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులు చదువును కేవలం మార్కుల కోసమో, ఉద్యోగాల కోసమో కాకుండా, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి, సమాజానికి ఉపయోగపడే జ్ఞానాన్ని సంపాదించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రం శివారులోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నూతనంగా ప్రవేశ పెట్టిన బ్యూటీషియన్, అగ్రికల్చర్ కోర్సులను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యకు ఉన్న ప్రాముఖ్యతను వివరించారు. నేటి బాలలే రేపటి పౌరులు, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత మనందరిపై ఉందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేస్తూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి అనేక కార్యక్రమాలను చేపడుతోందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తెలియచేశారు. ఆధునిక ప్రయోగ శాలలు, గ్రంథాలయాలు ఏర్పాటు వంటి చర్యలు విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణాన్ని కల్పిస్తున్నాయన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని చేరుకోవడానికి కృషి చేయాలని ఆయన సూచించారు. సమాజంలో మంచి పౌరులుగా ఎదగడానికి విద్య ఎంతో అవసరమని సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నాయకులు పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, రజిత యాదవ్, మల్కారెడ్డి, ఈరంటి లింగం, శరత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ గంగా శంకర్, తహసీల్దార్ దత్తాత్రి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యం

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

**ప్రజాపక్షం/రామాయంపేట :** రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం రామాయంపేట పట్టణంలో రూ.7.5 కోట్ల చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపనలు చేశారు. పట్టణంలో మురికికాలువలు, సిసి రోడ్లు, కమ్యూనిటీ భవనాలకు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈసందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టిందని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంగా పేరొందిన రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు, అన్ని ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపిసిసి నాయకులు చౌదరి సుప్రబాత్‌రావు, రమేష్‌రెడ్డి, సరాపు యాదగిరి, గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, బండారి మహేందర్‌రెడ్డి, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, దామోదర్, అల్లాడి వెంకటి, చింతల స్వామి, యాదగిరి, చిలుక గంగాదర్, ఎర్రగొల్ల రమేష్, రెడ్డమైన నరేష్, దేవుని రాజు, విప్లవ్‌కుమార్, పిట్ల ప్రకాష్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.



# మరింతగా మెరుగ్గా నర్సరీల నిర్వహణ





నిజామాబాద్ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** వనమహోత్సవంలో కీలకమైన నర్సరీల నిర్వహణను మరింతగా మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం ఇందల్వాయి మండలం గౌరారంలో కొనసాగుతున్న నర్సరీని కలెక్టర్ తనిఖీ చేశారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. లక్ష్యం మేరకు పూర్తిస్థాయిలో మొక్కలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇళ్ల వద్ద నాటే మొక్కలను అవెన్యూ ప్లాంటేషన్ కోసం ఉద్దేశించి మొక్కలను వేర్వేరుగా విభజిస్తూ పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు. వచ్చే సీజన్ వనమహోత్సవం కోసం ఇప్పటి నుండి అవసరమైన ప్రణాళికలు రూపొందించుకుని తదనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌరారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై తన వెంట ఉన్న ఎంపీడీఓను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 32 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరి తెలుపగా, 29 గ్రౌండింగ్ అయ్యాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. 7 ఇళ్లు బేస్మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయని మూడు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చూడాలని క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పర్యవేక్షణ జరుపుతూ లబ్ధిదాదారులకు అవసరమైన సహాయ సహకారాలందించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. కలెక్టర్ వెంట పంచాయతీ కార్యదర్శి ప్రేమలత తదితరులు ఉన్నారు.

### విస్తృతంగా తనిఖీలు నిర్వహించిన కలెక్టర్

ఇందల్వాయి మండల కేంద్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మంగళవారం విస్తృతస్థాయిలో ఆకస్మిక తనిఖీలు జరిపారు. తహసీల్దార్ కార్యాలయంతో పాటు రేషన్ షాపు, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. స్థానికంగా గల గ్రామీణ పశు వైద్యశాలను సందర్శించి పనితీరును పరిశీలించారు. తహసీల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 3480 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ వెంకట్రావు తెలుపగా, దరఖాస్తుదారులకు రసీదులు అందించారా అని కలెక్టర ఆరా తీశారు. వచ్చిన అర్జీలను ఆయా కేటగిరిల వారిగా విభజిస్తూ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఇందల్వాయిలోని 12 నెంబర్ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. లబ్ధిదారులకు మూడు నెలలకు సంబంధించి ఒకేసారి అందించిన సన్నబియ్యం పంపిణీ పూర్తిస్థాయిలో జరిగిందా అని డీలర్‌ను ప్రశ్నించారు. జూన్ నెలాఖరు నాటితోనే పంపిణీని పూర్తి చేశామని తెలుపగా, కలెక్టర్ రికార్డులలో వివరాలను పరిశీలించారు. స్థానికంగా గల ఎరువుల పంపిణీ కేంద్రానికి చేరుకుని, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. ఎరువుల కొనుగోలు కోసం వచ్చిన రైతులను కలెక్టర్ పలకరించి అవసరమైన ఎరువులు సక్రమంగానే అందుతున్నాయా అని ఆరా తీశారు. ఎరువుల సరఫరా సంతృప్తికరంగా ఉందని రైతులు తెలుపగా, జిల్లాలో యూరియా సహా ఇతర అన్ని ఎరువుల నిల్వలు సరిపడా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ భరోసా కల్పించారు. ప్రస్తుత అవసరాలకు సరిపడా ఎరువులను మాత్రమే కొనుగోలు చేయాలని ముందస్తుగానే ఎక్కువ నిల్వలను సమకూర్చుకోవాలనే ఆదుర్దా వద్దని హితవు పలికారు. గ్రామీణ పశు వైద్యశాలను సందర్శించారు. అవసాన దశలో ఉన్న భవనాన్ని గమనించి అవసరమైన మరమ్మతులు చేయించాలని డాక్టర్ గంగాప్రసాద్‌కు సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులున్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 9న సమ్మె : ఏఐటియుసి



**ప్రజాపక్షం/కోటగిరి :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా నాయకులు ఎ.విఠల్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం కోటగిరి మండల కేంద్రంలో ఏఐటియుసి, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో విఠల్ గౌడ్, నల్ల గంగాధర్ గౌడ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మెను నిర్వహిస్తున్నామని చెప్పారు. కేంద్రప్రభుత్వం ఇప్పటి వరకు కార్మిక సంక్షేమ బోర్డు నిర్వహించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐటియుసి, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు అవగాహన

**ప్రజాపక్షం/బెల్లంపల్లి/మందమర్రి:** మత్తుకు బానిసలవుతున్న యువతలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా గంజాయి నిర్మూలన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ తెలిపారు. మంగళవారం బెల్లంపల్లి ఎసిపి కార్యాలయంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో జూలై 5 నుంచి 30 వరకు చేపట్టనున్న గంజాయి వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు లోనవుతుండటం బాధాకరమని, గంజాయితో కలిగే దుష్పరిణామాలను యువతకు వివరించి, వారిని సరైన మార్గంలో నడిపించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమన్నారు. కార్యక్రమంలో మందమర్రి పట్టణ ఎస్ఐ రాజశేఖర్ పటేల్, నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగుంట ప్రవీణ్ కుమార్, జనరల్ సెక్రటరీ బత్తిని కృష్ణ, లీగల్ సెల్ అధ్యక్షులు పెసర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## వైద్యురాలు కీర్తనకు సన్మానం



ప్రజాపక్షం/చొప్పదండి: చొప్పదండి మండలంలోని సిద్దార్థ హైస్కూల్ విద్యార్థులు అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్‌ను సందర్శించారు. సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని అన్నారని పేర్కొన్నారు. వైద్యులను సత్కరించుకోవడం ప్రధాన ధర్మమన్నారు. చొప్పదండి మండలంలోని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ కీర్తనను కలిసి డాక్టర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు సత్కరించిన తీరును చైర్మన్ అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ , టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేగంగా నవోదయ విద్యాలయ పనులు

### జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/కోరుట్ల: జగిత్యాల జిల్లాలోని కోరుట్ల లో నూతనంగా ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయ భవనము పనులను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మంగళవారం పరిశీలించారు. నవోదయ విశ్వవిద్యాలయం భవన పనులను జిల్లా కలెక్టర్ అధికారులతో ఫెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కలర్, ఎలక్ట్రిసిటీ, వాటర్, డోర్స్ వేగవంతంగా పూర్తి చేయాలని పూర్తి చేసిన వెంటనే నవోదయ స్కూల్ యజమాన్యం కు అప్పగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట కోరుట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య సంబంధిత అధికారులు పాల్గోన్నారు

## వైద్య వృత్తి గౌరవప్రదమైనది..



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : ప్రపంచ మానవాళికి వైద్యవృత్తి గౌరవప్రదమైనదిగా గుర్తిస్తామని లయన్స్ క్లబ్ సభ్యులు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్లను మంగళవారం శాలువాలతో సత్కరించారు.డాక్టర్ డీడీవో డాక్టర్ బాబు,డాక్టర్ ఓంకార్,డాక్టర్ ప్రదీప్‌కుమార్,డాక్టర్ రఘులను గౌరవప్రదంగా లయన్స్ క్లబ్ సభ్యులందరు సత్కారం చేశారు.అంతేకాకుండా ఆశ్విని హాస్పిటల్ ప్రైవేటు వైద్యులు డాక్టర్ సత్యనారయణ స్వామి కలిసి ఆయనను పలు ప్రజాప్రతినిదులు చీటిలక్ష్మణ్‌రావు ప్రముఖ నాయకులు,సామాజిక వేత్తలు ప్రతినిధులు ఉన్నారు.

## అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందిన గౌస్‌బాబాకు సత్కారం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ఇంటెలిజెన్స్ విభాగంలో డిఎస్పీగా విశేష సేవలందించిన గౌస్ బాబా ఇటీవలే అడిషనల్ ఎస్పీగా(ఆర్ఐవో) పదోన్నతి పొందిన సంధర్భంగా ఆయన కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆద్వర్యంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సంధర్బంగా పూలబొకే శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, గూడ ప్రభాకర్ రెడ్డి, కోట రామస్వామి, హర్మిందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి



ప్రజాపక్షం /ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక ఓల్ టిటిడి ధర్మశాల ఆవరణలో మంగళవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఎదులాపురం మహేందర్, స్తంభంకాడి గణేష్,బాధినేని వెంకటేష్, గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్,సూపరింటెండెంట్ కిరణ్,సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు ధర్మశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో సుమారు 100 మొక్కలను నాటారు.పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు.

## ఇబ్రహీంపట్నం ప్రెస్‌క్లబ్ ఎన్నిక ఏకగ్రీవం



ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం టియుడబ్ల్యూజె (ఐజేయు) మండల ప్రెస్ క్లబ్ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. మెట్‌పల్లి టీయూడబ్ల్యూజే (ఐజేయు) ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బూరం సంజీవ్, మెట్ పల్లి ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు మాసుల ప్రవీణ్ ల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులుగా లోక రమణ రెడ్డి (వార్త దినపత్రిక), ఉపాధ్యక్షులుగా గూడ రమేష్ (ప్రత్యక్ష సాక్షి), ప్రధాన కార్యదర్శిగా నేమూరి ఏసురత్నం (నవతెలంగాణ), కోశాధికారిగా పసునూరి ఆంజనేయులు (ప్రజాపక్షం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులుగా కల్లెడ వినోద్, సల్వాల ప్రవీణ్, శ్రీపాద లింబాద్రి, గుమ్మడి లక్ష్మి నర్సయ్య గౌడ్ తదితరులున్నారు.

# వైద్య సేవలపై విస్తృత అవగాహన

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి





ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: ప్రభుత్వ ఆసుపత్రిలో రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నామని, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా ఈ సేవల పట్ల విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, లేబర్ రూమ్, మెడికల్ స్టోర్ పరిశీలించారు. వివిధ రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 100 శాతం మహిళలకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. గత పది నెలలుగా శుక్రవారం సభ, ఆరోగ్య మహిళ కార్యక్రమాల ద్వారా ఆరోగ్యశాఖ సేవల ప్రగతిని తెలిపేలాబోర్డు ఏర్పాటు చేయాలన్నారు.బిపి, షుగర్ వంటి వ్యాధులకు అన్ని మందులు అందుబాటులో ఉంటాయన్న విషయాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా కేక్ కట్ చేశారు.

### భవిత కేంద్రం సందర్శన

మానకొండూర్‌లోని భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించి వారితో పలు ఆటలు ఆడారు. పెయింటింగ్ పనులను పరిశీలించారు. భవిత కేంద్రానికి ఏమైనా అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దివ్యాంగుల మనోవికాస అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. అవసరమైన వారందరికీ స్పీచ్ థెరపీ ఇప్పించాలన్నారు. అనంతరం భవిత కేంద్రం ఆవరణలో ప్రత్యేకంగా మొక్కలు నాటారు.

### ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

మానకొండూర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇం డ్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణంలో ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. నిర్మాణం వేగంగా పూర్తి చేసుకోవాలని, దశలవారీగా సొమ్ము జమ చేయిస్తామని లబ్దిదారులకు సూచించారు. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల సంఖ్య, గ్రౌండింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులు ఇండ్ల నిర్మాణం వేగవవంతంగా పూర్తిచేసుకునే విధంగా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి వ్యయం, నిర్మాణం, మెటీరియల్, ఇసుక తదితర వివరాలు ఆరా తీశారు. ఇందిరమ్మ ఇండ్లకు కావాల్సిన ఇసుక టోకెన్ విధానం ద్వారా ఇస్తున్నామని, సరఫరాలో ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

### నర్సరీ సందర్శన

మానకొండూర్‌లోని మొక్కల పెంపకం కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. నర్సరీలో ఉన్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. అందుబాటులో ఉన్న మొక్కల సంఖ్య, రకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎక్కువగా ఇష్టపడే పండ్లు, పూల మొక్కలు పెంచాలని సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో మొక్కలు విరివిగా నాటించాలని, వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, మండల విద్యాధికారి మధుసూధన్, భవిత కేంద్రం ఇన్‌స్ట్రక్టర్లు ఉమ, రాంప్రసాద్, కార్యదర్శి రేవంత్ తదితరులున్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాపక్షం/జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఉమా శ్రీరెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్‌వో చందు సందర్శించారు. వసతి గృహంలోని వాటర్‌ప్లాంట్‌ను, వంటగదిని పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వంటగదిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్‌కు తగిన సూచనలు, సలహాలిచ్చారు. విధ్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకవాలన్నారు. డాక్టర్ రాజేష్, డాక్టర్ మహోన్నత పటేల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాం నాయక్, డిపిహెచ్ఎన్ విమల,హెల్త్ ఎడ్యుకేటర్లు పంజాల ప్రతాప్ గౌడ్, మోహన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ లచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ రామ్‌సింగ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్ చారి,హెల్త్‌అసిస్టెంట్‌నరేందర్,ఏఎన్ఎంలు మంజుల, రజిత, ఆశా కార్యకర్త రహీమున్నీసాన్నారు.

# వైద్యం పట్ల ప్రజలలో నమ్మకం కల్గించాలి

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజలలో నమ్మకం కల్గించాలని ,మంథని ప్రాంతంలో ప్రజలకు అందించే వైద్య సేవలు మరింత ఇంప్రూవ్ కావాల్సి ఉందనికలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అమలు పై సంబంధిత వైద్య అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పని తీరు చాలా ఇంప్రూవ్ చేసుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో మొత్తం 14 వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ ప్రజల నుంచి వైద్యులు అందుబాటులో ఉండటం లేదు అనే ఫిర్యాదులు వస్తున్నాయని, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం, సిసి కేమేరాల ఏర్పాటు చేయాలని అన్నారు. మంథని ఆసుపత్రి నుంచి అధికంగా రిఫరల్ కేసులు రాకుండా చూడాలని, అత్యవసర క్రిటికల్ కేసులను మాత్రమే పెద్దపల్లి, గోదావరిఖని కు రిఫర్ చేయాలని అన్నారు. మంథని ఎం.సి.హెచ్ ఆసుపత్రిలో నెలకు 25 ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ల వారిగా గర్భిణీ స్త్రీల ను ట్రాక్ చేస్తూ ప్రసవం కోసం మంథని ఎం.సి.హెచ్ ఆసుపత్రికి వచ్చేలా చూడాలన్నారు. ప్రసవాల తర్వాత అవసరమైన పోస్ట్ ఆపరేటివ్ కేర్ సరిగ్గా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. నవజాత శిశువుల సంరక్షణ కోసం అవసరమైన వార్మర్, ఇతర పరికరాల ఏర్పాటు చర్యలు తీసుకోవాలన్నారు.సి.హెచ్.సి మంథని లో ఔట్ పేషెంట్ సేవలు పెరగాలని, వైద్యులు ఓపి సమయంలో పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, ఇతర సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటూ రోగులను సరిగ్గా రిసివ్ చేసుకుంటూ మెరుగైన వైద్యం అందిస్తే ప్రజల్లో ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం పెరుగుతుందని అన్నారు. వైద్యులు సకాలంలోవిధులకుహాజరుకావాలనిఅన్నారు. వైద్యులు, సిబ్బంది సెలవుల మంజూరు ప్రణాళిక ప్రకారం జారీ చేయాలని, జూలై నెలలో స్పష్టమైన మార్పు చూపించాలని అన్నారు ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, డి.సి.హెచ్.ఓ డాక్టర్ శ్రీధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీస్‌కు సహకరిస్తేనే భద్రత




ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : చిరు వ్యాపారులు ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో సహకరించాలని పెద్దపల్లి ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చిరువ్యాపారులు, మెప్మా ఆర్పీలతో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ట్రాఫిక్ సిఐ అనిల్ కుమార్ ట్రాఫిక్ పై అవగాహన నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్, ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ ప్రజల సహకారంతో అన్ని వార్డులో, మెయిన్ చౌరస్తాలో రోడ్లు, మురికాలువలతో అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందని, చిరువ్యాపారులు రోడ్లపై తోపుడు బండ్లు,ఇతరత్రా వ్యాపారాలు చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని, చిరు వ్యాపారులు వారికి కేటాయించిన స్థలంలో వ్యాపారం చేసుకోవాలని, పెద్దపల్లి పట్టణంలో వ్యాపారం రద్దీగా ఉన్న పరిసరాలను రెడ్,బ్లూ,గ్రీన్ జోన్లగా విభజించడం జరుగుతుందని, చిరువ్యాపారులు ప్రభుత్వం నుండి 50, 000 తీసుకున్న రుణాలను చెల్లించి తిరిగి 1 లక్ష నుండి 5 లక్షల వరకు రుణాలు పొందవచ్చని, పెద్దపల్లి పట్టణంలో పెరుగుతున్న జనాభా అనుకూలంగా ట్రాఫిక్ సమస్య చాల ఏర్పడుతుందని ట్రాఫిక్ సమస్యకు పెద్దపల్లి పట్టణంలోని ప్రతి వ్యాపారి చిరు వ్యాపారులు ట్రాఫిక్ పోలీసు వారికి సహకరించాలన్నారు. చిరు వ్యాపారులు రోడ్డుపై బండ్లు ఇతరత్రా సామాన్లు పెట్టి విక్రయించడం వల్ల కొనుగోలుదారులు వారి వాహనాలను రోడ్లపై నిలపడం జరుగుతుందని ప్రతి ఒక్క వ్యాపారి మున్సిపల్ వారు సూచించిన మేరకు రోడ్డుకు లోపల వ్యాపారం సాగించాలన్నారు. ఇష్టానుసారంగా రోడ్లపై పార్కింగ్ చేసినచో జరిమానా విధిస్తామన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష

ప్రజాపక్షం/సుల్తానాబాద్:కిడ్నాప్ ఫోక్సో కేసులో నేరస్తుడు షేక్ అన్వర్ అలియాస్ కట్ట అన్వర్ అనే వ్యక్తికి 10 సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలలోకి వెళ్తే సుల్తానా బాద్ మండలానికి చెందిన ఫిర్యాదురాలు కూతురు ఇంటర్ పూర్తి చేసి ఇస్త్రారాకుల కంపెనీలో పని చేస్తుంది.పని కోసం వెళ్లేటప్పుడు నిందితుడు షేక్ అన్వర్ పరిచయం కాగా, కొద్దిరోజుల తర్వాత ప్రేమిస్తున్నాను,పెళ్లి చేసుకుంటాను అని చెప్పగా, ఫిర్యాదురాలు తన కూతురును మందలించారు. 2018లో ఫిర్యాదురాలు కూలి పనికి వెళ్లగా, నిం దితుడు షేక్ అన్వర్ ఫిర్యాదు రాలి ఇంటికి వచ్చి ఫిర్యాదురాలి కూతురును ఆటోలో ఎక్కించుకొని పెద్దపెల్లికి వెళ్లి, అక్కడి నుంచి రాత్రి కాగజ్‌నగర్‌కు తీసుకువెల్లి తెలిసిన వాళ్ళ ఇంట్లో రూమ్ తీసుకున్నాడు. ముద్దా యి అన్వర్ అమ్మాయిని లొంగదీసుకుని మనం పెళ్లిచేసు కుందామని చెప్పి వారం రోజులపాటు అన్వర్ అమ్మాయితో గడిపాడు. అన్వర్‌ను పెళ్లి చేసుకోమని అడగగా దాటవేస్తూ కాలం గడిపాడు. అమ్మాయి ఫోన్ ద్వారా తన తల్లికి చెప్పగా తల్లి కాగజ్‌నగర్ వచ్చింది. ఫిర్యాదురాలు తన కూతురికి జరిగిన అన్యాయంపై షేక్ అన్వర్ పైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేశారు. ఎసిబి హబీబ్ ఖాన్ విచారణ చేసి నిందితుడ్ని అరెస్టు చేసి జ్యుడీ షియల్ రిమాండుకు పంపారు. ఎసిపి వెంకట రమణారెడ్డి కోర్ట్ లో ఛార్జ్ షీట్ దాఖలు చేయగా, ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి కోర్ట్ పెద్దపల్లి కోర్టులో కేసు విచారణ జరిగింది. ప్రత్యేక జడ్జి ఇరువురి వాదనలు విని షేక్ అన్వర్ నేరం చేసినట్లు రుజువు కావడంతో, అతనికి పది సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదాం రమేష్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి ఎస్సై శ్రావణ్‌కుమార్,కోర్టుకానిస్టేబుల్‌శ్రీనివాస్, కోటేశ్వర రావులనుకమిషనర్అంబర్‌కిషోర్‌ఝుఅభినందించారు.

## హరితహారంలో నాటిన చెట్ల నరికివేత!



ప్రజాపక్షం/శంకరపట్నం: శంకరపట్నం మండలం గద్దపాక నుంచి కన్నాపూర్‌కు వెళ్లే దారిలో ఒక వ్యక్తి హరితహారంలో నాటిన చెట్లను నరికివేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి హరిత హారంలో మొక్కలు నాటితే ఎదిగిన చెట్లను నరకడమేమిటని పలువురు మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా తాను ఎగ్జామ్స్ రాస్తున్నానని, అందుబాటులో లేనని చెబుతూ మరుసటి రోజు సమాచారం తెలుసుకుని వివరాలు ఇస్తానని తెలిపారు. కానీ ఆ తర్వాతి రోజు నుంచి పలుమార్లు సంబంధిత పంచాయతీ కార్యదర్శి వివరణ కోసం ఫోన్ చేస్తున్నా స్పందించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## నూతన సబ్‌స్టేషన్‌కు వినతి



ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని మంగళవారం మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు టిఎస్ఎన్ పిడిసిఎల్ ఎస్ఈకి వినతి పత్రంఅందజేశారు. సంపత్‌రావు మాట్లాడుతూ బొమ్మకల్ సబ్‌స్టేషన్ నుంచి దుర్శేడ్ డివిజన్ కరీంనగర్ కార్పోరేషన్‌లో విలీనం చేసిన గుంటూరుపల్లి, గోపాల్‌పూర్, నల్లగుంటపల్లి, బొమ్మకల్ గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. ఐదు గ్రామాల్లో విద్యుత్‌సరఫరాకు ఏ గ్రామంలో సమస్య తలెత్తినా మిగిలిన గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో దుర్శేడ్ గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం హైవే రోడ్డు పక్కన ఖరీదైన భూములను రైతులు ఇచ్చారని, అందులో 220 కెవి, 132/11కెవి సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. దుర్శేడ్‌లో ఏర్పాటు చేసిన సబ్ స్టేషన్ నుంచి మిగతా జిల్లాలకు విద్యుత్ సరఫరా జరుగుతుందని, తమ గ్రామానికి వేరే చోట నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. బొమ్మకల్ గ్రామం నుంచి దుర్శేడ్ వచ్చే విద్యుత్ సరఫరా గుంటూరుపల్లి స్టేజీ వద్ద రైల్వే ట్రాక్ లోపలి నుంచి విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేయడంతో ఇక్కడ ఏ చిన్న సమస్య ఏర్పడినా రైల్వే అధికారుల అనుమతి తీసుకుని వారు వచ్చే వరకు మిగతా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. రైతుల వ్యవసాయ పొలాలకు మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో రాత్రి వేళల్లో రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. దుర్శేడ్‌లోని 220 కెవి సబ్‌స్టేషన్ పక్కన ఖాళీస్థలంలో నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తే విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుం డా ఉంటుందని తెలిపారు. నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు.

## కాల్వల భూసేకరణ ప్రక్రియ వేగవంతం



### సిద్దిపేట కలెక్టర్ హైమావతి

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : జిల్లాలో రిజర్వాయర్‌ల ద్వారా ఆయకట్టును నీటిని అందించటం కోసం కాల్వల భూసేకరణ ప్రక్రియ యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో నీటిపారుదల,రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి లాంటి రిజర్వాయర్‌ల నుండి తపాస్‌పల్లి రిజర్వాయర్ నుండి వివిధ ప్యాకేజీల ద్వారా జిల్లాలోని ప్రతి చెరువులో నీటిని నింపటానికి కావాల్సిన భూసేకరణను మండలాల వారిగా అధికారులతో చర్చించారు. వివిధ ఫ్యాకెజీలో భూసేకరణకు నిధులు విడుదల చేసినవి, పెండింగ్ ఎంత అనే విషయాలు అయాగ్రామ, మండలాల వారిగా పూర్తి సమాచారాన్ని ఆర్డీఓలకు ఇవ్వాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియలో రెవెన్యూ, సర్వేయర్ ల పాత్ర కీలకమన్నారు. గ్రామాల్లో మండల తహశీల్దార్,సర్వేయర్లు, ఆర్డీఓల సహకారంతో కాలువల భూసేకరణ, ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సర్వేయర్ అందించిన భూసేకరణ సంబంధిత ఇరిగేషన్ అనుమతులు తహశీల్దార్‌లకు అందించిన వెంటనే రైతులకు నష్టపరిహారం అందచేసి భూమిని ఆధీనంలోకి తీసుకోవాలని సూచించారు. డిఆర్ఓ నాగరాజమ్మ, గజ్వే ల్,హుస్నాబాద్‌ఆర్డీఓలు చంద్రకళ, రాంమూర్తి. భూసేకరణ స్పెషల్ డిప్యూటి డైరెక్టర్ పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి

### టిపిసిసి ప్రధాన కార్యదర్శులు ఖాజా ఫక్రుద్దీన్, ఆడిం రాజు




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: రాజ్యాంగ పరిరక్షణ కోసం తెలంగాణలో చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనం పేరుతో ఈ నెల 4న హైదరాబాదులోని ఎల్‌బి స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన సభను విజయవంతం చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, ఆడిం రాజు పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ డిసిసికార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశంలో వారు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు.మీడియాతో మాట్లాడారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రులు హాజరు కానున్నారు. డిసిసిఅధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తు న్న అభివృద్ధిని తట్టుకోలేకనే బిఆర్ఎస్ విమర్శలు చేస్తుందన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్‌లు శవాలపై ప్యాలాలు ఏరుకుంటున్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ ఏ పార్టీ చేయని సాహసంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షునిగా దళితుడిని నియమించడం జరిగిందన్నారు. నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మడుపు మోహన్, కొరివి అరుణ్ కుమార్, శ్రావణ్ నాయక్, వైద్యుల అంజన్ కుమార్, గడ్డం విలాస్‌రెడ్డి, భూమాగౌడ్, చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, అర్ష మల్లేశం, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, సిరాజ్ హుస్సేన్, వెన్న రాజ మల్లయ్య, బొబ్బిలి విక్టర్, బోనాల శ్రీనివాస్, అజీమ్ మహమ్మద్, సయ్యద్ జమాలుద్దీన్, రాచకొండ ప్రభాకర్, నేతికుంట యాదయ్య, ఫహాద్, మూల రవీందర్‌రెడ్డి, దిండిగాల మధు, మూల కృష్ణారెడ్డి, రాంరెడ్డి, పంజాల స్వామి, మునిగంటి అనిల్, కంకణాల అనిల్, బొమ్మ ఈశ్వర్ తదితరులున్నారు.

# రీల్



## నటి పాకీజాకు పవన్ కళ్యాణ్ ఆర్థిక సహాయం

తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సినీ నటి వాసుకి (పాకీజా)కి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆప్త హస్తం అందించారు. ఆమె దీన స్థితి తెలిసి చలించిన పవన్ కళ్యాణ్ రూ. 2 లక్షల రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. మంగళగిరి మధ్యాహ్నం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఈ మొత్తాన్ని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పి. హరిప్రసాద్, పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాకీజాకు అందజేశారు. పవన్ కళ్యాణ్ చేసిన సాయానికి పాకీజా కృతజ్ఞతలు తెలిపారు. చిన్నవాడైనా ఎదురుగా ఉంటే కాళ్లు మొక్కుతానంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తన ఆర్థిక పరిస్థితి గురించి నిన్ననే పవన్ కళ్యాణ్ కార్యాలయానికి తెలియజేశాననీ, తక్షణం స్పందించి తగిన విధంగా ఆర్థిక సాయం అందించారని తెలిపారు. పవన్ కళ్యాణ్ కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.



## నా క్యారెక్టర్‌కు ఓ భిన్నమైన లవ్ స్టోరీ ఉంటుంది

- హీరోయిన్ సప్తమి గౌడ

కాంతార సినిమా తర్వాత దర్శకుడు శ్రీరామ్ వేణు దగ్గర నుంచి 'తమ్ముడు' మూవీ కోసం కాల్ వచ్చింది. హైదరాబాద్ వచ్చి లుక్ టెస్ట్ ఇచ్చాను. లుక్ టెస్ట్‌లో ఓకే అయ్యాక, డైలాగ్ వెర్షన్ చెప్పారు. అప్పటికే రత్న క్యారెక్టర్ గురించి కంప్లీట్‌గా స్క్రిప్ట్ ఉంది. హార్స్ రైడింగ్ నేర్చుకోమని చెప్పారు. అరకులో షూటింగ్ చేశాం. నితిన్ భుజానికి గాయం వల్ల షూటింగ్ కొంత ఆలస్యమైంది. 'తమ్ముడు' మూవీకి వర్క్ చేయడం మంచి ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. అంబరగొడుగు అనే ఊరిలో ఉండే రత్న అనే అమ్మాయి క్యారెక్టర్ నాది. తను పవన్ కల్యాణ్ అభిమాని. నా క్యారెక్టర్‌కు ఒక డిఫరెంట్ లవ్ స్టోరీ కూడా ఉంటుంది. కాంతారతో చూస్తే లుక్ వైజ్ నా క్యారెక్టర్ ఒకేలా ఉంది అనిపించవచ్చు కానీ క్యారెక్టర్‌గా చూస్తే పూర్తిగా భిన్నమైనది. లయ, నితిన్ కొన్ని పరిస్థితుల్లో అంబరగొడుగు అనే ఊరికి వస్తారు. వారి జర్నీలో రత్న ఎలా భాగమైంది అనేది ఆసక్తికరంగా ఉంటుంది. కొండలు, గుట్టల్లాంటి ప్రాంతంలో గుర్రపుస్వారీ చేయాల్సివచ్చింది. రోజూ మూడు, నాలుగు గంటలు హార్స్ రైడింగ్ చేయడంతో ఇబ్బందిపడ్డాను. 'తమ్ముడు'లో నేను, లయ, దిత్య, వర్ష, స్వసిక..ఇలా మా అందరి క్యారెక్టర్స్‌కు ఇంపార్టెన్స్ ఉంటుంది. వుమెన్ క్యారెక్టర్స్‌ను ఇంత బలంగా తెరకెక్కించినందుకు రేపు థియేటర్స్‌లో 'తమ్ముడు' సినిమా చూసే మహిళా ప్రేక్షకులు చాలా హ్యాపీగా ఫీలవుతారు. కాంతార సక్సెస్ తర్వాత నాకు అలాంటి క్యారెక్టర్స్ ఆఫర్ చేశారు. అందుకే చాలా మూవీస్ వదులుకున్నాను. ఎక్కువ చిత్రాల్లో మీకు నేను కనిపించకపోవడానికి కారణమదే. డిఫరెంట్ రోల్స్ వస్తే తప్పకుండా చేస్తా. ప్రస్తుతం తెలుగులో మరో రెండు చిత్రాలతో పాటు తమిళంలో, కన్నడలో మూవీస్ చేస్తున్నా. వాటి డీటెయిల్స్ త్వరలో వెల్లడిస్తా. భాషాలకు అతీతంగా అన్ని చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నా అని ఆమె చెప్పారు.



## తమ్ముడు మరో సూపర్ హిట్ అవుతుంది

### ట్రైలర్ వేడుకలో నిర్మాత దిల్ రాజు

సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో వస్తున్న 'తమ్ముడు'. మరో సూపర్ డూపర్ హిట్ సినిమా అవుతుందని నిర్మాత దిల్ రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.'తమ్ముడు' సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత శిరీష్ మాట్లాడుతూ ఈ సినిమా జూలై 4న సాధించబోయే సక్సెస్ క్రెడిట్ మొత్తం శ్రీరామ్ వేణుకే దక్కాలి. ఈ సినిమాకు మేము పడిన కష్టం తక్కువ. ఘన విజయాన్ని అందుకోబోతున్నాం. ఇలాంటి వేదక మీదే మళ్లీ సెలబ్రేట్ చేసుకుందాం. నితిన్ కెరీర్ లో జయం, గుండెజారి గల్లంతయ్యిందే మూవీస్ సక్సెస్‌కు ఎంత సంతోషపడ్డాడో, 'తమ్ముడు' మూవీ విజయం అంతకు రెట్టింపు ఆనందాన్నిస్తుంది. ప్రొడ్యూసర్స్‌గా మేము నితిన్ కు ఆ ప్రామిస్ ఇస్తున్నాం. అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'తమ్ముడు' మూవీ ఔట్ పుట్ ఇంత బాగా రావడానికి టెక్నీషియన్స్ కష్టమే కారణం. డీవోపీ గుహన్ , ఎడిటర్ ప్రవీణ్ పూడి, వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్, ఆర్ట్ చేసిన శేఖర్..ఇలా టెక్నీషియన్స్ శ్రీరామ్ వేణు విజన్ ను స్క్రీన్ మీదకు అద్భుతంగా తీసుకొచ్చారు. జై బగళాముఖీ పాటతో మా సినిమాకు ఒక వైబ్ వచ్చింది. ఆ పాట రాసిన జొన్నవిత్తులకి థ్యాంక్స్. అజనీష్ లోకనాథ్ తన మ్యూజిక్ తో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాడు. మాతో శ్రీరామ్ వేణు సుదీర్ఘ ప్రయాణం చేస్తున్నాడు. ఆయన ఏంటో మాకు పూర్తిగా తెలుసు. మా దగ్గర ఎంసీఏ, వకీల్ సాబ్ లాంటి సూపర్ హిట్స్ చేశాడు.సంక్రాంతికి వస్తున్నాం తర్వాత మా బ్యానర్ కు మరో హిట్ 'తమ్ముడు' ఇవ్వబోతోంది. రామ్ చరణ్ తో గేమ్ ఛేంజర్ చేశాం. చరణ్ తో సూపర్ హిట్ చేయలేకపోయామనే లోటు ఉంది. అని అన్నారు

హీరో నితిన్ మాట్లాడుతూ 'తమ్ముడు' మూవీ జూలై 4న థియేటర్స్ లోకి వస్తోంది. ఈ సినిమా శ్రీరామ్ వేణు కోసం, నా సినిమాలను ఇష్టపడే అభిమానులు, నాకు సక్సెస్ రావాలని కోరుకునేవారి కోసం ఘన విజయం సాధించాలి.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీరామ్ వేణు, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ దిత్య, తదితరులు పాల్గొన్నారు.



## 'విశ్వంభర' ఐటెం సాంగ్‌లో మౌని రాయ్

మెగా స్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్‌గా దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న భారీ విజువల్ ట్రీట్ చిత్రం విశ్వంభర. అత్యయితే చిరు నుంచి చాలా కాలం తర్వాత వస్తున్న ఫాంటసీ సినిమా ఇది కాగా దీనిపై అప్పట్లో భారీ హైప్ నెలకొంది. కానీ ఇపుడు సినిమా షూటింగ్ అవుతున్నప్పటికీ విడుదలపై క్లారిటీ లేకపోవడంతో ఫ్యాన్స్ కొంచెం కన్ఫ్యూజ్‌గా ఉన్నారు. ఇక ఈ సినిమాలో ఒక స్పెషల్ ఐటెం సాంగ్ ఉన్నట్టుగా కొన్ని రోజులు నుంచి రూమర్స్ వినిపిస్తూ వస్తున్నాయి. ఇలా ఓ బాలీవుడ్ బ్యూటీ దగ్గరకి ఈ టాక్ చేరుకుంది. దీని ప్రకారం బాలీవుడ్ బ్యూటీ 'నాగిని' ఫేమ్ మౌని రాయ్‌ని ఈ స్పెషల్ సాంగ్ కోసం అప్రోచ్ అయినట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా ఈ యూవీ క్రియేషన్స్ వారు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాని నిర్మాణం వహిస్తున్నారు.



## టిక్ టాక్ చేద్దామా పాట విడుదల

సరికొత్త హారర్ కామెడీ మూవీగా ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేస్తోంది 'లోపలికి రా చెప్తా' సినిమా. ఈ చిత్రాన్ని మాస్ బంక్ మూవీస్ పతాకంపై కొండా వెంకట రాజేంద్ర, మనిషా జష్నాని, సుస్మిత అనాలా, సాంచిరాయ్ హీరో హీరోయిన్లుగా లక్ష్మి గణేష్, వెంకట రాజేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. హీరో శ్రీ విష్ణు చేతుల మీదుగా టిక్ టాక్ చేద్దామా అనే పాటను ఆవిష్కరించారు. జూలై 5వ తేదిన ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం దేవ్ జాండ , డిఓపి: రేవంత్ లేవాక, అరవింద్ గణేష్, ఎడిటర్: వంశీ పని చేశారు.

## 4న సోనీలో 'ది హంట్: ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్



మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ హత్య ఆధారంగా 'ది హంట్: ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్'ను జాతీయ అవార్డు గ్రహీత నాగేష్ కుకునూర్ తెరకెక్కించారు. అనిరుధ్య మిత్ర బెస్ట్ సెల్లింగ్ పుస్తకం 'నైన్టీ డేస్' నుంచి ఈ సిరీస్‌ను నగేష్ కుకునూర్ రూపొందించారు. ఆ కేసుని ఛేదించే క్రమంలో సిట్‌కు నాయకత్వం వహించిన వారు కార్తికేయన్. ఆయన పాత్రను అమిత్ సియాల్ పోషిస్తున్నారు. ఈ మేరకు అమిత్ సియాల్ మాట్లాడుతూ..'ఒక నటుడికి ఇలాంటి ఓ గొప్ప పాత్రను పోషించే అవకాశం రావడం అదృష్టం.కార్తికేయన్ లాంటి గౌరవప్రదమైన, దృఢ నిశ్చయం ఉన్న వ్యక్తి పాత్రను బాధ్యతతో పోషించాల్సి ఉంటుంది. ఇది కేవలం రాజకీయ థ్రిల్లర్ కాదు. కార్తికేయన్ పేలుడు జరిగిన ప్రదేశాన్ని సందర్శించే క్షణం ఉంటుంది. అక్కడ శరీరం అయితే కనిపించ లేదు. ఎండిన రక్తానికి సంబంధించిన పెద్ద గుర్తు మాత్రమే ఉంటుంది. ఒకరిని కోల్పోవడం.. అసలు వీడ్కోలు చెప్పే వీలు కూడా లేని ఘటన ఎంతగానో కదిలిస్తుంటుంది. ఈ సిరీస్‌లో షఫీక్ ముస్తఫా, అంజనా బాలాజీ, బి.సాయి దినేష్, శ్రుతి జయన్, గౌరీ మీనన్ కీలక పాత్రల్లో నటించారు. 'ది హంట్: ది రాజీవ్ గాంధీ అస్సాసినేషన్ కేస్' సిరీస్ జూలై 4న సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

## అన్ని రకాల పనుల్లో పురోగతి పెంచేందుకు ఫీల్డ్ విజిట్ చేయాల్సిందే

### రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదారబాద్:** రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని అన్ని రకాల పనుల్లో పురోగతి పెంచేందుకు ఖచ్చితంగా చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి ఫీల్డ్ విజిట్ చేయాల్సిందేనని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శాఖపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూనే ఉంటానని, ప్రతి సమీక్షకు పనుల పురోగతి చూపించాలన్నారు. ఎర్రమంజిల్ లోని ఆర్ అండ్ బి శాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ మన రాష్ట్ర వాటా రూ.300కోట్ల సిఆర్ఐఎఫ్ ఫండ్ వచ్చేలా కృషి చేశానని పేర్కొన్నారు. పనుల బిల్లులు క్లియర్ అవుతుంటే అదే స్థాయిలో పనులు కూడా వేగంగా జరగాలని, పనులు పూర్తి చేయించాల్సిన బాధ్యత అధికారులదేనని, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ అన్ని రకాల పనుల్లో ప్రగతిని చూపించాలన్నారు. హ్యామ్ రోడ్లు పది ప్యాకేజీలు మొదలు చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఇఎన్‌సి జయ భారతిని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్ స్పాట్స్, వర్టికల్ కరవ్స్ ముందే గుర్తించాలన్నారు. తెల్లాపూర్, అమీన్ పూర్, సంగారెడ్డి, మంచాల, చౌటుప్పల్ రోడ్లు, చిట్యాల, భువనగిరి, హాలియ, మల్లేపల్లి రోడ్లపై మంత్రి చర్చించారు. ప్రతి మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి ఆర్‌అండ్‌బి రోడ్ల కనెక్టివిటీ పెంచేందుకు భూ సేకరణ సమస్య కూడా లేకుండా ఇప్పటికే ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. హ్యామ్ రోడ్ల డిపీఆర్, టెండర్ ప్రాసెస్‌పై రెండు రోజుల్లో పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తానని మంత్రి తెలిపారు. సమావేశంలో ఇంచార్జి ఈఎన్‌సి టి.జయ భారతి, సిఈలు మోహన్ నాయక్, లక్ష్మ ణ్, రాజేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి, ఎస్‌ఈలు, ఈఈలు, పలువురు ఆర్‌అండ్‌బి ఇంజనీర్లు పాల్గొన్నారు. కాగా ఇటీవల ప్రమోషన్స్, పోస్టింగ్స్ పొందిన అధికారులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలువగా, వారికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## శిక్షణపై కార్యాచరణ రూపొందించాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు



**ప్రజాపక్షం/హైదారబాద్:** 'మిషన్ కర్మయోగి' సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, అధికారులకు, సిబ్బందికి పలు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు, ఆయా శాఖల వారీగా తగిన కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యం దిశగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సమాయత్తం చేసేందుకు విభాగాల వారీగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. హైదరాబాద్‌లోని బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ మిషన్ కర్మయోగి అధికారుల బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో మంగళవారం సమావేశమైంది. ఈ సమావేశంలో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బందికి వారీలో నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు 'మిషన్ కర్మయోగి' చేపట్టిన శిక్షణా కార్యక్రమాలను, కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ అడ్మినిస్ట్రేషన్ సభ్యురాలు డాక్టర్ అల్కా మిట్టల్ వివరించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ 'మిషన్ కర్మయోగి శిక్షణ' కార్యక్రమం అధికారులు, సిబ్బందికి చాలా ప్రయోజనకరంగా ఉంటుందని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు సమర్థవంతంగా అమలయ్యేందుకు ఈ శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడుతాయని వివరించారు. కాగా ఇదివరకే తెలంగాణ రాష్ట్రంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీ, ఫారెస్ట్ అకాడమీ, ఎక్సైజ్ అకాడమీ తదితర సంస్థలు సమర్థవంతంగా పలు శిక్షణా కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ సిబ్బందికి,అధికారులకు మార్గనిర్దేం చేస్తూన్నాయని ఆయన తెలిపారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మీడియా అకాడమీ తరపున ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టామని సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సి.హెచ్ ప్రియాంక వివరించారు. అలాగే సమాచార శాఖ అధికారులకు, సిబ్బందికి కూడా వృత్తి నైపుణ్యాన్ని పెంచే శిక్షణా కార్యక్రమాలు చేపడుతామన్నారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, రెవెన్యూ (సిటి, ఎక్సైజ్) ముఖ్యకార్యదర్శి ఎస్.ఎ.ఎం రిజ్వీ, జిఎడి (సర్వీసెస్) కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, జిఎడి కార్యదర్శి రఘునందన్ రావు, రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, పిసిసిఎఫ్ సువర్ణ, మహిళా సంక్షేమ కార్యదర్శి అనితా రామచంద్రన్, హెచ్ఎండిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సెర్ప్ సిఇఒ దివ్య, హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## 246 మంది భారతీయులు

(మొదటి పేజీ తరువాయి)

భారత హైకమిషన్‌కు పాక్ ప్రభుత్వం ఈ వివరాలు అందించిందని విదేశాంగ శాఖ వెల్లడించింది. వారిని త్వరగా విడుదల చేసి స్వదేశానికి పంపించాలని భారత ప్రభుత్వం ఈ సందర్భంగా పాక్‌ను కోరింది. అదే సమయంలో భారత్ కూడా తమ జైళ్లలో ఉన్న పాక్ ఖైదీల వివరాలున్న జాబితాను ఢిల్లీ లోని పాక్ హైకమిషన్‌కు అందించింది. మన అదుపులో పాక్ జాతీయులు, పాక్‌జాతీయులుగా పరిగణిస్తోన్న వారు 463 మంది ఉన్నారు. అందులో 382 మంది పౌర ఖైదీలు కాగా, 81 మంది జాలర్లు. 2008లో చేసుకున్న ఒప్పందం ప్రకారం& ఇరు దేశాలు ఏటా రెండు సార్లు (జనవరి 1, జులై 1) దౌత్యమార్గాల ద్వారా ఈ వివరాలను పరస్పరం పంచుకుంటాయి. ఈ ఒప్పందం ద్వారా భారత్ పాక్ మధ్య ఖైదీల గుర్తింపు, విడుదల ప్రక్రియ వేగవంతం అయింది.

## నివేదిక ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

దృష్టిలో పెట్టుకుని 40 శాతం డైట్, 200 శాతం కాస్మోటిక్ ఛార్జీలను పెంచి, డాక్టర్ల సూచన మేరకు పకడ్బందీ మెనూ ఖరారు చేసామని, ఈ మెనూ అన్ని సంక్షేమ హాస్టల్లో, గురుకులాల్లో ప్రముఖంగా కనిపించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వసతి గృహాల అదే భవనాలలో వసతులు ఎలా ఉన్నాయి, భవనాలు, యజమానుల వివరాల తో ఒక నివేదిక రూపొందించాలని డిప్యూటీ సిఎం సూచించారు. అన్ని వసతి గృహాల్లో దోమ తెరలు ఏర్పాటు చేయాలి, రన్నింగ్ వాటర్ సప్లైలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఉన్న విద్యార్థులందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డులు రూపొందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా మెడికల్, హెల్త్ అధికారులను సమన్వయం చేసుకుని హెల్త్ కార్డులు రూపొందించే కార్యక్రమం వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. విద్యార్థులకు ఏదైనా అనారోగ్యం ఏర్పడితే ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులు సంసిద్ధంగా ఉన్నాయని, వారి సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలన్నిటిపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ అవసరాలు తీర్చుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ అమలు తీరు, సొసైటీల వారిగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రగతిపై సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్‌సి గురుకుల సెక్రటరీ అలుగు వర్షిని, సాంఘిక సంక్షేమ శాఖ డిడి క్షితిజ, మైనారిటీ వెల్ఫేర్ కమిషనర్ షఫీ, బిసి గురుకుల సెక్రెటరీ సైదులు, ఎస్‌టి గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి , గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆధునిక టెక్నాలజీ అందిపుచ్చుకోవాలి

ఆధునికయుగంలో వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా సేవలు అందించేందుకు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో మంగళవారం ఎస్‌పిడిసిఎల్ ఉన్నతాధికారులు, డైరెక్టర్ల సమావేశంలో డిప్యూటీ సిఎం పలు సూచనలు చేశారు. ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్, వినియోగదారులకు మెరుగైన సేవలు, కార్యాలయంలో ఫైళ్ల పరిష్కారం వేగవంతంగా జరగడం వంటి పలు అంశాల ప్రాతిపదికగా ఎస్‌పిడిసిఎల్ ఐఎస్‌ఓ 9000 సర్టిఫికెట్ పొందడం పట్ల అధికారులకు డిప్యూటీ సిఎం అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మెరుగైన సేవల ద్వారా మరిన్ని అవార్డులు సాధించాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరా క్రమంలో ఎక్కడైనా ట్రిప్ అయితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం వచ్చే ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఎఫ్ఓఎంఎస్) అమలును నూటికి నూరు శాతం త్వరితగతిన చేయాలని అధికారులను డిప్యూటీ సిఎం ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారుఖీతో పాటు డైరెక్టర్లు, సిఇలు పాల్గొన్నారు.

## పంచాయితీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారన్నారు. తాను క్రిమినల్ లాయర్‌ను అని, అలాంటి వారిని వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. దమ్ముంటే నేరుగా ఎదురుగా పోరాడదామన్నారు.

### ఆ సన్నాసులను పట్టించుకోము : కిషన్ రెడ్డి

కొంతమంది సన్నాసులు బిజెపిపై ఆరోపణలు చేస్తున్నారని, అలాంటి వారిని పట్టించుకోమని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణకు బిజెపి ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారన్నారు. తెలంగాణకు ఏం చేశామో చర్చకు సిద్ధమని, ఎక్కడికి రమ్మన్నావస్తామని బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు సవాల్ విసిరారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, సచివాలయానికైనా, ట్యాంక్ బాండ్ కైనా, వరంగల్, కరీంనగర్ ఎక్కడికైనా వస్తామన్నారు. దోచు కున్నాది మీరు, ఆరోపణలు మాపై చేస్తారా?, మేం కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ఎవరితో కుమ్మక్కు కాలేదన్నారు. మేం ప్రజలతో కుమ్మక్కు అవుతామన్నారు. రేవంత్ రెడ్డి, కెసిఆర్ దయాదాక్షిణ్యాలు తమకు అవసరం లేదన్నారు. పనికిరాని నేతలకు జవాబు చెప్పమన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా, పార్టీ కార్యకర్తలే నిజమైన నాయకులన్నారు. రాష్ట్రంలో అన్నిరకాల సమస్యలకు రెండు పార్టీలే కారణమని విమర్శించారు. రేపు స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ప్రకటించారు. తమ పార్టీ అధ్యక్షుడు ఎవరు కావాలో తాము నిర్ణయిం చుకుంటామని, ప్రత్యర్థి పార్టీలు తమకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

## కల.. కలేనా?

(మొదటి పేజీ తరువాయి)

గద్దెనెక్కుతున్న ప్రజా ప్రతినిధులు ఆ తర్వాత మర్చిపోతున్నారు. స్టేడియాన్ని ఎన్నికల నినాదంగా వాడుకుంటున్నారు తప్ప నిర్మించడంలో విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలో జరిగే సమావేశంలో ప్రజాప్రతినిధులు మినీ స్టేడియం కోసం కృషి చేస్తామని చెప్పడం తప్ప ఆచరణలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. మినీ స్టేడియానికి ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ నిర్మాణం చేపట్టక పోవడంపై క్రీడాకారులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పాఠశాల పక్కన ప్రభుత్వ స్థలం మినీ స్టేడియానికి అనువుగా ఉంది.గతంలో దీన్ని మినీ స్టేడియానికి ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ మినీ స్టేడియం మంజూరు మాత్రం కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామీణ క్రీడాకారులను క్రీడ రంగాల్లో రాణించేందుకు స్టేడియం ఏర్పాటు చేయాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు.

### మినీ స్టేడియం లేక ఇబ్బందులు : మహమ్మద్ అసద్ (క్రీడాకారుడు)

మినీ స్టేడియం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఆటస్థలం లేక ప్రతిరోజు సాధన చేయడానికి ఇబ్బంబదిగా ఉంది. పాలకులు మినీ స్టేడియం నిర్మాణానికి హామీ ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదు.ఇప్పటికైనా ప్రభుత్వం మినీ స్టేడియం నిర్మించాలి.

### క్రీడా పోటీలకు దూరమవుతున్నాం : లక్ష్మ ణ్ (క్రీడాకారుడు)

మినీ స్టేడియం లేకపోవడంతో క్రీడా పోటీలకు దూరమవుతున్నాం. అనువైన మినీ స్టేడియం ఉంటే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పాలకులు ఎన్నికల్లో హామీలు ఇస్తున్నారు తప్ప స్టేడియం ఊసే లేదు. ప్రభుత్వం స్పందించి స్టేడియం మంజూరు చేయాలి.

### హామీలు ఇచ్చి విస్మరిస్తున్నారు : మహమ్మద్ ఆల్మస్ (క్రీడాకారుడు)

పాలకులు ఎన్నికల సమయంలో మినీ స్టేడియం నిర్మిస్తామని చెప్పి విస్మరిస్తున్నారు. మినీ స్టేడియం లేక క్రీడల్లో ప్రతిభ కనబరచలేకపోతున్నాం పాలకులు స్పందించి మినీ స్టేడియం నిర్మించాలి స్టేడియం నిర్మిస్తే జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబరుస్తాం.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com